
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 14-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 150 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 8.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 8.32 తదుపరి శ్రవణం; వర్జ్యం: తె. ఉ. 6.45, రా. 12.14-1.43; దుర్ముహూర్తం: ఉ. 6.06-7.43; అమృతఘడియలు: మ. 2.24-3.56; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



'వరద కారణంగా ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయిన మొదటి అంతస్తువారికి ఒక మొత్తం, రెండో ఫ్లోర్ నుంచి ఆ పైన ఉన్నవారికి కొంత మొత్తం ఇద్దాం. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలకు కూడా పరిహారం ఇద్దాం. పూర్తిగా ఇళ్లు దెబ్బతిన్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ఇళ్లు నిర్మించి ఇద్దాం. వరద బాధితులను ఆదుకోవడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సినదంతా చేస్తున్నాయి. బ్యాంకర్లు, బీమా సంస్థలు కూడా మాకు సహకరించాలి. ఇప్పటి నుంచి వారంలోగా వరద నష్టం క్లెయిమ్‌లను పరిష్కరించాలి. క్లెయిమ్‌ల పరిష్కారంలో వేగంతో పాటు సరైన న్యాయం అందడం కూడా అవసరమే"

- మంత్రులు, బ్యాంకర్లతో చంద్రబాబు



వరద బాధితులకు పరిహారంపై మంత్రులు, అధికారులతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు

అందరికీ సాయం

చివరి బాధితుడి వరకు న్యాయం

17న వరద పరిహారం అందిద్దాం

మంత్రులు, అధికారులకు సీఎం నిర్దేశం

- శాస్త్రీయంగా వరద నష్టం జాబితాలు రూపొందించాలి
- పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ల స్థానంలో కొత్తవి ఇద్దాం
- మొదటి, రెండో అంతస్తుల్లోని వారికీ పరిహారం
- దెబ్బతిన్న వాహనాలు, వస్తువులకు కొంత సాయం
- వరద నష్టాల క్లెయిమ్‌లు వారంలో పరిష్కరించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషికి మీరూ సహకారమివ్వండి
- బ్యాంకర్లు, బీమా సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు
- మూడు నెలల్లోగా గుంతల్లేని రోడ్లు కనిపించాలి
- రహదారి మరమ్మతులకు రూ.476 కోట్లు ఖర్చు
- ఆర్‌అండ్‌బీ, ఆర్థిక శాఖలకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి), విజయవాడ వన్‌టౌన్ : భారీ వర్షాలు, వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన ప్రతి బాధితుణ్ని ఆదుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చివరి బాధితుడి వరకు ప్రభుత్వ సాయం చేరాలని స్పష్టం చేశారు. వరద సహాయక చర్యల పట్ల ప్రజలు సంతృప్తితో ఉన్నారని, వారికి పరిహారం విషయంలో శాస్త్రీయంగా ఆలోచన చేసి, జాబితా రూపొందించాలని సూచించారు. నష్టం అంచనాలు, పరిహారం విషయమై శుక్రవారం అమరావతి సచివాలయంలోను, విజయవాడ కలెక్టరేట్‌లోనూ ముఖ్యమంత్రి... పలువురు మంత్రులు, అధికారులు, బ్యాంకర్లు, బీమా కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. నష్టం అంచనాలు పూర్తి చేస్తే

మిగతా 11వ పేజీలో...

ఏలేరుకు మళ్లీ పెరిగిన వరద

రిజర్వాయర్ నుంచి 4,875 క్యూసెక్కులు విడుదల

13 వేల ఎకరాల్లోని పంట పొలాలు ముంపులోనే

బంగాళాఖాతంలో వాయుగుండం

కేజ్రీకి బెయిల్

సీబీఐ కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు



- ఇంతకుముందే ఈడీ కేసులో విముక్తి
- జైలు నుంచి విడుదలైన ఢిల్లీ సీఎం
- విచారణ సందర్భంగా సీబీఐ తీరును తప్పుబట్టిన అత్యున్నత న్యాయస్థానం
- బెయిల్ మీద విడుదలవుతుంటే అరెస్టు చేయాల్సినంత తొందరేమిటి?
- పంజరంలో చిలకలా ఉండొద్దు
- దర్యాప్తు సంస్థకు ధర్మాసనం హితవు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించి సీబీఐ నమోదు చేసిన కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నేర నిరూపణ జరగకుండా నిందితులను సుదీర్ఘకాలంపాటు జైలులో నిర్బంధించటం వారి వ్యక్తిగత స్వేచ్ఛ హక్కును హరించడమేనని అత్యున్నత న్యాయస్థానం మరోమారు స్పష్టం చేసింది. పంజరంలో చిలకలా కాకుండా.. స్వేచ్ఛగా తిరిగే చిలకలా ఉండాలని సీబీఐకి హితబోధ చేసింది. ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ దాఖలు చేసిన అభియోగాల నుంచి కేజ్రీవాల్‌కు గతంలోనే బెయిల్ లభించిన విషయం తెలిసిందే. అయితే, అదే కేసులో సీబీఐ ఆయనను

మిగతా 2వ పేజీలో...



కాకినాడ జిల్లా ఇసుకపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్

నిజమే.. ఏలేరు ఆధునికీకరణ

చేపట్టలేదు

మా ప్రభుత్వం ఆ పనులు చేయలేదు

కాకినాడ జిల్లా పర్యటనలో జగన్ ఒప్పుకోలు

- దానికి వింత సమర్థనలు.. పచ్చి అబద్ధాలు
- ఆధునికీకరణ చేపడితే క్రాప్ హాలిడే ఇవ్వాలట
- వర్షాలు, రిజర్వాయర్ నిండుగా ఉండడం వల్లే ఐదేళ్లపాటూ పనులు చేయలేకపోయారట!
- ఏలేరు ముంపు గ్రామాల్లో జగన్ షో
- నీటిలో దిగకుండా రోడ్డుపైనే పరామర్శలు
- వరద బాధితులతో పొడి పొడిగా మాటలు
- ముంపు చూడాలని కోరినా పట్టించుకోని జగన్
- బాణసంచా కాల్చిన వైసీపీ శ్రేణుల తీరుపై బాధితుల ఆగ్రహం

కాకినాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏలేరు ఆధునికీకరణ పనులు చేపట్టలేకపోయిన మాట వాస్తవమేనని మాజీ సీఎం జగన్ అంగీకరించారు. తాను అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు భారీ వర్షాలు, ప్రాజెక్టు నిండా నీరు ఉండడం వల్లే ఆ పనులు చేయలేకపోయినట్టు అడ్డగోలు వాదన వినిపించారు. ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు చేయాలంటే క్రాప్‌హాలిడే ప్రకటించాల్సి ఉంటుందని, దానివల్ల రైతులు నష్టపోతారనే కారణంతోనే పనులు చేయకుండా నాడు

మిగతా 11వ పేజీలో...



ఇసుక అక్రమ తవ్వకాలపై కేసుల నమోదులో జాప్యమెందుకు?

అంత తాత్సారమా?

జగన్ సర్కారు వ్యవహరించిన తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- ఆదేశాలు జారీ చేశాక కూడా ఆలస్యంగా నోటీసులు ఇచ్చారని ఆక్షేపణ
- సర్కారు మారాకే అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు మొదలుపెట్టాం
- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి.. నవంబరు 14లోపు అఫిడవిట్‌కు ధర్మాసనం ఆదేశం

11



అబూజ్‌మడ్‌లో ఆర్మీ యుద్ధ అభ్యాస కేంద్రం!

2

- ట్యాంకులు, ఫిరంగులు తదితర ఆయుధాలు, యుద్ధ వ్యూహాలపై శిక్షణ
- నక్సలిజంపై పోరులో కీలక పరిణామం.. 1,34,778 ఎకరాల సేకరణకు కేంద్రం ఓకే
- ఛత్తీస్‌గఢ్- మహారాష్ట్ర- తెలంగాణ మధ్య మావోయిస్టులకు చెక్ పెట్టడమే లక్ష్యం



గనుల వెంకటరెడ్డి కోసం

గాలింపు

- మూడు చోట్ల ఏసీబీ సోదాలు
- గనుల శాఖ ఆఫీసులోనూ తనిఖీలు
- కీలక పత్రాలు స్వాధీనం
- ఇసుక అక్రమాలు 2,566 కోట్లపైనే
- కంపెనీలతో కలిసి వెంకటరెడ్డి కుట్ర
- కుట్రపూరితంగా జేపీ వెంచర్స్‌కు 120 కోట్ల బ్యాంకు గ్యారెంటీలు
- ప్రభుత్వానికి తీవ్ర నష్టం: ఏసీబీ

12

కృష్ణా జలాలపై మాకు హక్కు ఉంది

- గోదావరి జలాలను వాడుకుంటున్నాం కాబట్టి, హక్కు లేనదడం సరికాదు
- కృష్ణాపైనే రాయలసీమ ఆధారపడి ఉంది
- తెలంగాణ వాదనంతా తప్పు
- ట్రైబ్యునల్‌కు రాష్ట్రం లేఖ

11

ఇంకా జగన్ జపమేనా

ఆయన ఫొటోలతోనే రెవెన్యూ రికార్డుల జారీ

ప్రభుత్వం మారి 3 నెలలైనా మారని తీరు

- రైతులకు ఇచ్చే అడంగల్ కాపీపై ఇంకా జగన్ ఫొటో, నవరత్నాల లోగో
- సచివాలయాల ద్వారా ఇచ్చే పత్రాలు సర్టిఫికెట్లపై ఆయన బొమ్మలే దర్శనం
- తొలగించాలని చంద్రబాబు ఆదేశించినా తీరు మార్చుకోని అధికారులు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం



ఎన్టీఆర్ జిల్లాలో ఓ రైతుకు ఇచ్చిన అడంగల్ కాపీపై జగన్ ఫొటో, నవరత్నాల లోగో

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ పార్టీని ప్రజలు ఘోరంగా ఓడించినా ప్రభుత్వ శాఖలు మాత్రం ఆయన జపమే చేస్తున్నాయి. ఇంకా జగనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి అన్నట్లుగా కీలక ప్రభుత్వ రికార్డుల్లో ఆయన ఫొటోలనే అచ్చేస్తున్నాయి. వాటిని ప్రజలకు అందిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో కూడా జగన్ ఫొటోలే వేస్తున్నారేమిటని ప్రజలు విస్తుపోతున్నారు. అధికారుల తీరులో మాత్రం

మిగతా 12వ పేజీలో...



ముందు భాగమంతా నుజ్జునుజ్జుగా మారిన బస్సు

ఇద్దరు డ్రైవర్లు సహా ఏడుగురు దుర్మరణం

లారీ టెర్రర్

డివైడర్‌ను దాటి ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- అదే సమయంలో మరో లారీ ఢీకొని నలిగిన బస్సు
- 31 మందికి గాయాలు.. 8 మందికి ఆస్పత్రిలో చికిత్స
- చిత్తూరు జిల్లాలో ఘోరం.. సీఎం తీవ్ర దిగ్భ్రాంతి
- మృతులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

3



'లాల్ సలామ్ కామ్రేడ్'

» సీతారాం ఏచూరికి జేఎన్‌యూ విద్యార్థుల ఘన నివాళి



ఏచూరికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: జవహలాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)కు చెందిన వందలాది మంది విద్యార్థులు, అధ్యాపకులు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం ఘన నివాళి అర్పించారు. జేఎన్‌యూఎస్‌యూ కార్యాలయంలో ఉంచిన సీతారం ఏచూరి పార్థివ దేహాన్ని సందర్శించి లాల్ సలామ్ కామ్రేడ్ అంటూ నినదిస్తూ వీడ్కోలు పలికారు. జేఎన్‌యూ పూర్వ విద్యార్థి అయిన సీతారాం ఏచూరి.. 1977-78 మధ్య జేఎన్‌యూఎస్‌యూ(జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్) అధ్యక్షుడిగా 3సార్లు పని చేశారు.

అబూజ్‌మడ్‌లో ఆర్మీ యుద్ధ అభ్యాస కేంద్రం!

» నక్సలిజంపై పోరులో కీలక పరిణామం

భూపాలపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల ఉద్యమానికి ఆయువుపట్టుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో భారత సైన్యం పాగా వేయనుంది. ఈ ప్రాంతంలో యుద్ధ అభ్యాస కేంద్రం ఏర్పాటుకు మోదీ సర్కారు సన్నద్ధమవుతోంది. నారాయణపూర్ జిల్లా ఓర్చా మండలం సోన్‌పూర్ గర్పా అటవీ ప్రాంతంలో ఈ అభ్యాస కేంద్రం ఏర్పాటు కానుంది. దీంతో మావోయిస్టు ఉద్యమంపై మరింత ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. 4 వేల చ.కి.మీ. మేర విస్తరించి ఉన్న అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఎక్కడ ఏం ఉంటుందో ఇప్పటివరకూ ఎవరికీ తెలియదు. ఇదో మార్మిక ప్రాంతంగా గుర్తింపు పొందింది. గోండిభాషలో అబూజ్ అంటే రహస్యమైన (మార్మిక) కొండలు కలిగిన ప్రాంతమని అర్థం. ఇలాంటి దట్టమైన అడవిని, కొండలను కేంద్ర స్థానంగా చేసుకొని మావోయిస్టు పార్టీ ఇక్కడ సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతోంది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ అధికారుల జాడ ఉండదు. అలాంటి అబూజ్‌మడ్‌లో ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పోలీస్ స్థావరాలను ఏర్పాటు చేసి ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై పైచేయి సాధిస్తూ వస్తున్నాయి. సైనిక యుద్ధ అభ్యాసన కోసం గుర్తించిన స్థలం కూడా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మధ్య మావోయిస్టులకు గట్టి పట్టున్న ప్రాంతానికి మధ్యలో ఉండడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ఈ యుద్ధ అభ్యాస కేంద్రానికి అనుమతి ఇవ్వడం ద్వారా నక్సలైట్ల ఏరివేత ఆపరేషన్లలో దూకుడుగా వెళ్తున్న పోలీస్ బలగాలకు మరింత చేయూతనిచ్చినట్లు అవుతుందని భావిస్తున్నారు. సైనికులు యుద్ధ అభ్యాసం కోసం ఈ శిబిరంలో పాల్గొంటారే తప్ప నక్సలైట్ల ఏరివేతకు, దీనికి సంబంధం లేదని ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నప్పటికీ స్థావరం ఏర్పాటు వల్ల నాలుగు అంచెల రక్షణ వ్యవస్థలు అందబాటులోకి వస్తాయని నిపుణులు చెబుతున్నారు. తద్వారా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో నక్సలైట్ల ఏరివేత మరింత సులభతరం అవుతుందని పేర్కొంటున్నారు. ఇక్కడ యుద్ధ అభ్యాస కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన 2017లోనే తెరపైకి వచ్చింది. అప్పట్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, గడ్చిరోలి తదితర జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి సర్వేలు కూడా జరిపారు. మహారాష్ట్ర, ఛతీస్‌గఢ్‌లో ఏరియల్ సర్వేలూ చేపట్టారు. ఇటీవల కేంద్ర పర్యావరణ శాఖ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా యుద్ధ అభ్యాస కేంద్రానికి అవసరమైన స్థలం సేకరించి ఇచ్చేందుకు అంగీకరించడంతో త్వరలోనే భూసేకరణ ప్రక్రియ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే నారాయణపూర్ జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

యుద్ధ అభ్యాస కేంద్రానికి 54 వేల హెక్టార్లు..

సైనిక యుద్ధ అభ్యాస కేంద్రానికి మొత్తం 54,543 హెక్టార్లకు పైగా స్థలాన్ని సేకరించనున్నారు. స్థలాన్ని సేకరించే బాధ్యత ఛత్తీస్‌గఢ్ సర్కారు నారాయణపూర్ కలెక్టర్‌కు అప్పగించింది. త్వరగా స్థలాన్ని సేకరించి సైన్యానికి అందజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. ఈ కేంద్రం వల్ల అత్యవసర పరిస్థితుల్లో సైనిక బలగాలు సిద్ధంగా ఉండేలా వివిధ ట్యాంకులు, ఫిరంగులు వంటి పలు ఆయుధాలపై శిక్షణ, యుద్ధ వ్యూహాల అమలు వంటి కీలక అంశాలపై పునశ్చరణ చేసుకునే వీలు కలుగుతుందని ఓ పోలీస్ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

హైజాకైన విమానంలో నాన్న.. విడిపించే బృందంలో నేను..

» 1984నాటి సంఘటనను గుర్తుచేసుకున్న జైశంకర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: వివాదాస్పదంగా మారిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'ఐసీ 814 కాందహార్ హైజాక్'పై విదేశాంగ మంత్రి జైశంకర్ శుక్రవారం స్పందించారు. ఆ సిరీస్‌ను తాను ఇంకా చూడనప్పటికీ దర్శకులు మాత్రం ప్రభుత్వంపై సదభిప్రాయాన్ని కలిగించలేదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులు 1999లో భారత విమానాన్ని కాందహార్‌కు హైజాక్ చేశారు. ఈ సిరీస్‌పై అభిప్రాయం చెబుతునే 1984లో జరిగిన మరో విమానం హైజాక్ ఉదంతాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. జెనీవాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. "1984లో ఓ విమానం హైజాక్ జరిగింది. అప్పుడు నేను యువ అధికారిని. ఆ విమానాన్ని విడిపించే బృందంలో పనిచేస్తున్నాను. హైజాక్ అయిన ఆ విమానంలో మా నాన్న ఉన్నారని అప్పుడే తెలిసింది! హైజాకర్ల నుంచి విమానాన్ని విడిపించే బృందంలో నేనున్నాను.. తమ వారిని రక్షించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నవారిలో మా కుటుంబ సభ్యులు ఉన్నారు. ఇదో విచిత్ర పరిస్థితి" అని జైశంకర్ చెప్పారు. జైశంకర్ తండ్రి సుబ్రమణ్యం ఐఏఎస్ అధికారి.

కేజ్రీకి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేయటంతో.. జైలు నుంచి విడుదల కాలేదు. ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్‌ను నిరాకరించింది. దీంతో, కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. బెయిల్ కోసం కేజ్రీవాల్ తొలుత విచారణ కోర్టుకు వెళ్లలేదని, కాబట్టి, ఆయన విజ్ఞప్తిని విచారణ కోర్టుకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. బెయిల్ కోసం తొలుత ట్రయల్ కోర్టుకు వెళ్లాలన్నది వాస్తవమేనని ధర్మాసనం అంగీకరిస్తూ.. హైకోర్టు ఈ కేసుపై విచారణ జరిపినప్పుడు.. కేసును కింది కోర్టుకు బదిలీ చేసి ఉండాల్సిందని స్పష్టం చేసింది. 'ఈ దశలో ఇప్పుడు, తిరిగి ఈ కేసును విచారణ కోర్టుకు పంపించటం సరైంది కాదు. బెయిల్ వ్యక్తిగత స్వేచ్ఛతో ముడివడిన అంశం. ఇటువంటి కేసులను వాటిలో ఉన్న సానుకూలతల (మెరిట్స్) ఆధారంగా నిర్ణయించాలేగానీ.. సాంకేతిక అంశాలను చూపుతూ కోర్టుల మధ్య తిరిగేలా చేయకూడదు' అని పేర్కొంది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో దర్యాప్తు సమీప భవిష్యత్తులో పూర్తయ్యేలా లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

న్యాయమూర్తులు.. విడిగా తీర్పులు

కేజ్రీవాల్‌కు బెయిల్ ఇస్తూనే.. తీర్పును న్యాయమూర్తులిద్దరూ వేర్వేరుగా వెలువరించారు. జస్టిస్ సూర్యకాంత్ 27 పేజీల తీర్పును, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ 33 పేజీల తీర్పును ఇచ్చారు. సీబీఐ తీరును జస్టిస్ భుయాన్ ప్రశ్నించారు. ఈడీ కేసులో బెయిల్ వచ్చి జైలు నుంచి కేజ్రీవాల్ విడుదలయ్యే తరుణంలో ఆయనను సీబీఐ అరెస్టు చేయటాన్ని ప్రశ్నించారు. 'దేశంలోని ఒక ఉన్నతస్థాయి దర్యాప్తు సంస్థ సీబీఐ. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సీబీఐ నిష్పక్షపాతంగా ఉండటమే కాదు.. అలా ఉన్నట్లు కనిపించాలి. సీజర్ భార్యలాగా ఒక దర్యాప్తు సంస్థ కూడా నిష్కాక్షికంగా ఉండాలి. కొంతకాలం కిందటే ఈ కోర్టు సీబీఐని పంజరంలో చిలకతో పోల్చింది. తనపై ఉన్న ఈ ముద్రను సీబీఐ తొలగించుకోవాలి' అని జస్టిస్ భుయాన్ హితవు పలికారు. (దర్యాప్తు మొదలైన తర్వాత) 22 నెలల సుదీర్ఘ కాలవ్యవధిలో లేని తొందర.. ఈడీ బెయిల్ మంజూరు చేయగానే ఎందుకు వచ్చింది? అప్పటికప్పుడే కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారు? అని నిలదీశారు. ఇవే అభియోగాలకు సంబంధించి ఈడీ కేసులో బెయిల్ లభించిన వ్యక్తిని ఇంకా జైలులో నిర్బంధించటం అంటే న్యాయాన్ని నిరాకరించటమేనన్నారు.

మద్యం కేసు ఫైళ్లపైనే ఆంక్షలు: సింఘ్వీ

ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన ఫైళ్లు తప్ప ఇతర ఏ ఫైల్ మీదైనా సీఎం కేజ్రీవాల్ సంతకం చేయవచ్చని, బెయిల్ ఆంక్షలు కేవలం మద్యం పాలసీ ఫైళ్లకు మాత్రమే పరిమితమని ఆయన తరఫున వాదించిన అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కేజ్రీవాల్ విడుదలయ్యారుకానీ.. ఎటువంటి అధికారాలు ఉండవంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కేజ్రీవాల్ అధికారాల్ని ఢిల్లీ ప్రభుత్వం లేదా రాష్ట్రపతి పాలన తప్ప మరే శక్తీ తొలగించలేదని పేర్కొన్నారు.



కేజ్రీవాల్, సిసోదియా ఆత్మీయ ఆలింగనం

సీఎం ఆఫీసుకు వెళ్లొద్దు..

సీఎం కార్యాలయానికి, ఢిల్లీ సచివాలయానికి వెళ్లొద్దని, అధికారిక ఫైళ్లపై సంతకం చేయవద్దని, ఏదైనా ఫైల్ మీద సంతకం తప్పనిసరైతే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతి తీసుకోవాలని కేజ్రీవాల్ మీద ఈడీ కేసులో బెయిల్ ఆంక్షలు ఉన్నాయి. కాగా, ప్రస్తుత సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తూ.. ఈడీ కేసు బెయిల్‌లో విధించిన ఆంక్షలనే విధించటం గమనార్హం. రూ.10 లక్షల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, ఇదే మొత్తంతో ఇద్దరు ష్యూరిటీ ఇవ్వాలని పేర్కొంటూ బెయిల్ ఇచ్చింది. కేసుపై బహిరంగంగా ఎటువంటి వ్యాఖ్యానాలు చేయవద్దని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కేజ్రీవాల్‌ను ఈడీ మార్చి 21వ తేదీన అరెస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10న ఆయనకు తాత్కాలిక బెయిల్ లభించింది. జూన్ 3వ తేదీన ఆయన తిరిగి జైలుకు వెళ్లారు. జూలై 12న ఈడీ కేసులో బెయిల్ లభించింది.



కేజ్రీకి బెయిల్ రావడంతో ఆప్ కార్యకర్తల సంబరాలు

మనోధైర్యం 100 రెట్లు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: కేజ్రీవాల్ తీహాడ్ జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. అనంతరం జైలు దగ్గర తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన ఆప్ కార్యకర్తలను ఉద్దేశించి ఓ వాహనం పై నుంచి మాట్లాడుతూ... జైలు గోడలు తన మనోధైర్యాన్ని దెబ్బతీయలేవని, జైలుకు పంపాక తన మనోధైర్యం 100 రెట్లు పెరిగిందని చెప్పారు. దేశాన్ని బలహీనపరచాలని చూస్తున్న జాతి వ్యతిరేక శక్తులపై తన పోరాటం ఆగదన్నారు. ఈ సందర్భంగా ఇంక్విలాబ్ జిందాబాద్, వందే మాతరం... అని కేజ్రీవాల్ నినదించారు. తన విడుదల కోసం ప్రార్థించిన వారికి ధన్యవాదాలు చెప్పారు. వర్షంలోనూ తన కోసం వచ్చిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తన ప్రతి రక్తపు బొట్టు దేశ సేవ కోసమేనన్నారు. తన జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించానని, అయితే దేవుడు ఆ కష్ట సమయాల్లో తనకు మద్దతుగా ఉన్నాడని.. తాను నిజాయితీపరుడిని కనుక ఇప్పుడూ తన వెంటే నిలిచాడని చెప్పారు. పంజాబ్ సీఎం భగ్వంత్ మాన్, ఢిల్లీ మాజీ ఉప ముఖ్య మంత్రి మనీశ్ సిసోదియా, వందలాది మంది ఆప్ కార్యకర్తలు కేజ్రీవాల్‌కు స్వాగతం పలికారు.

సత్యం ఎప్పటికీ ఓడిపోదు..

» బీజేపీ నియంతృత్వం వీడాలి: ఆప్

» పదేళ్లుగా దర్యాప్తు సంస్థల దుర్వినియోగం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: అధినేత కేజ్రీవాల్‌కు బెయిల్ లభించడంపై ఆప్ సంతోషం వ్యక్తం చేసింది. కేజ్రీలాంటి నిజాయతీపరుడిని జైల్లో పెట్టినందుకు దేశానికి క్షమాపణ చెప్పాలని బీజేపీని డిమాండ్ చేసింది. సత్యానికి సమస్యలు ఎదురవొచ్చని.. ఎప్పటికీ ఓడిపోదని పేర్కొంది. బీజేపీ అబద్ధాలు బయటపడ్డాయని.. ఇకనైనా నియంతృత్వం వీడాలని హితవు పలికింది. ఈడీ, సీబీఐలు బీజేపీ చెప్పినట్లు పలికే చిలుకలు అని అభివర్ణించింది. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేసింది. అసత్యాలు, కుట్రలపై నిజం గెలిచిందని ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అన్నారు. కష్ట కాలంలో తమకు అండగా నిలిచిన కార్యకర్తలకు కేజ్రీ సతీమణి సునీత ధన్యవాదాలు తెలిపారు. పదేళ్లగా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని తక్కువ సీట్లకే పరిమితం చేశారని తెలిపింది. కేజ్రీకి బెయిల్ లభించడాన్ని రాజ్యాంగం సాధించిన విజయం అని ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ అన్నారు. రాజ్యాంగ వ్యతిరేకులైన బీజేపీకి చెంపపెట్టు అని పేర్కొన్నారు. కాగా, కేజ్రీకి వచ్చింది షరతులతో కూడిన బెయిల్ మాత్రమేనని బీజేపీ పేర్కొంది. నిన్నటివరకు ఆయన జైల్‌వాలా అని.. నేడు బెయిల్‌వాలా అయ్యారని ఎద్దేవా చేసింది. సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయాలని.. కానీ, నైతికత ఏమాత్రం లేని ఆయన ఆ పని చేయరని వ్యాఖ్యానించింది.

లోకం తీరు



హరియాణాలో ఆప్‌నకు ఊపు!

» అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: అధినేత కేజ్రీవాల్ జైలు నుంచి విడుదల హరియాణా ఎన్నికల్లో తమ పార్టీకి మేలు చేస్తుందని ఆప్ శ్రేణులు భావిస్తున్నాయి. ఢిల్లీ పొరుగునే ఉండే ఈ రాష్ట్రంలో అక్టోబరు 5న పోలింగ్ జరగనుంది. కాంగ్రెస్‌తో పొత్తు చర్చలు కొలిక్కి రాకపోవడంతో ఆప్ ఒంటరిగా పోటీ చేస్తోంది. మరోవైపు మొత్తం 90 సీట్లకు గాను కాంగ్రెస్ 89 చోట్ల బరిలో దిగింది. ఒక స్థానాన్ని సీపీఎంకు ఇచ్చింది. వాస్తవానికి ఆనుకుని ఉండే ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్నప్పటికీ హరియాణాలో ఆప్ ఇంతవరకు ఒక్క సీటూ గెలవలేదు. ఈ సారి ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో కలిసి వెళ్లాలని తొలుత భావించినా అది కుదరలేదు. దీంతో 40 సీట్లలో అభ్యర్థులను దింపింది. కాగా, 2019 ఎన్నికల్లో 46 సీట్లలో పోటీ చేసిన ఆప్.. ఒక్క శాతం ఓట్లు కూడా సాధించలేకపోయింది. నోటా కంటే కొన్ని ఎక్కువ ఓట్లు మాత్రమే పొందింది. ఈసారి ఎన్నికలు మరింత ప్రతిష్ఠాత్మకంగా మారడం, నిన్నటివరకు కేజ్రీవాల్ జైల్లో ఉండడంతో హరియాణాలో ఆప్ ప్రచారాన్ని భుజాన మోసేదెవరనే ప్రశ్న వేధించింది. ఇప్పుడు కేజ్రీ బయటకు రావడంతో ఎన్నికల్లో పోరాటానికి శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం వచ్చింది. కేజ్రీ ప్రసంగాలు, సూటి ప్రశ్నలు ఓట్లు రాలుస్తాయని భావిస్తున్నాయి. కొందరు కార్యకర్తలైతే ఆయన ఎన్నికల ముఖచిత్రాన్ని మారుస్తారని అంటున్నారు. హరియాణా ఎన్నికల బాధ్యత మొత్తాన్ని కేజ్రీనే మోస్తారని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. కేజ్రీ విడుదల హరియాణాలో పార్టీకి పునరుత్తేజం చేస్తుందని మరో నాయకుడు పేర్కొన్నారు. వివిధ కీలక అంశాలపై ఇప్పటివరకు పార్టీ విధానాలను స్పష్టంగా చెప్పలేకపోయామని, ఇకపై ఆ బెంగ లేదన్నారు.

ఉల్లి, బాస్మతి బియ్యం ఎగుమతులకు కనీస ధర ఎత్తివేత

» మహారాష్ట్ర, హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: మహారాష్ట్ర, హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉల్లి, బాస్మతి బియ్యం ఎగుమతులకు సంబంధించిన కనీస ధరను శుక్రవారం ఎత్తివేసింది. విదేశాలకు వీటి ఎగుమతులకు ఊతమివ్వడానికే కాకుండా రైతుల ఆదాయం పెరగడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది. పంజాబ్‌తోపాటు హరియాణా బాస్మతి బియ్యాన్ని ప్రధానంగా ఉత్పత్తి చేస్తున్నాయి. మహారాష్ట్రలో రైతులు ఎక్కువగా ఉల్లిని సాగుచేస్తుంటారు. తాజా నిర్ణయం వల్ల ఈ రైతులకు ప్రయోజనం కలుగనుంది. వాణిజ్య విభాగం సమాచారం ప్రకారం.. బాస్మతి బియ్యంపై టన్నుకు 950 డాలర్లుగా ఉన్న కనీస ఎగుమతి ధరను తొలగించారు. ఇక ఉల్లి విషయానికి వస్తే.. ఈ ఏడాది మే నెలలో ఉల్లి ఎగుమతులపై ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది. కానీ టన్ను ఉల్లి ఎగుమతులకు కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ను 550 డాలర్లుగా నిర్ణయించింది. ఈ మేరకు రైతులు ఉల్లిగడ్డలను ఈ రేటుకన్నా తక్కువకు విదేశీ మార్కెట్లకు విక్రయించడానికి వీలుండదు. తాజాగా ఉల్లిపై ఎంఈపీ తొలగించారు. ఇదిలా ఉండగా.. ధరల పెరుగుదలను నియంత్రించే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గోధుమ నిల్వలపై శుక్రవారం మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా వ్యాపారులు, టోకు అమ్మకందారులు, బిగ్ చెయిన్ రిటైలర్లు, ప్రాసెసర్ల వద్ద ఉండాల్సిన నిల్వల పరిమితులను మరింత కుదించింది. వ్యాపారులు కేవలం 2వేల టన్నుల గోధుమలను మాత్రమే నిల్వ ఉంచుకోవడానికి అనుమతిస్తారు.

జీఎస్‌టీ తగ్గింపు కోరితే క్షమాపణ చెప్పిస్తారా?

ఇది అధికార దురహంకారం.. కేంద్ర మంత్రి నిర్మలపై ఖర్గే, రాహుల్ ధ్వజం

» కోవైలో ప్రముఖులతో ఆర్థిక మంత్రి భేటీ

» జీఎస్‌టీలో లోపాలున్నాయన్న అన్నపూర్ణ గ్రూప్ హోటల్స్ యజమాని శ్రీనివాసన్

» తర్వాత క్షమాపణ.. నిర్మలపై కాంగ్రెస్ ఫైర్

చెన్నై-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: జీఎస్‌టీ తగ్గించాలని అడిగిన ఓ హోటల్ గ్రూపు యజమానితో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ క్షమాపణ చెప్పించుకున్నారంటూ వైరల్ అయిన ఓ వీడియో రాజకీయంగా కలకలం రేపింది. ఆమెపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్‌గాంధీ శుక్రవారం విరుచుకుపడ్డారు. ఆమెది అధికార దురంహకారమని ధ్వజమెత్తారు. ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిర్మలా సీతారామన్ ఈ నెల 11న తమిళనాడులోని కోయంబత్తూరు వెళ్లారు. అక్కడ ఆమెతో భేటీ అయ్యేందుకు ప్రముఖులను ఆహ్వానించారు. అన్నపూర్ణ గ్రూపు హోటల్స్ చైర్మన్ శ్రీనివాసన్ కూడా వెళ్లారు. ఈ సందర్భంగా బన్‌పై జీఎస్‌టీ లేదని.. కానీ దానిపై క్రీమ్ రాస్తే 18% జీఎస్‌టీ వేస్తున్నారని.. దీంతో కస్టమర్లు ఈ రెంటినీ వేర్వేరుగా అడుగుతున్నారని, క్రీమ్ తామే బన్‌పై పూసుకుంటామని చెబుతున్నారని ఆయన ప్రస్తావించారు. ఉత్తరాదివారు స్వీట్లు ఎక్కువ తింటారని.. వాటిపై మంత్రి 5 శాతమే జీఎస్‌టీ వేశారని.. దక్షిణాదిన, తీపి, ఉప్పు, కాఫీ కలిపి తీసుకుంటారని.. దీనిపై మాత్రం 12% వేశారని జనం అనుకుంటున్నారని.. జీఎస్‌టీ గందరగోళంతో కంప్యూటర్ కూడా పనిచేయడం లేదని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఆయన చెప్పింది పరిశీలిస్తానని ఆ తర్వాత ఆమె తెలిపారు. ఈ వ్యవహారంపై మర్నాడు ఆయన ఆమెను కలిసి తనకే పార్టీతో సంబంధం లేదంటూ క్షమాపణ చెప్పారు. ఈ వీడియోలను బీజేపీ కార్యకర్తలు కొందరు సోషల్ మీడియాలో షేర్ చేశారు. వీటిని ఏఐసీసీ అధికార ప్రతినిధి సుప్రియ శ్రీనతే శుక్రవారం ఢిల్లీలో ప్రదర్శించారు. జీఎస్‌టీ రేట్లు వేర్వేరుగా ఉండడాన్ని శ్రీనివాసన్ ప్రస్తావిస్తే.. అందుకు నిర్మల జవాబివ్వకుండా ఆయన్ను అపహాస్యం చేశారని.. ఇది జరిగిన 24 గంటల్లోనే ఆయన ఆమెకు వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పారని.. ప్రజలు తమ సమస్యలు చెప్పడానికి వీల్లేదా అని నిలదీశారు. ఈ అంశంపై ఖర్గే, రాహుల్ ఎక్స్‌లో స్పందించారు. 'బహిరంగ వేదికలపై పదేపదే ఇలా చేయడం నిర్మలకు అలవాటుగా మారింది. లోపభూయిష్టమైన జీఎస్‌టీ, నోట్ల రద్దుతో మోదీ ప్రభుత్వం పదే పదే ఆర్థిక దాడులు చేస్తోంది. దీనివల్ల సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారులు అల్లాడిపోతున్నారు. పేద, మధ్యతరగతిపై టాక్స్ టెర్రర్ విధానం అవలంబిస్తూ.. ప్రధాని మోదీ సన్నిహితులకు మాత్రం పన్ను రాయితీలిస్తున్నారు' అని ఖర్గే ఆరోపించారు. మోదీ సర్కారు.. ఎవరైనా తన ఇగోను దెబ్బతీస్తే వారిని అవమానిస్తోందని రాహుల్ ఆరోపించారు. 'ఓ చిన్న వ్యాపారి సులభతర జీఎస్‌టీ విధానం కావాలని అడిగితే అహంకారంతో అగౌరవపరుస్తారు. అదే కోటీశ్వరుడైన మిత్రుడు కోరితే నిబంధనలను తుంగలో తొక్కుతారు. చట్టాలను మార్చేస్తారు. జాతీయ సంపదను అతడికి కట్టబెడతారు' అని విమర్శించారు. తమిళుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని డీఎంకే ఎంపీ కనిమొళి హెచ్చరించారు. బీజేపీ అధికారం మత్తులో ఎంతగా కూరుకుపోయిందో ఈ ఘటనే రుజువని అన్నాడీఎంకే అధికార ప్రతినిధి కోవై సత్యన్ అన్నారు. రాజకీయ విమర్శల నేపథ్యంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై స్పందించారు. శ్రీనివాసన్‌తో తాను మాట్లాడానని, రాష్ట్ర వాణిజ్య రంగానికి ఆయన మూలస్తంభమని పేర్కొంటూ.. ఇక ఈ వివాదానికి స్వస్తిచెప్పాలని అందరికీ విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై శ్రీనివాసన్ కూడా మీడియాతో మాట్లాడుతూ.. తనకు రాజకీయ రంగు పులిమేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియడంతో ఆర్థిక మంత్రికి క్షమాపణ చెప్పానని ఆయన తెలిపారు.



నిర్మలకు క్షమాపణలు చెబుతున్న శ్రీనివాసన్



కోవై సమావేశంలో శ్రీనివాసన్

ఎంపాక్స్‌కు తొలి టీకా

» తయారు చేసిన బేవేరియన్ నార్డిక్ సంస్థ

» 18 ఏళ్లు నిండిన వారికి ఇచ్చేందుకు డబ్ల్యూహెచ్‌వో తాజాగా అనుమతి

జెనీవా, సెప్టెంబరు 13: ఆఫ్రికా ఖండంలో ఆందోళనకర స్థాయిలో విస్తరిస్తున్న ఎంపాక్స్ వ్యాధి నియంత్రణ కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మొట్టమొదటిసారిగా ఓ టీకాకు అనుమతినిచ్చింది. ఎంపాక్స్‌పై పోరులో ఇది కీలక ఘట్టంగా డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ అభివర్ణించారు. ఎంపాక్స్ టీకాను డెన్మార్క్‌కు చెందిన బేవేరియన్ నార్డిక్ అనే సంస్థ తయారు చేసింది. ఇది రెండు డోసుల వ్యాక్సిన్ అయితే, దీన్ని 18ఏళ్లు నిండినవారికే వేయాలని డబ్ల్యూహెచ్‌వో సూచించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. యునిసెఫ్‌లాంటి అంతర్జాతీయ సంస్థలు ఈ టీకాను కొని, పంపిణీ చేయవచ్చని తెలిపింది. కానీ, ప్రస్తుతం టీకాను ఒకే సంస్థ ఉత్పత్తి చేస్తున్నందున సరఫరా చాలా తక్కువగా ఉంది. మరోవైపు, ఎంపాక్స్ వ్యాధి పిల్లల్లోనే ఎక్కువగా విస్తరిస్తోంది. కాంగోలో గతవారం నమోదైన ఎంపాక్స్ కేసుల్లో 70%మంది 18ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. ఇదిలా ఉండగా, ఆఫ్రికా ఖండంలో గడిచిన వారంలో 3,160 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి. 107 మంది ఈ వైరస్ కారణంగా చనిపోయారు.

పోర్ట్‌బ్లెయిర్ ఇక శ్రీ విజయపురం

» అండమాన్ నికోబార్ రాజధాని పేరు మార్పు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్ పేరు శ్రీ విజయపురంగా మారింది. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. దేశంలో వలస పాలన తాలూకా ఆనవాళ్లను తుడిచివేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పోర్ట్‌బ్లెయిర్ పేరులో బ్రిటీష్ వారసత్వం సూచిస్తోందని, స్వాతంత్ర్యం సిద్ధించడంలో ఈ ప్రాంతం కీలక భూమిక వహించినందున విజయానికి ప్రతీకగా 'శ్రీ విజయపురం' అనే పేరును ఖరారు చేశామని పేర్కొన్నారు. చారిత్రక ప్రాశస్త్యి కలిగిన ఈ ప్రాంతం.. చోళుల కాలంలో నౌవికా స్థావరంగా ఉండేదని, ఇప్పటికీ దేశ వ్యూహాత్మక స్థావరంగా ఉపయోగపడుతోందన్నారు. "నేతాజీ సుభాశ్ చంద్రబోస్ తొలిసారిగా మన మువ్వన్నెల పతాకాన్ని ఇక్కడే ఎగురవేశారని. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా వీర్ సావర్కర్ లాంటి ఎంతో మంది దేశభక్తులు జైలు శిక్షను అనుభవించిన సెల్యూలర్ జైలు ఇక్కడే ఉంద"ని పేర్కొన్నారు. కాగా, అండమాన్ నికోబార్ అనేది 572 దీవుల సమూహం. వీటిలో 38 దీవుల్లో ప్రజలు నివసిస్తున్నారు. అనేక సుందర దీవులకు, బీచ్‌లకు నిలయమైన ఈ ప్రాంతం... దేశ పర్యాటకంలోనే అగ్రగామిగా విలసిల్లుతోంది.

అత్యాచారం చేయబోయిన డాక్టర్‌పై నర్సు సర్జికల్ స్ట్రైక్

పట్నా, సెప్టెంబరు 13: కోల్‌కతా వైద్యురాలి హత్యాచార ఘటన మరవక ముందే.. బిహార్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుపై సామూహిక అత్యాచార యత్నం జరిగింది. ఓ వైద్యుడు తన ఇద్దరు సహచరులతో ఈ దారుణానికి పాల్పడగా.. బాధితురాలు చాకచక్యంతో వ్యవహరించి.. సర్జికల్ బ్లేడ్‌తో వైద్యుడి మర్మాంగాన్ని కోసేసి తప్పించుకుంది. అనంతరం ఆమె పోలీసులకు సమాచారమివ్వగా.. వారు వెంటనే అక్కడికి చేరుకొని ముగ్గురు నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా గంగాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ ఆస్పత్రిలో ఏడాదిగా నర్సు పని చేస్తోంది. బుధవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికెళ్తుండగా.. ఆస్పత్రి నిర్వాహకుడైన డాక్టర్ సంజయ్ కుమార్ సంజు, తన సహచరులు సునీల్ కుమార్ గుప్తా, అవదేశ్ కుమార్‌లతో కలసి అడ్డుపడ్డాడు. అప్పటికే పూటుగా మద్యం సేవించిన వారు నర్సును వేధించసాగారు. ఈనేపథ్యంలోనే సంజయ్ ఆమెను పక్కకు లాక్కెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. తీవ్రంగా ప్రతిఘటించిన ఆమె.. చేతికి దొరికిన సర్జికల్ బ్లేడుతో అతడి మర్మాంగంపై దాడి చేసి పరిగెత్తగా.. సునీల్, అవదేశ్ ఆమెను వెంబడించారు. ఓ చోట దాక్కొని ఎమర్జెన్సీ నంబర్ 112కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గాయపడిన వైద్యుడికి ఓ ఆస్పత్రిలో గోప్యంగా చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలంలో సర్జికల్ బ్లేడ్, రక్తంతో తడిసిన బెడ్ షీట్లతో పాటు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అత్యాచార యత్నానికి ముందే ఆస్పత్రిలోని సీసీ కెమెరాలను నిందితులు ఆఫ్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

తొలి వాణిజ్య స్పేస్ వాక్

» నిర్వహించి చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్

» కమర్షియల్ స్పేస్‌వాక్ చేసిన తొలి వ్యక్తిగా జారెడ్ ఐజక్‌మ్యాన్ రికార్డ్



రోదసిలో జారెడ్; చిత్రంలో నీలివర్ణంలో భూమి

వాషింగ్టన్, సెప్టెంబరు 13: టెస్లా చీఫ్ ఈలన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ సరికొత్త చరిత్ర సృష్టించింది! ఇన్నాళ్లుగా ప్రభుత్వ నిధులతో, అనుభవజ్ఞులైన వ్యోమగాములు మాత్రమే చేసిన స్పేస్ వాక్‌ను (రోదసిలో నడక).. తన పోలారిస్ డాన్ మిషన్‌లో భాగంగా వాణిజ్యపరంగా నిర్వహించింది! వ్యోమగాములు కాని ఇద్దరు వ్యక్తులతో స్పేస్‌వాక్ చేయించింది. ఆ సంస్థ చేపట్టిన పోలారిస్ డాన్ మిషన్‌లో భాగంగా.. అమెరికాకు చెందిన అపర కుబేరుడు, పైలట్.. జారెడ్ ఐజక్‌మ్యాన్ (41) భారత కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం ఇంచుమించుగా నాలుగున్నర గంటల సమయంలో.. భూమికి 700కి.మీ. ఎత్తున క్రూడ్రాగన్ వ్యోమనౌక నుంచి బయటకు వచ్చి, స్కైవాకర్ హ్యాండ్‌రైల్ సిస్టమ్ ద్వారా తొలి కమర్షియల్ స్పేస్‌వాక్ చేసి, చరిత్రలో నిలిచారు. జారెడ్‌తోపాటు అదే వ్యోమనౌకలో వెళ్లిన విగతా ముగ్గురిలో.. సారా గిల్లీస్ అనే మహిళ కూడా కొంతసేపు స్పేస్‌వాక్ చేసింది. ఆమె స్పేస్‌ఎక్స్ ఇంజనీర్. భవిష్యత్తులో చంద్రుడి మీదకి, కుజుడి మీదకు వెళ్లి దీర్ఘకాలంపాటు ఉండే మిషన్లను నిర్వహించే యోచనలో ఉన్న స్పేస్ ఎక్స్ సంస్థ.. వ్యోమగాముల కోసం ప్రత్యేకమైన 'ఈవీఏ' సూట్లను అభివృద్ధి చేసింది. ఈవీఏ సూట్లంటే.. ఎక్స్‌ట్రా వెహిక్యులార్ యాక్టివిటీ సూట్లు. అంటే వ్యోమగాములు వ్యోమనౌకల నుంచి బయటకు వచ్చినప్పుడు అక్కడ ఉండే పీడనాన్ని తట్టుకునేలా రూపొందించిన సూట్లు. వాటిని పరీక్షించేందుకే స్పేస్ ఎక్స్ సంస్థ ఈ మిషన్‌ను నిర్వహించింది.



జారెడ్, సారా గిల్లీస్

నీరు-చెట్టు బిల్లులకు మోక్షం

- 2014-19 టీడీపీ హయాంలో రూ.కోట్లాది పనులు..
- అధికారంలోకి వచ్చి కక్షతో అటకెక్కించేసిన జగన్ సర్కారు
- బిల్లులు చెల్లించాలన్న హైకోర్టు ఆదేశాలూ బేఖాతరు
- తొలివిడతగా రూ.256 కోట్లు రెండు రోజుల్లో విడుదలకు మంత్రి నిమ్మల ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ హయంలో నీరు-చెట్టు కింద రైతులు చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులకు ఎట్టకేలకు మోక్షం లభించింది!. తొలివిడతగా రెండు రోజుల్లో రూ.256 కోట్లు విడుదల చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో నీరు-చెట్టు పెండింగ్ బిల్లులపై జల వనరుల శాఖ అధికారులతో మంత్రులు నిమ్మల, పయ్యావుల కేశవ్ సమీక్షించారు. ఈ సమీక్షలో జల వనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వివరాలివీ.. 2014-19 మధ్య కాలంలో జల వనరుల శాఖ చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమం పనులను గత ప్రభుత్వం కక్షపూరితంగా పక్కన పెట్టేసింది. తమకు బిల్లులు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ ఈ కార్యక్రమం కింద పనులు చేసిన రైతులు హైకోర్టును ఆశ్రయించారు. తక్షణమే బిల్లులు చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలనూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఖాతరు చేయలేదు. పైగా, ఈ పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నామని న్యాయస్థానానికి తెలియజేశారు. నీరు-చెటు కింద చేపట్టిన పనులకు అతీగతీ లేకపోవడంతో ఈ పనులు చేసిన చోట్ల పిచ్చి మొక్కలు, ముళ్లతుప్పలు మొలిచాయి. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొలతలు తీసుకునేందుకు సాధ్యమే కాలేదు. అయినప్పటికీ పనులు జరిగినట్లుగా ఆనవాళ్లు కనిపిస్తుండటంతో వాస్తవ కొలతలు తీసుకోవాలంటూ జలవనరుల శాఖేతర ఇంజనీరింగ్ అధికారులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కోరారు. అయితే.. ఈ కొలతలు తీసుకునేందుకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు అంగీకరించలేదు. దీంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో అక్రమాలు జరిగినట్లుగా గుర్తించనప్పటికీ కొలతల్లో తేడాలున్నందున ఇంజనీరింగ్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ సూచించింది. ఈ నేపథ్యంలో తమకు బిల్లులు చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని హైకోర్టులను రైతులు కోరారు. అంతేగాకుండా గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయలేదంటూ కోర్టు ధిక్కరణ పిటీషన్‌ను వేశారు. దీనిపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. బిల్లులు చెల్లించకపోతే నాన్‌బెయిల్ వారెంట్‌ను జారీ చేస్తామంటూ జల వనరుల శాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. దీనిపై చర్యలు తీసుకునేలోగా ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం విషయాన్ని మంత్రి నిమ్మల దృష్టికి రైతులు తీసుకువచ్చారు. ఈ క్రమంలో మంత్రుల శుక్రవారం నాటి సమావేశంలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో తొలి విడతలో రూ.256 కోట్లను రెండు రోజుల్లో విడుదల చేయాలని ఆదేశించారు.

లారీ టెర్రర్

ఇద్దరు డ్రైవర్లు సహా ఏడుగురు దుర్మరణం



బస్సును లారీ ఢీకొన్న దృశ్యం



ప్రమాదం జరిగిన మొగిలి ఘాట్

బంగారుపాళ్యం, సెప్టెంబరు 13: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డు మలుపులో శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బెంగళూరు వైపు నుంచి ఐరన్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను దాటి.. తిరుమల నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా.. బలంగా ఢీకొంది. ఈ దెబ్బకు బస్సు వెనుదిరిగిపోయింది. బస్సు వెనుక వైపు గ్రానైట్ రాళ్ల లోడుతో వస్తున్న మరో లారీ కూడా బస్సును ఢీకొంది. దీంతో బస్సు రెండు లారీల మధ్య నుజ్జునుజ్జయింది. ఐరన్ లోడ్ లారీ క్యాబిన్ నామరూపాల్లేకుండా పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదలో బస్ డ్రైవర్, ఐరన్ లోడ్‌తో వచ్చి ఢీకొన్న లారీ డ్రైవర్‌తో పాటు బస్సులోని ఐదుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మరణించారు. బస్సులోని 28 మందికి, రెండోసారి ఢీకొన్న లారీలోని ముగ్గురికి గాయాలయ్యాయి. రక్తమోడిన మృతదేహాలు, క్షతగాత్రులతో అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది. ఇందులో తీవ్రంగా గాయపడిన 8 మందిని తొలుత పలమనేరులోని ఏరియా ఆసుపత్రికి, ఆ తర్వాత చిత్తూరులో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఎక్కువ మంది బెంగళూరుకు చెందినవారే ఉన్నారు. బస్సు కండక్టర్ చిరంజీవి పరిస్థితి తీవ్ర విషమంగా ఉండడంతో వేలూరు సీఎంసీకి తరలిచారు. 20 టైర్ల ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఘాట్‌లో ప్రమాదకరమైన పరిస్థితులు లారీ డ్రైవర్‌కు అంచనాలేకపోవడం, అతివేగం కారణంగా చెబుతున్నారు. ఘాట్‌లో ఎడమ వైపు నుంచి దిగువకు(డౌన్) వేగంగా వస్తూ, మలుపు తిప్పలేక నేరుగా డివైడర్‌ను ఢీకొని కుడివైపునకు రావడంతో ఈ ఘోరం జరిగిందని అంటున్నారు.

ప్రమాదంపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందటంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆరా తీసిన సీఎం.. సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న వైద్యసాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియ జేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రవాణాశాఖ పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఘటనపై రవాణాశాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయిస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలకు మంత్రి అచ్చెన్నాయుడు సంతాపాన్ని తెలియజేశారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పలమనేరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.



రోడ్డుపక్కన మృతదేహాలు

మృతుల వివరాలివే..

మృతుల్లో తిరుపతి జిల్లా అలిపిరి డిపోకు చెందిన బస్ డ్రైవర్ మనోహరన్ (58), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బల్దియా జిల్లా ఖరిద్ ఖాజీపూర్ ప్రాంతానికి చెందిన ఐరన్ లోడ్ లారీ డ్రైవర్ సోనుకుమార్ (30), మహారాష్ట్ర రాష్ట్రంలోని జశ్వంత్‌పూర్‌కు చెందిన హన్సిక(6), తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన బాలరాజు (55), తిరుపతి జిల్లా పాకాల మండలం కంబలమెట్టకు చెందిన విజయమ్మ (53), జీడీ నెల్లూరు మండలం ఎస్.ఎస్.కొండ గ్రామానికి చెందిన శంకరరెడ్డి (50), బెంగళూరుకు చెందిన కుల సాంబి(55) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి తదితరులు ఘటనా ప్రాంతానికి వెళ్లి సహాయక ఏర్పాట్లు చేపట్టారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ

సింహాచలం, సెప్టెంబరు 13: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకట జ్యోతిర్మయి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆమెకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు అష్టోత్తర శతనామార్చన చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు ఆశీర్వచనం అందజేయగా ఈఓ శాలువాతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

మంత్రి కొల్లు రవీంద్రకు ఊరట

- క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా దరఖాస్తును పరిగణనలోకి తీసుకోండి
- పాస్‌పోర్టు పునరుద్ధరణపై హైకోర్టు ఆదేశం
- మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన న్యాయస్థానం
- విచారణ రెండు వారాలకు వాయిదా

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై ఉన్న క్రిమినల్ కేసులతో సంబంధం లేకుండా పాస్‌పోర్టు పునరుద్ధరణకు చేసుకున్న దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని పాస్‌పోర్టు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. పిటిషనర్ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారని, మంత్రి హోదాలో అమెరికాలో జరగనున్న 'మైన్ ఎక్స్‌పో' కార్యక్రమానికి హాజరవుతున్నారని గుర్తుచేసింది. ఆయన 20నే అమెరికా బయలుదేరాల్సి ఉన్నందున ఇంత తక్కువ సమయంలో సంబంధిత కోర్టుల నుంచి ఎన్‌వోసీలు తీసుకురావడం ఎలా సాధ్యమని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలోనే మధ్యంతర ఉత్తర్వులు ఇస్తున్నట్లు పేర్కొంది. ప్రధాన వ్యాజ్యంపై కౌంటర్ దాఖలు చేయాలని పాస్‌పోర్టు అధికారిని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పాస్‌పోర్టు పునరుద్ధరణకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అధికారి తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ మంత్రి కొల్లు రవీంద్ర హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు రాగా డిప్యూటీ సొలిసిటర్ జనరల్ (డీఎస్‌జీ) పసల పొన్నారావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ దరఖాస్తుపై పాస్‌పోర్టు అధికారులు ఇప్పటివరకు నిర్ణయం వెల్లడించలేదని తెలిపారు. పాస్‌పోర్టు పునరుద్ధరణ దరఖాస్తుపై ప్రస్తుతం పోలీసు విచారణ సాగుతోందని, అపరిపక్వ దశలో పిటిషనర్ కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న నిందితులు సంబంధిత కోర్టుల నుంచి ఎన్‌వోసీలు పొందాల్సి ఉంటుందని, అది లేకుండా పాస్‌పోర్టు పునరుద్ధరణకు ఆదేశాలిస్తే.. ఈ ఉత్తర్వులు దృష్టాంతంగా మారతాయని తెలిపారు. పిటిషనర్ తరఫున న్యాయవాదులు ఎం.నిఖిత, ఎం.వీ రమణకుమారి స్పందిస్తూ.. ఈ నెల 24 నుంచి 26 వరకు అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరగనున్న మైన్ ఎక్స్‌పో-2024లో మంత్రి రవీంద్ర పాల్గొనాల్సి ఉందని చెప్పారు. అధికారిక హోదాలో ఆయన ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని, ఆహ్వాన వివరాలను కోర్టు ముందు ఉంచారు. ఈ నెల 20న అక్కడికి బయల్దేరేందుకు మంత్రి ఏర్పాట్లు చేసుకున్నారని తెలిపారు. పాస్‌పోర్టు పునరుద్ధరణకు పోలీస్ విచారణ (ఎంక్వైరీ) అవసరం లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... వ్యాజ్యంపై తాము తుది ఉత్తర్వులు జారీ చేయడం లేదని, భవిష్యత్తులో ఈ ఆదేశాలు దృష్టాంతంగా మారతాయనే ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.

దళిత మహిళపై దాష్టీకం

- కులాంతర వివాహం చేసుకున్న కుమారుడు
- స్వగ్రామం వదిలి వేరేచోట ఉంటున్న కుటుంబం
- పనిపై సొంత గ్రామానికి వచ్చిన మహిళను విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టిన యువతి కుటుంబ సభ్యులు
- కర్నూలు జిల్లా పెద్దకడుబూరులో ఘటన.. కేసు నమోదు



చికిత్స పొందుతున్న గోవిందమ్మ

పెద్దకడుబూరు, సెప్టెంబరు 13: కులాంతర వివాహం చేసుకున్నాడన్న కారణంతో ఓ దళిత యువకుడి తల్లిపై యువతి కుటుంబసభ్యులు, కాలనీవాసులు అమానుష దాడికి పాల్పడ్డారు. విద్యుత్ స్తంభానికి కట్టేసి చితకబాదిన ఘటన కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. కల్లుకుంట గ్రామంలోని దళిత సామాజికవర్గానికి చెందిన నరసప్ప, గోవిందమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఐదేళ్ల క్రితం నరసప్ప మరణించాడు. పిల్లలతో కలిసి గోవిందమ్మ గ్రామంలోనే వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తోంది. పెద్ద కుమారుడు ఈరన్న అదే గ్రామంలో బీసీ(రజక) సామాజికవర్గానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఇరు కుటుంబాల పెద్దలు అంగీకరించకపోవడంతో వీరు ఈ ఏడాది ఫిబ్రవరిలో రహస్యంగా పెళ్లి చేసుకుని రక్షణ కల్పించాలంటూ జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. ఆయన సూచన మేరకు ఎమ్మిగనూరు డీఎస్పీ రెండు కుటుంబాల పెద్దలను పిలిపించి సర్దిచెప్పి పంపారు. అప్పటి నుంచి వివాహం చేసుకొన్న ఈ ప్రేమ జంట బెంగళూరులో కాపురం పెట్టారు. గోవిందమ్మ, చిన్నకుమారుడు రాజు కూడా గ్రామం వదిలి ఎమ్మిగనూరులో ఉంటున్నారు. అయితే గురువారం పని నిమిత్తం గోవిందమ్మ కల్లుకుంట గ్రామానికి వెళ్లింది. విషయం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు, మరికొంతమంది రాత్రి గోవిందమ్మ ఇంటి వద్దకు వెళ్లి ఆమెను బీసీ కాలనీలోకి లాక్కొచ్చారు. అక్కడ విద్యుత్ స్తంభానికి కట్టి విచక్షణారహితంగా చితకబాదారు. గోవిందమ్మ కుమారుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని విడిపించి పోలీస్‌స్టేషనుకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు గోవిందమ్మ ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పది మందితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మంజునాథ్ తెలిపారు.

లంబసింగి కాఫీ రైతుకు అరుదైన గౌరవం

- అరబిక వాష్‌డ్ విభాగంలో దక్కిన ది ఫైన్ కప్ 2024 అవార్డు



అవార్డు విజేతగా వెంకటరావును ప్రకటించిన కేంద్ర కాఫీ బోర్డు

చింతపల్లి, సెప్టెంబరు 13: అల్లూరి జిల్లా చింతపల్లి మండలం లంబసింగికి చెందిన గిరిజన రైతుకు అరుదైన గౌరవం లభించింది. కేంద్ర కాఫీ బోర్డు ఫ్లేవర్ ఆఫ్ ఇండియా ది ఫైన్ కప్ 2024 అవార్డు విజేతగా అసరాడ గ్రామానికి చెందిన లకరి వెంకటరావును ప్రకటించింది. ఇంటర్ చదువుకున్న వెంకటరావు.. 2007లో పాడేరు ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టులో లైజన్ వర్కర్‌గా చేరారు. లంబసింగి పరిధిలో ఆదివాసీ రైతులను కాఫీ సాగులో ప్రోత్సహించేవారు. 2012లో లైజన్ వర్కర్ ఉద్యోగాన్ని విడిచిపెట్టి 3.5 ఎకరాల్లో కాఫీ సాగు ప్రారంభించారు. లైజన్ వర్కర్‌గా పనిచేయడంతో నాణ్యమైన కాఫీ ఉత్పత్తికి నేర్చుకున్న శాస్త్రీయ పద్ధతులు, మెలకువలను సాగులో అవలంబించారు. ప్రస్తుతం కాఫీ దిగుబడులు బాగా వస్తున్నాయి. తోటలో కాఫీ పండ్లను సేకరించి పార్చిమెంట్‌గా తయారుచేసి మార్కెటింగ్ చేసుకుంటున్నారు. భార్య సుజాతలో కలిసి కాఫీ తోటల సస్యరక్షణ పనులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఫైన్ కప్ అవార్డులను అందజేస్తున్న కేంద్ర కాఫీ బోర్డు 2024 వార్షిక సంవత్సరానికి రైతుల నుంచి నమూనా కాఫీ గింజలను సేకరించింది. కాఫీ బోర్డు అధికారుల సహకారంతో వెంకటరావు 2023లో పండించిన కాఫీ గింజలను ఫైన్ కప్ అవార్డు నిర్వహణ కమిటీకి పంపించారు. వివిధ స్థాయిల్లో పరీక్షల అనంతరం కేంద్ర కాఫీ బోర్డు అరబిక వాష్‌డ్ విభాగంలో వెంకటరావును 'ది ఫైన్ కప్' విజేతగా ప్రకటించింది. దీనిపై కాఫీ బోర్డు పాడేరు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రమేశ్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, 'లంబసింగి రైతు దేశస్థాయిలో ది ఇండియా ఫైన్ కప్ అవార్డు విజేతగా నిలవడం అభినందనీయం. ఈ అవార్డును హైదరాబాద్‌లో నిర్వహించే ఇంటర్నేషనల్ కాఫీ ఫెస్టివల్‌లో కేంద్ర కాఫీ బోర్డు ఉన్నతాధికారులు అందజేస్తారు' అని తెలిపారు.

జగన్ భద్రతపై.. మూడో వ్యక్తి ఇంప్లీడ్ కావడమా?

- ఆ పిటిషన్‌లో వాడిన భాష అభ్యంతరకరం: హైకోర్టు
- కోర్టులను ప్రచార వేదికలుగా వాడుకుంటున్నారు
- క్రీడామైదానంగా భావిస్తున్నారా?
- పిటిషన్‌ను కొట్టేసి ఖర్చులు విధిస్తాం.. న్యాయమూర్తి ఆగ్రహం
- ప్రభుత్వ కౌంటర్‌కు జవాబిచ్చేందుకు మాజీ సీఎంకు మరింత గడువు

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో తనకు ఉన్న భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో మూడో వ్యక్తి ఇంప్లీడ్ వ్యాజ్యం వేయడంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇంప్లీడ్ పిటిషనర్ ఇండియన్ ముస్లింలీగ్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజావలిపై మండిపడింది. ఇంప్లీడ్ పిటిషన్లు వేసి కోర్టులను ప్రచార వేదికలుగా వాడుకుంటున్నారని, కోర్టులను క్రీడా మైదానంగా భావిస్తున్నారా అని న్యాయమూర్తి జస్టిస్ బీఎల్ఎన్ చక్రవర్తి శుక్రవారం ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎంగా ఉన్నప్పుడు తనకున్న భద్రతను పునరుద్ధరించాలని కోరుతూ జగన్ పిటిషన్ వేయడం.. దానిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడం తెలిసిందే. దీనిపై కోర్టు శుక్రవారం విచారణ జరిపింది. ఇంప్లీడ్ పిటిషన్‌లో వాడిన భాష అభ్యంతరకరంగా ఉందని.. కోర్టు హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపింది. ప్రధాన వ్యాజ్యంపై విచారణ అనంతరం ఇంప్లీడ్ పిటిషన్‌ను కొట్టివేస్తామని, భారీ ఖర్చులు విధిస్తామని స్పష్టం చేసింది. జగన్ తరఫు న్యాయవాది సిసుమన్ స్పందిస్తూ.. ఇంప్లీడ్ పిటిషన్‌ను కొట్టివేసినా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. కౌంటర్‌కు జవాబు దాఖలు చేసేందుకు మరింత సమయం ఇవ్వాలని కోరగా.. న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. తదుపరి విచారణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేశారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శుక్రవారం తెల్లవారుజామున జ్వరానికి వాడే మాత్రలు మింగింది. ట్రిపుల్ ఐటీ సిబ్బంది విద్యార్థినిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్య సేవలందిస్తున్నారు. తల్లి మందలించిందనే కారణంతో విద్యార్థిని మాత్రలను మింగినట్టు ట్రిపుల్ ఐటీ అధికారులంటున్నారు. కాగా, ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న వైద్య ఆరోగ్యశాఖ నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. 48 గంటల్లోనే ఘటన జరగడం శోచనీయం.

జెత్వానీ కేసులో ఇద్దరిపై వేటు

నాటి బెజవాడ పశ్చిమ ఏసీపీ, సీఐ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ
- మరో ఇద్దరు సీఐలు, ఎస్ఐ పాత్ర
- త్వరలో వారిపైనా చర్యలు?
- విద్యాసాగర్, పీఎస్ఆర్, కాంతిరాణా విశాల్‌గున్నీపై కాదంబరి మరోసారి ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వస్తున్న జెత్వానీ

విజయవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో ఇద్దరు పోలీసు అధికారులపై వేటు వేశారు. నాడు కేసును దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ, విజయవాడ పశ్చిమ జోన్ ఏసీపీ కె.హనుమంతరావును సస్పెండ్ చేస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ చేసిన ఫిర్యాదుపై అప్పటి ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఆయన ఈ కేసుకు దర్యాప్తు అధికారిగా వ్యవహరించారు. ప్రస్తుతం గవర్నరుపేట ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. నెల రోజులుగా కాదంబరి జెత్వానీ వ్యవహారం సాగుతున్న సంగతి తెలిసిందే. ముంబై నుంచి విజయవాడకు వచ్చిన కాదంబరితో పాటు ఆమె తండ్రి నరేంద్రకుమార్ జెత్వానీ, తల్లి ఆశా జెత్వానీ నుంచి పోలీసులు వాంగ్మూలం తీసుకున్నారు. విచారణ చేయడానికి ప్రత్యేకాధికారిగా క్రైమ్స్ ఏసీపీ స్రవంతి రాయ్‌ను నియమించారు. రెండు రోజుల పాటు కాదంబరి కుటుంబ సభ్యులు ఆమెకు వాంగ్మూలం ఇచ్చారు. అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలతో నాటి విజయవాడ పోలీసు కమిషనర్ కాంతిరాణా, డీసీపీ విశాల్‌గున్నీ ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసు నమోదు చేయించారని కాదంబరి వాంగ్మూలంలో పేర్కొన్నారు. తన అరెస్టు చేయడానికి విశాల్‌గున్నీ నేరుగా ముంబై వచ్చారని ఆరోపించారు. పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్‌కు మేలు చేయడానికి తనపై అక్రమంగా తప్పుడు కేసు బనాయించారని విజయవాడలో పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు. శుక్రవారం రాత్రి కాదంబరి జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు మరోసారి ఫిర్యాదు చేశారు. తనపై అక్రమంగా కేసు నమోదు చేయించిన వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్, సహకరించిన ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీపై ఫిర్యాదు చేశారు. ఇప్పటికే వారిపై కేసు నమోదు చేయాలని ఆమె కుటుంబం పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబుకు ఫిర్యాదు చేసింది. కొద్దిరోజుల క్రితం కాదంబరి మహిళా సంఘాలతో కలిసి సీపీని కలిశారు. తాజాగా తన న్యాయవాదులతో కాదంబరి, ఆమె తండ్రి నరేంద్రకుమార్, తల్లి ఆశా జెత్వానీ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయనిపుణులతో చర్చించి కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. కాదంబరి ఫిర్యాదు చేస్తుండగానే ఈ కేసుకు సంబంధించి అప్పటి పశ్చిమ జోన్ ఏసీపీ హనుమంతరావు, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను సస్పెండ్ చేశారు. కాదంబరి వ్యవహారంలో మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్ఐ పాత్ర ఉన్నట్టు అధికారులు నిర్ధారించినట్టు సమాచారం. త్వరలో వారిపైనా చర్యలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. వారిలో ఒక ఇన్‌స్పెక్టర్ విజయవాడలో, మరో ఇన్‌స్పెక్టర్ ఏలూరు రేంజ్‌లో, ఎస్ఐ కృష్ణా జిల్లాలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కమల పైచేయి..!

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌తో మరోమారు చర్చకు దిగేది లేదని రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ తేల్చేశారు. తామిద్దరి మధ్యా ఇటీవల జరిగిన తొలి-డిబేట్‌లో కమల ఘోరంగా ఓడిపోయినందున, ఇక మరోమారు ఆమెతో చర్చ అవసరం లేదని ట్రంప్ చెబుతున్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యతో ఆయన కమలను ఢీకొనేందుకు భయపడిపోతున్నారని, మొఖం చాటేస్తున్నారని కొత్త విమర్శలు ఆరంభమైనాయి. ఇటీవలి ఫిలడెల్ఫియా చర్చలో కమలదే పైచేయి అని అత్యధికులు భావిస్తున్నట్టు పలు సర్వేలు చెప్పిన విషయం తెలిసిందే. ఈ చర్చ ఫలితం, ప్రభావం రేపటి ఎన్నికల ఓటింగ్ మీద ప్రత్యక్షంగా ఉంటుందో లేదో తెలియదు కానీ, ప్రధానంగా తటస్థ ఓటర్లను కమల బాగా ప్రభావితం చేయగలిగారని, ట్రంప్ వీరాభిమానులకు వ్యతిరేకత కాస్తంత తగ్గిందని విశ్లేషణలు సాగుతున్నాయి.

అధ్యక్షబరిలో ఆమెకు ఇది తొలిచర్చ. ఇరువురూ ముఖాముఖి కలుసుకోవడం కూడా ఇదే తొలిసారి. ట్రంప్‌కు ఇప్పటికే అనేకమందిని ఢీకొన్న గతానుభవం ఉన్నది. అందువల్ల, ఆయన ముందు కమల నిలువగలదా అని కొందరు అనుమానపడ్డారు. నిజానికి, ఈ చర్చ ట్రంప్— బైడెన్ మధ్య జరగాలి. అప్పట్లో వీరిద్దరి మధ్యా జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌ను బాగా ముందుకు జరిపింది కూడా, ట్రంప్ వాగ్ధాటి ముందు బైడెన్ తప్పిజారి నిలువలేకపోయినా, సరిగ్గా ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ జరిగే మరోచర్చలో పైచేయి సాధించవచ్చుననే. కానీ, ఆ తొలిచర్చలోనే బైడెన్ ప్రవర్తన, తడబాటు, మతిమరుపు డెమొక్రాటిక్ పార్టీని భయపెట్టాయి. ట్రంప్ అసత్యాలు, అర్ధసత్యాలు, వెటకారపు వ్యాఖ్యల ముందు బైడెన్ నిలవలేకపోయారు. ట్రంప్‌ను సరిగా ఎదుర్కోలేకపోయారన్న విమర్శల నేపథ్యంలో పార్టీనుంచి ఆయనమీద ఒత్తిడి పెరిగింది. మొదట్లో కాస్తంత మొండికేసినా, ఆ తరువాత ఆయనకే అనిపించిందో, మర్యాదగా ఉండదనిపించిందో తెలియదు కానీ, ఎట్టకేలకు పక్కకు తప్పుకున్నారు. ఆయన నిష్క్రమణ పార్టీకి కొత్త ఉత్తేజాన్నిచ్చింది. కమలకు నిధుల వరదతోపాటు, మహామహులంతా వరుసపెట్టి మద్దతు నివ్వడం మొదలైంది. పార్టీ అభ్యర్థిత్వాన్ని స్వీకరిస్తూ ఆమె చేసిన ప్రసంగం కూడా చాలామందికి నచ్చింది. ఆ తరువాత ఆమె ప్రజాదరణకూడా హెచ్చినట్టు సర్వేలు తేల్చాయి.

పరోక్షంలో ట్రంప్‌ను విమర్శించడం వేరు, కీలకమైన అంశాలమీద నిర్దిష్టమైన, విలువైన, లోతైన చర్చచేస్తూ, ఆయనను నేరుగా ఢీకొనడం వేరు. ఎంతో అపారమైన అనుభవమూ, దాడిసామర్థ్యం ఉన్న ట్రంప్ ఈ చర్చలో వెనక్కుపోయారని, మాటతీరుకు తోడుగా ఆమె ముఖకవళికలు, ఆత్మవిశ్వాసం అనేకులను ఆకట్టుకున్నాయని సర్వేలు విశ్లేషిస్తున్నాయి. ఆమెరికా ఏవో కష్టాలు, అరిష్టాలతో బాధపడుతున్నట్టుగా ట్రంప్ వ్యాఖ్యలన్నీ ఉన్నాయని, ఇందుకు భిన్నంగా ఎంతో సానుకూల దృక్పథంతో కమల మాట్లాడారని అంటున్నారు. ఒకదశ దాటిన తరువాత ట్రంప్ ఆత్మరక్షణలో పడ్డారని, పైచేయి కోసం అసత్యాలకు తోడు అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారని, అసహనం ప్రదర్శించారని అమెరికన్ మీడియా వ్యాఖ్యానిస్తోంది. కమల పుట్టుక, మూలాల మీద దాడిచేయడం ట్రంప్‌కు కొత్తేమీ కాదు. భారతీయ మూలాలున్న ఆమెకు తండ్రి వైపునుంచి ఆఫ్రో అమెరికన్ల మద్దతు కూడా విశేషంగా దక్కుతోందని, డెబ్[illegible]తం మంది ఓటర్లు ఆమె పక్షాన ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఈ కారణంగా ఆమె ఆఫ్రో అమెరికన్ కాదని ప్రచారం చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తుంటారు. ఆమె తండ్రిని దృష్టిలో పెట్టుకొని కాబోలు, ఈమెను మార్క్సిస్టుగా అభివర్ణిస్తుంటారు.

తొంభైనిముషాల పాటు జరిగిన ఈ చర్చలో ఇరువురూ అబార్షన్ల నుంచి యుద్ధాలవరకూ అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా ఎదురుదాడితప్ప ఈ చర్చలో వీరిద్దరూ అతిముఖ్యమైన అంశాలకు సైతం తమ పరిష్కారమేమిటో ప్రతిపాదించలేకపోయారన్న విమర్శ లేకపోలేదు. ముఖ్యంగా గాజా యుద్ధం ముగింపు విషయంలో నిర్దిష్టమైన హామీ ఏమీ లేదు. పైగా, ఇజ్రాయెల్ మీద కమల కక్షకట్టారనీ, ఆమె అధికారంలోకి వస్తే ఆ దేశానికి కష్టాలు తప్పవని వ్యాఖ్యానించడం ద్వారా ట్రంప్ యూదుశక్తిని తనవైపు తిప్పుకొనే ప్రయత్నం చేశారు. ఈ చర్చ తరువాత కమల రేటింగ్ మరికాస్తంత పెరిగింది. సర్వేల్లో ఆమె పట్ల కనిపిస్తున్న సానుకూలత అధ్యక్ష ఎన్నికల వరకూ నిలిచి, ఇంకాస్తంత పెరిగి, ఓటింగ్‌లో కూడా ప్రతిఫలిస్తుందో లేదో చూడాలి.

భారతీయ వివేకమే కోస్టారిక ఆదర్శం

సెప్టెంబర్ 15న కోస్టారిక 203వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనున్నది. అదే రోజు భారత్—కోస్టారికల మధ్య దౌత్య సంబంధాల 54వ వార్షికోత్సవం కూడా. 1970లో ఈ రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తి స్థాయిలో ఏర్పడ్డాయి. తదాది పరస్పర ప్రయోజనాలు గల వివిధ రంగాలలో ఉభయ దేశాల మధ్య స్నేహ సహకారాలు నిత్య నూతనంగా వర్ధిల్లుతున్నాయి. భారత్, కోస్టారిక రెండూ సముద్ర తీరస్థ దేశాలు. జీవ వైవిధ్యం అపారంగా ఉన్న దేశాలు. ప్రతిభా సమన్విత మానవ వనరులు పుష్కలంగా ఉన్న దేశాలు. పెరుగుతున్న సముద్ర మట్టం, వాతావరణ మార్పు విషమ ప్రభావాలకు లోనవుతున్న దేశాలు ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం, మానవహక్కులను రక్షించడం, మరింత సమ్మిళిత భవిష్యత్తు నిర్మించడం మొదలైన సదాశయాలతో భారత్ , కోస్టారికల మధ్య సంబంధాలు దృఢమవుతున్నాయి.

మధ్య అమెరికాకు సింహద్వారం కోస్టారిక. లాటిన్ అమెరికా, కరీబియన్ దేశాలతో సంబంధాలు పటిష్ఠం చేసుకునే ప్రయత్నాలలో భారత్‌కు విశ్వసనీయమైన భాగస్వామి కోస్టారిక. అరకోటికి పైగా జనాభా ఉన్న కోస్టారికలో అధికార భాష స్పానిష్ అయినప్పటికీ ఆంగ్లభాషలో సమగ్ర నైపుణ్యమున్నవారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు 8 ఆదివాసీ తెగలు ఉన్న కోస్టారిక బహుళ జాతులు, సాంస్కృతిక వైవిధ్యానికి సహజ నెలవుగా ఉన్నది. పౌరుల సగటు జీవితకాల పరిమాణం, అత్యధికంగా (పురుషులకు 77, స్త్రీలకు 82 సంవత్సరాలు) ఉన్న దేశాలలో కోస్టారిక ఒకటి.



కోస్టారిక ప్రజల జీవన తత్వాన్ని వ్యక్తం చేసే తాత్విక భావన 'పుర విడ'. ఈ స్పానిష్ పదానికి అర్థం 'నిర్మలమైన లేదా నిరాడంబర జీవితం'. ఒక తాత్విక భావన మాత్రమే కాదు అదొక జీవన విధానం. జీవితాన్ని పరిపూర్ణంగా జీవించడమే ఆ భావన పరమార్థం. నైసర్గిక పరిసరాల శోభను ఆస్వాదించే సౌందర్యాత్మక దృష్టిని, సామాజిక సంబంధాలను మానవీయం చేసే ఉన్మూఖతను అది కల్పిస్తుంది. ఈ ఆదర్శ తాత్వికతను పురాతన భారతీయ వివేకం 'వసుధైవ కుటుంబకం' గౌరవిస్తుంది, పరిపూరకం చేస్తుంది.

దేశాధ్యక్షుడు రోడ్రిగో చావెస్ నేతృత్వంలో కోస్టారిక ఆర్థికవ్యవస్థ 86.5 బిలియన్ డాలర్ల జీడీపీతో వర్ధిల్లుతోంది. 98 శాతం అక్షరాస్యత ఉన్న ఈ దేశంలో సహజంగానే ఉన్నత విద్యకు ఎనలేని ప్రాధాన్యమిస్తుంది. విద్యా వైద్య రంగాలలో భారీ మదుపులు మానవాభివృద్ధికి ఈ మధ్య అమెరికా దేశం ఇస్తున్న ప్రాధాన్యాన్ని విశదం చేసింది. ప్రపంచ శాంతికి అంకితమైన దేశం కోస్టారిక. శాంతికి నిబద్ధతలో భాగంగా 1948 డిసెంబర్ 1న సైన్యాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. ఈ అసాధారణ, అభినందనీయమైన చర్య తీసుకున్న ఏకైక దేశం కోస్టారిక. ప్రపంచ జీవ వైవిధ్యంలో 5 శాతం కోస్టారికలో ఉన్నది. ఏడాది పొడుగునా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే కోస్టారిక ప్రపంచ పర్యాటకులకు గమ్యంగా ఉన్నది. మధ్య అమెరికాలో సిరిసంపదలే కాకుండా పర్యావరణ చైతన్యం అధికంగా ఉన్న దేశం కోస్టారిక అని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

దౌత్య సంబంధాలు నెలకొన్నది మొదలు భారత్, కోస్టారికల మధ్య వాణిజ్య సంబంధాలు ఇతోధికంగా పెరుగుతూ వస్తున్నాయి. వివిధ రంగాలలో పరస్పర సహకారానికి అవి అనేక అవకాశాలను కల్పిస్తున్నాయి. 2016—22 సంవత్సరాల మధ్య కోస్టారికాకు మోటార్ వెహికల్స్, కార్లు, అగ్రో కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్‌ను పెద్ద ఎత్తున ఎగుమతి చేసింది. అదే కాలంలో భారత్‌కు కోస్టారిక ఎగుమతులలో దారు ఉత్పత్తులు, మెడికల్, సైంటిఫిక్ ఇన్[illegible]మెంట్స్, సర్జికల్ ప్రోడక్ట్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ మొదలైనవి ఉన్నాయి జౌళి, వ్యవసాయ ఉత్పత్తులలో ద్వై[illegible]క్షిక వాణిజ్యం పెరిగే అవకాశాలు ఇతోధికంగా ఉన్నాయి. 2023—24 ఆర్థిక సంవత్సరంలో ఉభయ దేశాల మధ్య 301 మిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది. ఇన్ఫోసిస్, విప్రో, డబ్ల్యుఎన్‌ఎస్, ఎల్ అండ్ టి ఇన్ఫొటెక్, సిఎస్‌ఎస్ కార్పొరేషన్ మొదలైన ఇండియన్ కంపెనీలు కోస్టారికలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి.

భారత్, కోస్టారికల మధ్య వాణిజ్య సంబంధాలే కాదు ఒక తాత్త్విక సంబంధం కూడా ఉన్నది. ఆ బంధం, భౌగోళిక హద్దులను అధిగమించి శాంతి సామరస్యాలు, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తోంది. ఉభయ దేశాల సంస్కృతీ సంప్రదాయాల నుంచి జనించిన ఆ బంధం ప్రపంచ దేశాల పరస్పర సంబంధాలను ఆదర్శప్రాయంగా ప్రభావితం చేస్తోంది. కోస్టారిక ప్రజల జీవన తత్వాన్ని వ్యక్తం చేసే తాత్విక భావన 'పుర విడ'. ఈ స్పానిష్ పదానికి అర్థం 'నిర్మలమైన లేదా నిరాడంబర జీవితం'. కోస్టారికలో ఎక్కడకు వెళ్లినా ఈ పదం ప్రజల సంభాషణల్లో వినపడుతుంది. 'పుర విడ' ఒక తాత్విక భావన మాత్రమే కాదు అదొక జీవన విధానం. జీవితాన్ని పరిపూర్ణంగా జీవించడమే ఆ భావన పరమార్థం. నైసర్గిక పరిసరాల శోభను ఆస్వాదించే సౌందర్యాత్మక దృష్టిని, సామాజిక సంబంధాలను మానవీయం చేసే ఉన్ముఖతను అది కల్పిస్తుంది. ఈ ఆదర్శ తాత్వికతను పురాతన భారతీయ వివేకం 'వసుధైవ కుటుంబకం' (ప్రపంచమంతా ఒక కుటుంబం) గౌరవిస్తుంది, పరిపూరకం చేస్తుంది. ఈ రెండు తాత్విక భావనలు పరస్పర సంబంధాన్ని, కరుణను, కృతజ్ఞతను, సాంస్కృతిక ఆదాన ప్రదానాన్ని, శాంతియుత సహకారాన్ని, పర్యావరణ భద్రత పట్ల శ్రద్ధను ప్రబోధిస్తున్నాయి. భారత్, కోస్టారికల మధ్య దశాబ్దాలుగా ప్రగాఢ, వైవిధ్యపూరితమైన సాంస్కృతిక సంబంధాలు వర్ధిల్లుతున్నాయి. పరస్పర సంప్రదాయాలు, విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని ఉభయ దేశాలు సమున్నతంగా గౌరవించుకుంటున్నాయి. ఈ గౌరవపూర్వక అనుబంధం 1960ల్లో అంటే దౌత్య సంబంధాలు నెలకొనక ముందే ఆరంభమయింది. వాటికి ఆద్యుడు ప్రొఫెసర్ హిల్డా చెన్ అపుయె. యునెస్కో సహకారంతో 1960లో కోస్టారిక విశ్వవిద్యాలయంలో భారతీయ చరిత్ర, తత్వశాస్త్రం, సంస్కృత భాషా సాహిత్యాల అధ్యయనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ విద్యా సంబంధ సహకారం కోస్టారికలో భారతదేశ సమున్నత సంస్కృతీ వైభవంపై అవగాహనను పెంపొందించేందుకు విశేషంగా తోడ్పడింది.

సాంస్కృతిక ఆదానప్రదానాలు, కళాకారుల సందర్శనలు ఉభయ దేశాల మధ్య సంబంధాలను సంస్కృతీ సంబంధంగా పరిపుష్టం చేశాయి. ఫిబ్రవరి 2023లో సంస్కృత భాషా విద్వాంసుడు రోబెర్టో మోరలేస్ భారత్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన వివిధ విశ్వవిద్యాలయాలలో సంస్కృత భాషా సాహిత్యాలపై వెలువరించిన ఉపన్యాసాలపై భారతీయ విద్వజ్జుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ విధంగా ఉభయ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు విశాలమవుతూ ఉన్నాయి.

లలిత కళలు కూడా ఈ సాంస్కృతిక సంబంధాన్ని మరింతగా సమున్నతం చేస్తున్నాయి. కోస్టారిక విఖ్యాత చిత్రకారుడు రౌడ్విన్ అల్ఫారో తన పెయింటింగ్‌లను 'కోస్టారికన్ —సెంటెడ్ కాఫీ' పేరిట ప్రదర్శించారు. చిత్రకళాభిమానులను అవి విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారుల రాకపోకలు అధికమవుతున్నకొద్దీ ఉభయ దేశాల కళాత్మక సంప్రదాయాల సమ్మేళనం సంభవిస్తోంది. వివిధ నేపథ్యాల నుంచి వచ్చిన భారతీయ కళా విద్యార్థులు కోస్టారిక కళా సంప్రదాయాలను శ్రద్ధగా అధ్యయనం చేస్తున్నారు. ఇరు దేశాలలోను పరస్పర చిత్రకళా ప్రదర్శనలు సైతం తరచుగా జరుగుతున్నాయి.

విద్యారంగం విషయానికి వస్తే భారత ప్రభుత్వ ఉపకార వేతనాలపై కోస్టారిక విద్యార్థినీ విద్యార్థులు వివిధ భారతీయ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధనలు చేస్తున్నారు. అలాగే కోస్టారికలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని శాంతి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విద్యార్థులు, కళాకారులతో ఉభయ దేశాల మధ్య సహకారం బహుముఖీనంగా వికసిస్తోంది.

కోస్టారికలో 1000 మందికి పైగా భారతీయులు నివశిస్తున్నారు. ఉభయ దేశాల మధ్య సంబంధాలను పటిష్ఠం చేయడంలో వీరు తమదైన పాత్ర నిర్వహిస్తున్నారు. 2010లో ఏర్పడిన కోస్టారిక ఇండియన్ అసోసియేషన్ భారతీయ పండుగల సందర్భంలో వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ భారతీయ సంస్కృతిపై కోస్టారికన్లకు అవగాహనను పెంపొందిస్తోంది. కోస్టారిక 203వ స్వాతంత్ర్య దినోత్సవం, భారత్‌తో దౌత్య సంబంధాల 54వ వార్షికోత్సవం ఉభయ దేశాల మధ్య సంబంధాలు ఎంత సుదృఢంగా ఉన్నాయో స్పష్టం చేస్తున్నాయి. ఈ స్నేహబంధం మరింతగా దృఢమవగలదనే ఆశాభావం ఇరు దేశాల ప్రజలలోను బలంగా ఉన్నది.



● సోఫియా సలాస్ మోంగె
కోస్టారిక దౌత్యప్రతినిధి, న్యూఢిల్లీ

(సెప్టెంబర్ 15: కోస్టారిక స్వాతంత్ర్య దినోత్సవం, భారత్—కోస్టారిక దౌత్య సంబంధాల 54వ వార్షికోత్సవం)

వినిపించడం లేదా మణిపూర్ రోదన?

మణిపూర్ ఆవేదనను పట్టించుకుంటున్నామా? మునుపటి 'పళని పలుకు' పుటలు తిప్పుతూ నన్ను నేనే నిందించుకున్నాను. ఎందుకు? సంక్షుభిత మణిపూర్ గురించి తరచు రాయనందుకు. జూలై 29, 2023న నేను చివరిసారి మణిపూర్ గురించి రాశాను ('మణిపూర్‌లో జాతుల ముసలం'). 13 నెలల అనంతరం మళ్లీ ఇప్పుడు రాస్తున్నాను. ఇది గర్హనీయం, అంగీకరిస్తున్నాను. అంతే కాదు క్షమార్హం కాదు, ఒప్పుకుంటున్నాను. సకల భారతీయులు తమ ఉమ్మడి స్మృతిలో మణిపూర్‌ను అట్టడుగుకు నొక్కివేశారు. ఏమయింది మన ఉచితానుచిజ్ఞత? ఇదీ క్షమార్హం కాదు, ముమ్మాటికీ.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

గత ఏడాది జూలైలో మణిపూర్ గురించి రాసినప్పుడు భవిష్యత్తు ఆశాజనకంగా కనిపించలేదు అన్నీ అమంగళకరంగానే కనిపించాయి. 'మణిపూర్‌లో జాతి సంహారం ఆరంభమయింది' అని అప్పుడు చెప్పాను. ఇంకా ఇలా చెప్పాను: 'ఈ రోజు నేను చదివిన వార్తలు, అందుకున్న నివేదికల ప్రకారం ఇంఫాల్ లోయలో ఒక్క కుకీ జోమీ కూడా లేదు. కుకీజోమీల ప్రాబల్యమున్న ప్రాంతాలలో ఒక్క మెయిటీ కూడా కన్పించడం లేదు'. ఈ పరిస్థితిని మరి కొంచెం ఇలా చెప్పాను: 'ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు ఇంటి వద్ద నుంచే తమ అధికారిక విధులు నిర్వర్తిస్తున్నారు. అల్లర్ల ప్రభావిత ప్రాంతాలలోని బాధితులను పరామర్శించేందుకు వెళ్లడానికి వారు సిద్ధంగా లేరు'. ఈ శోచనీయ పరిస్థితిపై ఇంకా ఇలా వ్యాఖ్యానించాను: మణిపూర్ పోలీసులను కుకీలుకానీ, మెయిటీలు కాని ఏ మాత్రం విశ్వసించడంలేదు. దాడులలో గాయపడిన లేదా మరణించిన వారి గురించిన అధికారిక అంకెలను ఏ ఒక్కరూ నమ్మడంలేదు'.

విచారకరమైన విషయమేమిటంటే నేను రాసిన ప్రతి మాట నిజమయింది. మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారంలో ఉన్న వారిలో ఒకరు గానీ, అంతకంటే ఎక్కువ మంది గానీ మణిపూర్ విషాద ఘటనలకు బాధ్యత వహించి తీరాలి. మరి అధికారంలో ఉన్న ముగ్గురు ప్రముఖులు మణిపూర్‌కు ఊరట కల్పించడానికి ఏమి చేశారో చూద్దాం.

మొదటి వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మణిపూర్‌లో మిన్ను విరిగి మీద పడినా ఆ రాష్ట్రాన్ని సందర్శించకూడదని ఆయన సంకల్పించుకున్నారు కాబోలు! 'మణిపూర్ మండనీ, చావనీ నేను మాత్రం మణిపూర్ గడ్డపై అడుగుపెట్టే ప్రసక్తే లేదు' అని తీర్మానించుకున్నట్టుగా ఆయన వైఖరి ఉన్నది. జూన్ 9, 2024న మూడో పర్యాయం ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన మోదీకి ఇటలీ సందర్శించేందుకు (జూన్ 13, 14), రష్యా పర్యటన (జూలై 8, 9)కు, ఆ[illegible]యా వెళ్లేందుకు (జూలై 10), పోలండ్‌లో పర్యటించేందుకు (ఆగస్టు 21, 22), ఉక్రెయిన్‌లో శాంతి చర్చలకు (ఆగస్టు 23, 24), బ్రూనేలో మంతనాలకు (సెప్టెంబర్ 3, 4), సింగపూర్‌లో పర్యటించేందుకు (సెప్టెంబర్ 4, 5) సమయం లభించింది. ఇంకా ఈ ఏడాది మిగిలిన నెలల్లో ఆయన అమెరికా, లావోస్, సమోవ్, రష్యా, అజర్ బైజాన్, బ్రెజిల్ మొదలైన దేశాలలో పర్యటించనున్నారు. చెప్పవచ్చిందేమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మణిపూర్‌ను సందర్శించనిది సమయం లభించక కాదు, ఆ దురదృష్టకర, నిస్సహాయ రాష్ట్రానికి వెళ్లకూడదని నిశ్చయించుకున్నందువల్లేనన్నది స్పష్టం.

మణిపూర్‌ను సందర్శించేందుకు మోదీ ససేమిరా అనడం ఆయన మూర్ఖపు పట్టుదలకు నిదర్శనం. గుజరాత్ మారణకాండ, పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తినప్పుడు, మూడు కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమించినప్పుడు ఆయన అనుసరించిన వైఖరిలో మొండితనం మాత్రమే ఉంది. పార్లమెంటు ఉభయ సభలలో అత్యావశ్యక విషయాలపై తక్షణ చర్చకు నిరాకరిస్తూ వాయిదా తీర్మానాలను వ్యతిరేకించాలని తన మంత్రులకు ఆదేశాలు జారీ చేయడంలోను ఆయన మొండి స్వభావమే స్పష్టంగా కనిపిస్తుంది.

రెండో వ్యక్తి కేంద్ర హోంమంత్రి అమిత్ షా. మణిపూర్‌లో సీనియర్ అధికారుల నుంచి భద్రతా దళాలను మొహరించే వరకు ఆ రాష్ట్ర పరిపాలన సమస్తమూ అమిత్ షా ఆదేశాల ప్రకారమే నడిచింది, నడుస్తోంది. ఆయనే మణిపూర్ ప్రభుత్వం సుమా! అమిత్ షా కావలిలోనే హింసాకాండ ప్రజ్వరిల్లింది. మణిపూర్ ప్రజలు పరస్పరం తుపాకులు, బాంబులతో మాత్రమే పోరాడుకోవడం లేదు. స్వతంత్ర భారతదేశంలో ప్రప్రథమంగా రాకెట్లు, ఆయుధీకరణ అయిన డ్రోన్‌లను ఉపయోగించారు. గతవారం మణిపూర్‌లోని రెండు జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. ఐదు జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు, ఇంటర్నెట్‌ను నిలిపివేశారు. ఇంఫాల్ నగరంలో పోలీసులు వీధులలో విద్యార్థులతో పోరాడుతున్నారు. మణిపూర్‌లో ఇప్పటికే ఉన్న 26 వేలమంది భద్రతా సిబ్బందికి సహాయంగా మరో రెండు సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల (2000 మంది స్త్రీ పురుషులు) తరలించారు.

మూడో వ్యక్తి ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్. ఈయన తనకు తానుగా నిర్మించుకున్న కారాగారంలో ఖైదీగా ఉన్నారు. ఇంఫాల్ లోయలో సైతం ఆయనగానీ, ఆయన మంత్రులుగానీ పర్యటించలేకపోతున్నారు కుకీ జోమీలు ఆయన్ని అసహ్యించుకుంటున్నారు. బీరేన్ సింగ్ తమకు భద్రత సమకూర్చగలరని మెయిటీలు భావించారు. వారికి ఆశాభంగమే మిగిలింది. మణిపూర్‌లో చివరకు మెయిటీలకు సైతం ఆయన చాలా అప్రియమైన వ్యక్తిగా ఉన్నారు. పరిపాలన అనేది లేకుండా పోయింది. మణిపూర్‌ను దహించివేస్తున్న పౌర అశాంతికి బీరేన్ సింగ్ అవివేక, అసమర్థ పాలనే ప్రధాన కారణమనడం సత్యదూరం కాదు అన్ని పక్షాలూ, వర్గాలూ ఆయన్ని ఒక సమస్యగా పరిగణిస్తున్నాయి. చాలా నెలల క్రితమే ఆయన రాజీనామా చేసి ఉండవలసింది. మరి బీరేన్ సింగ్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న వైనం తమ తప్పులను ఒప్పుకునేందుకు రవ్వంత కూడా సిద్ధపడని నరేంద్ర మోదీ, అమిత్ షా అహంకారపూరిత వైఖరిని ప్రతిబింబిస్తోంది. మణిపూర్ ఇప్పుడు యథార్థంగా రెండు రాష్ట్రాలు. చురాచంద్‌పూర్, ఫెర్జవాల్, కాంగ్ పోక్పీ జిల్లాలు పూర్తిగా కుకీల నియంత్రణలో ఉన్నాయి. సరిహద్దు పట్టణం మోరేతో సహా టెంగ్‌నౌపాల్ జిల్లాలు కుకీల నియంత్రణలో ఉన్నవి. ఈ జిల్లాలో నాగాలు కూడా గణనీయంగా ఉంటారు. కుకీలు తమ ప్రత్యేక పాలనను నిర్వహిస్తున్నారు. మెయిటీ జాతికి చెందిన ప్రభుత్వోద్యోగులు కుకీల నియంత్రణలో ఉన్న ప్రాంతాలలో లేరు. మెయిటీలు అందరూ ఇంఫాల్ లోయలో మాత్రమే ఉన్నారు. మెయిటీలు మెజారిటీగా ఉన్న రాష్ట్రంలో (మణిపూర్ శాసనసభలోని 60 మంది సభ్యులలో 40 మంది మెయిటీలే) ఉండడానికి ఇష్టపడడం లేదు. మణిపూర్ ప్రాదేశిక సమగ్రత, అస్తిత్వాన్ని సంరక్షించుకోవాలని మెయిటీలు ఆకాంక్షిస్తున్నారు. మెయిటీలు, కుకీల మధ్య ఎటువంటి మినహాయింపులు లేని వైరభావం నిండుగా నెలకొని ఉంది.

ప్రభుత్వం, భిన్న జాతుల మధ్యగానీ, మెయిటీలు, కుకీల మధ్య గానీ చర్చలు జరగడంలేదు. అందుకు ఆస్కారం కూడా కనిపించడంలేదు ఇక నాగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చారిత్రక ఫిర్యాదులు ఉన్నాయి. మెయిటీలు, కుకీల ఘర్షణల్లో భాగం కావడానికి నాగాలు ఇష్టపడడం లేదు. అపనమ్మకాలు, వంచన, జాతుల ఘర్షణ సాలెగూడులో మణిపూర్ చిక్కుకున్నది. శాంతి భద్రతలను కాపాడి ఒక ప్రభుత్వాన్ని నిర్వహించడమనేది అంత సులువైన విషయం కాదు. దాదాపుగా అసాధ్యమనే చెప్పాలి. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, అదే పార్టీ పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా మణిపూర్‌లో పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయి. మన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంలో ఒక రాష్ట్రమైన మణిపూర్‌కు ప్రయాణించడమంటే చందమామలోని సుదూర, నిగూఢ, అజ్ఞాత ప్రదేశాలకు వెళ్లడమంత ప్రమాదభరితమన్న సత్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహుశా తెలుసుకున్నారేమో?!



అపనమ్మకాలు, వంచన, జాతుల ఘర్షణ సాలెగూడులో మణిపూర్ చిక్కుకున్నది. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా మణిపూర్‌లో పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయాయి. మన భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంలో ఒక రాష్ట్రమైన మణిపూర్‌కు ప్రయాణించడమంటే చందమామలోని సుదూర, నిగూఢ, అజ్ఞాత ప్రదేశాలకు వెళ్లడమంత ప్రమాదభరితమన్న సత్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహుశా తెలుసుకున్నారేమో?!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి,

రాష్ట్రపతి పాలన కోసమే ప్రకాశం బ్యారేజి విధ్వంస కుట్ర

ఎన్నడూ లేని విధంగా ఇటీవల కృష్ణానదికి 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఈ సమయంలో ఒక్కొక్కటి 40 టన్నుల బరువున్న మూడు ఐరన్ బోట్లు నైలాన్ త్రాడుతో కలిపి కట్టి 120 టన్నులున్న వాటిని వేగంగా పారుతున్న వరదలో ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టి కూల్చే విధంగా కుట్ర చేసినట్టు కన్పిస్తున్నది. ప్రకాశం బ్యారేజీ కూలిపోతే వేలాది మరణాలు సంభవిస్తాయి. వీటిని చూపి రాష్ట్రపతిపాలన డిమాండ్ చేయాలనే రాజకీయ కుట్ర చేశారు.

వినుకొండలో వైసీపీకి చెందిన ఇద్దరు రౌడీల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు హత్యకు గురయ్యారు. దీన్ని టీడీపీకి అంటగట్టడమే కాక రాష్ట్రంలో 36 హత్యలు జరిగినట్టు అబద్ధపు ప్రచారంతో ఢిల్లీలో ధర్నా చేసి రాష్ట్రపతి పాలన విధించాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ 36 హత్యలకు సంబంధించి వారి పేర్లు ఇవ్వండి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే కోరినా జగన్ పేర్లు ఇవ్వలేకపోయారు. ఎందుకంటే 36 మంది హత్యకు గురికాలేదు కాబట్టి. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా నిండకముందే రాష్ట్రపతి పాలన కోరడం అసాధారణం. జగన్ ఎందుకు అంత తొందరపడ్డారు? తాను సీఎంగా ఉండగా ప్రతిరోజు తాడేపల్లి ప్యాలెస్‌కు దోపిడీ డబ్బు మూటలు చేరేవి. ఇప్పుడు అవి ఆగిపోయినందున జగన్ సహించలేకపోతున్నారు. ప్రజా ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారు. అందులో భాగమే రాష్ట్రపతి పాలన కోసం ప్రకాశం బ్యారేజ్ విధ్వంస కుట్ర.



ప్రజా ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి జగన్ కుట్రలు చేస్తున్నారు. అందులో భాగమే ప్రకాశం బ్యారేజ్ విధ్వంస కుట్ర. గతంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి తునిలో 16 రైలు బోగీలను తగులబెట్టించారు. తన అధికార, ధనదాహానికి ఎన్ని ఘోరాలు, నేరాలకైనా వెనుకాడరని ఆయన చరిత్ర స్పష్టం చేస్తున్నది.

గతంలో చంద్రబాబు ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి తునిలో 16 రైలు బోగీలను తగులబెట్టించారు. తన అధికార, ధనదాహానికి ఎన్ని ఘోరాలు, నేరాలకైనా వెనుకాడరని ఆయన చరిత్ర స్పష్టం చేస్తున్నది. రాష్ట్ర ప్రజలు ఏమనుకొంటారో అన్న బెరుకు కూడా లేకుండా చిన్నాన్నను చంపిన హంతకుల్ని వెనకేసుకొస్తున్నారు. వివేకా హంతకులకు శిక్షపడాలని కోరుకున్న తల్లి, చెల్లి, సోదరి సునీతను పట్టించుకోవడం మానేశారు. డా. ఈ.సి. గంగిరెడ్డి మరణం వెనుక పలు అనుమానాలున్నాయి. వివేకానందరెడ్డిని హత్య చేయించి అది నారాసుర రక్తచరిత్ర అని తన సొంత మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేయించారు. అలాగే అడ్డదారిలో అధికారం కోసం కోడికత్తి డ్రామాలాడి ఒక దళిత యువకుణ్ణి ఐదేళ్ల జైలుపాలు చేశారు. కోడికత్తి డ్రామాను గోరంతలు కొండంతలు చేసి టీడీపీకి అంటగట్టే కుట్ర ప్రచారం చేశారు. అధికారం నిలుపుకోవడానికి గులకరాయి నాటకం ఆడి, బీసీ వర్గానికి చెందిన పసిబాలుణ్ణి జైలుపాలు చేశారు. దీన్ని కూడా విజయవాడ టీడీపీ నేతలకు అంటకట్టే ప్రచారం చేశారు.

పింఛన్ల పంపిణీని కావాలని ఆలస్యం చేసి 32 మంది అవ్వాతాతల ప్రాణాలు తీశారు. రాయలసీమలో తనకు అడ్డం అని భావించి పరిటాల రవిని హత్య చేయించారనే ఆరోపణలపై విచారణ జరిగింది. అలిపిరిలో చంద్రబాబుపై ల్యాండ్‌మైన్ బ్లాస్ట్ చేసిన తీవ్రవాదులకు సెల్‌ఫోన్లు తదితరాలు సరఫరా చేసిన స్మగ్లర్ గంగిరెడ్డి కూడా జగన్ అనుచరుడే. అమరావతిలో చెరుకు తోట దగ్ధంలో నందిగం సురేష్ పాత్ర ఉంది కాబట్టే ఎంపీ సీటు ఇచ్చారు. అతని ఇసుక మాఫియాలను ప్రశ్నించిన అప్పటి తాటికొండ ఎమ్మెల్యే డా. ఉండవల్లి శ్రీదేవిని సాగనంపారు. ఇలా జగన్‌రెడ్డి తన అధికారం కోసం, దోపిడీ కోసం ఎంతటి అఘాయిత్యాలు చేయడానికైనా సిద్ధపడతారని గత చరిత్ర రుజువు చేయడం లేదా? రాష్ట్రపతి పాలన కోసం ప్రకాశం బ్యారేజీ కూల్చివేత కుట్రకు పాల్పడ్డారంటే ఆశ్చర్యపోవాల్సింది ఏముంది? దీనిపై ప్రభుత్వం లోతుగా విచారణ చేస్తున్నది.

ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టించిన బోటు యజమానులు తెలుగుదేశంవారేనని జగన్ ముఠా మరలా అబద్ధాలకు దిగింది. ఆ బోట్లు తెలుగుదేశంవారివైతే నేటికీ వాటికి వైసీపీ జెండా రంగులు ఎందుకున్నాయి? బోటు యజమానులపై కేసు పెడితే అది అక్రమ కేసని వైసీపీ నాయకులు ఎందుకు అన్నారు? కోమటి రామ్మోహన్... జగన్ ప్రోగ్రామ్ కన్వీనర్ తలశిల రఘురాం మేనల్లుడు కాదా? బోట్లు తెలుగుదేశం వారివైతే వారిని నందిగం సురేష్ తన ఇసుక మాఫియాలో ఎందుకు చేర్చుకున్నారు? జగన్ పాలనలో రామ్మోహన్, ఉషాద్రి ఇరువురు బోట్ల ద్వారా గుంటూరు వైపు నుండి కృష్ణా నదిలో అక్రమ ఇసుక తరలించింది వాస్తవం కాదా? తెలుగుదేశం వారెవరైనా 1.50 కోట్ల విలువ కలిగిన బోట్లను లంగరు వేయకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తారా? ప్రకాశం బ్యారేజీని విధ్వంసం చేసే అవసరం తెలుగుదేశానికి ఎందుకు ఉంటుంది? ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టిన బోట్లు ముమ్మాటికీ వైసీపీ శాండ్ మాఫియా వారివే అనేది స్పష్టం. ఈ నిజాన్ని కప్పిపుచ్చుకోవడానికి మంత్రి నారా లోకేష్‌పై నిందా ప్రచారానికి దిగారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత బోటు యజమానుల సంఘం ప్రతినిధులు లోకేష్‌కి ఒక వినతిపత్రం ఇచ్చారు. ఆ ప్రతినిధుల్లో ప్రకాశం బ్యారేజీ ఢీకొట్టిన ఘటనలో ప్రస్తుతం జైలులో ఉన్న ఒక వ్యక్తి కూడా ఉన్నాడు. దీన్ని వక్రీకరించి వారిని తెలుగుదేశం వారిగా నమ్మించే అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. మంత్రుల దగ్గరకు రకరకాల వ్యక్తులు, ఇతర పార్టీలవారు, సంఘాల వారు రావడం, ఫోటోలు దిగడం సహజం. ఆ ఫోటోలు తీసి సందర్భాన్ని వక్రీకరించి అబద్ధపు ప్రచారం చేయడం జగన్ ముఠా ట్రేడ్ మార్క్.

తెలుగుదేశం విజయోత్సవ ప్రదర్శనలో ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టిన పెద్ద ఐరన్ బోట్లు లేవు. ఉన్నట్లు జనాన్ని నమ్మించడానికి అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. బోట్లు ఢీకొట్టిన సెప్టెంబరు రెండుకి ముందు జగన్, సజ్జల, నందిగం సురేష్, తలశిల రఘురాం కాల్‌డేటా పోలీసులు పరిశీలించడానికి నిరభ్యంతర పత్రం జగన్ ఇవ్వగలరా? తప్పుడు పనులు చేసిన నందిగం సురేష్‌ను చూడడానికి వెళ్లిన జగన్, జైలు వద్ద తప్పుడు మాటలు మాట్లాడారు. వరదల్లో 60 మంది చనిపోయారని మరలా అబద్ధపు ఆరోపణ చేశారు. 60 మంది మృతులు ఉంటే జగన్ ఆ పేర్లు ఇవ్వగలరా? పేర్లు ప్రకటించకుండా గాలి మాటలు ఎందుకు చెబుతున్నారు? శవ రాజకీయాలు చేయడం జగన్‌కు అలవాటుగా మారింది.

వరద సమయాల్లో నిర్లక్ష్యానికి పాల్పడి తాడేపల్లి ప్యాలెస్‌లో కాలక్షేపం చేసింది జగనే. విపత్తుల్లో తక్షణమే స్పందించే లక్షణం చంద్రబాబు, లోకేష్‌లకు ఉన్నదనేది జగమెరిగిన సత్యం. చంద్రబాబుపై నెగ్లిజెన్స్ కేసు పెట్టాలని జగన్ మాట్లాడడం దుర్మార్గం. తన కంట్లో దూలాలు పెట్టుకుని ఎదుటివారి కంట్లో నలుసులు వెతకడం జగన్‌కు పరిపాటి అయింది. నెగ్లిజెన్స్ కేసు పెట్టాల్సి వస్తే అన్నమయ్య డ్యాం గల్లంతుకు, అందులో 33 మంది ప్రాణాలు పోగొట్టిన విషయంలో జగన్‌పైన ఆ కేసు పెట్టాలి. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు నిధులు ఇవ్వకపోవడం వల్లే పించా డ్యాం కొట్టుకుపోయింది. గుండ్లకమ్మ గేట్లు, పులిచింతల, తుంగభద్ర గేట్లు కొట్టుకుపోయినందుకు, గోదావరి వరదల్లో బోటు యాత్రకు అనుమతించి 39 మంది ప్రాణాలు పోయేందుకు కారణమైన జగన్‌పై కేసు పెట్టాలి.

తెగిపోయిన తుంగభద్ర గేట్లను దేశమంతా ఆశ్చర్యపోయే విధంగా చంద్రబాబు ప్రభుత్వం వరదలోనే బిగించి రాయలసీమను కరువు నుంచి కాపాడింది. వరద సమయంలోనే ప్రకాశం బ్యారేజ్‌కు ఒక్కొక్కటి 17 టన్నులు బరువు గల మూడు కౌంటర్ వెయిట్‌లను ఏర్పాటు చేయగలిగింది. కుట్రలు, అబద్ధాలు, అవినీతి, శవ రాజకీయాలను జగన్ మానుకోకపోతే ప్రజలు ఆయనకి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తారు.



■ కొల్లు రవీంద్ర
మైన్స్, ఎక్సై[illegible] శాఖ మంత్రి

స.వెం. రమేశ్‌కి బొమ్మిడాల పురస్కారం

వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించే తెలుగువారికి ఇచ్చే బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి విశిష్ట సేవా పురస్కారం ఈ ఏడాది స.వెం. రమేశ్‌కి అందజేయనున్నారు. నేటి సాయంత్రం ఆరు గంటలకు గుంటూరులోని బొమ్మిడాల బాలుర వైద్య హాస్టల్ ఆవరణలో జరిగే ప్రత్యేక సభలో ఈ పురస్కారం అందజేస్తారు. వివిధ దేశాల్లో తెలుగు మూలాల అన్వేషణలోనూ, తమిళనాడులో తెలుగు భాషా సంస్కృతులను కాపాడేందుకు చేస్తున్న కృషిని గుర్తించి స.వెం. రమేశ్‌కి ఈ పురస్కారం అందజేస్తున్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ సామల రమేష్‌బాబు, అమ్మనుడి పత్రిక సంపాదకుడు గారపాటి ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు సభలో పాల్గొంటారు. వెన్నిశెట్టి సింగారావు, మోదుగుల రవికృష్ణ సభ నిర్వహిస్తారు. గతంలో బొమ్మిడాల పురస్కారాన్ని రావు బాలసరస్వతి, బాలాంత్రపు రజనీకాంతారావు, నేరెళ్ళ వేణుమాధవ్, విఏకె రంగారావు, లంకా సూర్యానారాయణ, కొలకలూరి ఇనాక్, కోడూరి ప్రభాకరరెడ్డి అందుకున్నారు.

— బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి
బొమ్మిడాల ఫౌండేషన్ చైర్మన్

సంఘ సంస్కర్తల వర్ధంతి సభ

'కవికోకిల' దువ్వూరి రామిరెడ్డి, శ్రీమతి పొణకా కనకమ్మ, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి తదితర సంఘ సంస్కర్తల వర్ధంతి సభ రేపు సాయంత్రం ఆరు గంటలకు జరుగనున్నది. నెల్లూరు టౌన్‌హాల్‌లోని లైబ్రరీహాల్, వర్ధమాన సమాజంలో జరిగే ఈ సభకు అధ్యక్షులు చెలంచర్ల భాస్కరరెడ్డి. ముఖ్య అతిథి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. డి.కోదండరామిరెడ్డి, స్వర్ణా గంగాధరం, నలబోలు బలరామనాయుడు, వింజమూరు మస్తాన్‌బాబు, షేక్ లతీఫ్ కుట్టి, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి వక్తలు.

— బి. సురేంద్రనాథ్ రెడ్డి
కన్వీనర్, పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి





డ్రెయినేజీ కాదు.. ఇల్లే..! : కబేళాలో ఓ ఇంటి పరిస్థితి ఇలా..

కష్టాలు కన్నీరై ప్రవహిస్తుంటే.. నష్టాలు నానాటికీ పెరిగిపోతుంటే.. ఏమీ చేయలేక, ఎటువైపు వెళ్లాలో దారితోచక దిక్కులు చూస్తూ వరద బాధితులు చేస్తున్న ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. కనికరం లేని వరద ఇష్టానురీతిన తుడిచి పెట్టుకుపోతే, కకావికలమైన బతుకులు కన్నీరు తుడుచుకుని మరమ్మతుల పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఎంత కష్టించినా తొలగని బురద, ఎంత వెతికినా కనిపించని వస్తువులు, నామరూపాలు కోల్పోయిన ఇళ్లను చూసుకుంటూ జీవితాలను మళ్లీ మొదలుపెడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, జక్కంపూడి, వైఎస్సార్ కాలనీ, కండ్రిక, పాయకాపురం, అంబాపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. కొన్ని వీధుల్లో ఇంకా వరద నీరు ఉండటంతో బాధితులు బిక్కుబిక్కుమంటూనే జీవిస్తున్నారు. పారిశుధ్య కార్మికుల చేయూత, అగ్నిమాపక సిబ్బంది సహకారం, దాతల దాతృత్వం బాధితులకు కాస్త చేదోడుగా నిలుస్తోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



కకావికలం

దిక్కుతోచని స్థితిలో వరద బాధితులు

- కొన్ని ప్రాంతాల్లో ఇంకా తొలగని నీరు
- మురుగు నీటిలోనే ఉండిపోయిన కొందరు
- బురదతో సహవాసం చేస్తున్న ఇంకొందరు
- ఎంత శుభ్రం చేస్తున్నా తొలగని మురుగు
- అస్తవ్యస్తంగా మారిన పరిసరాలతో అవస్థలు
- రెండు వారాలవుతున్నా చక్కబడని పరిస్థితి



క్యూ : సింగ్‌నగర్ డంపింగ్ యార్డు వద్ద బారులుతీరిన చెత్తతో నిండిన వాహనాలు



ఆరని వేదన.. తీరని యాతన : సామాన్లు శుభ్రం చేస్తూ..



బ్యాంకంతా బయటకు : పాయకాపురంలో..



సర్వం నాశనం : కబేళాలో ఓ కుటుంబం కష్టాలు



ఆకలి పోరాటం



ఆశ.. మనిషిని ముందుకు నడిపిస్తుంది. అదే చచ్చిపోయినప్పుడు జీవితం దుర్భరంగా మారుతుంది. జీవనం కష్టమవుతుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి ఇందుకు ఏమీ మినహాయింపు కాదు. ఒక్కసారిగా విరుచుకుపడిన వరద సర్వస్వాన్ని నాశనం చేయగా, బతుకుజీవుడా.. అంటూ బయటపడిన బాధితులు గుక్కెడు నీటికోసం, గుప్పెడు మెతుకుల కోసం ఇలా చేతులు చాస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కనిపిస్తున్న ఇలాంటి చిత్రాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి.

వరద బాధిత జిల్లాగా ఎన్టీఆర్

- రెవెన్యూ శాఖ ఉత్తర్వులు విడుదల
- కేంద్ర నిధులు పుష్కలంగా వచ్చే అవకాశం

విజయవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాను పూర్తి వరద ప్రభావిత జిల్లాగా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గడిచిన నెల 30, 31 తేదీల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఆ రెండు రోజుల్లో 48 గంటల్లోపు 30 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షాల కారణంగా అటు కృష్ణా నదికి రికార్డు స్థాయిలో 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. మరోపక్క బుడమేరు కాల్వకు భారీ వరద వచ్చింది. ఈ కారణంగా నగరంలోని 32 డివిజన్లు పూర్తిగా నీట మునిగాయి. 2లక్షల మంది జనాభా బాధితులయ్యారు. కృష్ణానదికి వచ్చిన వరద కారణంగా రిటైనింగ్ వాల్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాలు నీట మునిగాయి. ఈ వరద నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్రబృందం ఇప్పటికే జిల్లాలో పర్యటిస్తోంది. ఈ బృందం ఇచ్చిన నివేదికను బట్టి నిధులు విడుదలవుతాయి. తాజాగా ప్రభుత్వం జిల్లాను పూర్తి వరద ప్రభావిత జిల్లాగా ప్రకటించడంతో నిధులు ఎక్కువగా విడుదలయ్యే అవకాశాలున్నాయి.



లోకేశ్‌తో జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, సెట్టెం రఘురాం తదితరులు

పేట మునిసిపాలిటీ టీడీపీ వశం

పార్టీలో చేరిన మునిసిపల్ చైర్మన్

- లోకేశ్ సమక్షంలో చేరిక
- మురో ముగ్గురు కౌన్సిలర్లు కూడా..
- కౌన్సిల్‌లో టీడీపీ బలం 18, వైసీపీకి 13

జగ్గయ్యపేట, సెప్టెంబరు 13 : జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ నివాసంలో జరిగిన ఒక కార్యక్రమంలో రాఘవేంద్రతో పాటు 7, 23, 31 వార్డుల కౌన్సిలర్లు పూసపాటి సీతారావమ్మ-పుల్లారావు, డి.రమాదేవి-రామకృష్ణ, గింజుపల్లి వెంకట్రావును పార్టీలో చేర్చుకున్నారు. వైసీపీకి చెందిన ఈ నేతల చేరికతో జగ్గయ్యపేట మునిసిపాలిటీలో టీడీపీ మెజారిటీ పక్షంగా అవతరించింది. గతంలో వైసీపీకి పదిహేడు, టీడీపీకి పద్నాలుగు కౌన్సిలర్ల పదవులు ఉండేవి. తాజా చేరికలతో కౌన్సిల్‌లో టీడీపీ బలం పద్దెనిమిదికి పెరగగా, వైసీపీ బలం పదమూడుకు తగ్గింది. ఈ చేరిక కార్యక్రమంలో జగ్గయ్యపేట టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కూడా పాల్గొన్నారు. వారితో లోకేశ్ కొద్దిసేపు మాట్లాడారు. 'రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనంతగా ఒకేసారి భారీ వర్షాలు కురిశాయి. ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచింది. వరదలోనూ జగన్‌రెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నారు' అని విమర్శించారు. అనంతరం శ్రీరాం తాతయ్య మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 'తాజా చేరికలతో జగ్గయ్యపేట మునిసిపాలిటీ టీడీపీ వశమైంది. వైసీపీ విధానాలు నచ్చక చాలామంది ఆ పార్టీని వీడుతున్నారు. జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా ఆ పార్టీ వీడతారనే ప్రచారం జరుగుతోంది. అది ఆయన వ్యక్తిగత నిర్ణయం' అని శ్రీరాం తాతయ్య అన్నారు. మునిసిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఇటీవలి వరదల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన కృషికి ఆకర్షితుడనై టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. వారి వెంట మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజా, టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ యలమంచిలి రాఘవ, టీడీపీ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, వేదులాపురి అలేఖ్య, సంధ్యారాణి, గీతారాణి, పేరం సైదేశ్వరరావు, గొట్టి నాగరాజు, నకిరికంటి వెంకట్ తదితరులు తరలివెళ్లారు.

పురుగు మందు తాగి కౌలురైతు ఆత్మహత్య



నాగరాజు (ఫైల్)

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 13 : పెనుగంచిప్రోలు మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన యువ కౌలురైతు కాసరెల్లి నాగరాజు (30) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజు ఐదేళ్లుగా వెంకటాపురం గ్రామంలో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. వ్యవసాయంలో లాభాలు రాక సుమారు రూ.7 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పుల బాధను తట్టుకోలేక గతనెల 28వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందులు కలుపుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉంది. నాగరాజు మృతితో కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.అర్జున్ తెలిపారు.

వరద కష్టం.. ఎంతో నష్టం

వరద కష్టం జిల్లాకు తీరని నష్టాన్ని మిగిల్చింది. నాలుగు రోజుల పాటు జరిగిన ఫ్లడ్ ఎన్యూమరేషన్ ముగిసిన నేపథ్యంలో నష్టాల వివరాలు తెలిశాయి. 30,893 ఇళ్లు, 43,281 వాహనాలు, 31,436 ఫ్రిజ్‌లు, 26,723 టీవీలు, 21,153 వాషింగ్ మెషీన్లు, 2,051 ఏసీలు, 16,834 గేదెలు, గొర్రెలు, కోళ్లకు నష్టం జరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి.

జిల్లాలో ముగిసిన ఎన్యూమరేషన్ ప్రక్రియ

- నష్ట వివరాలు ఓ కొలిక్కి..
- ఇళ్లు, వాహనాలకు భారీ నష్టం
- తర్వాత ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లావ్యాప్తంగా 30,893 ఇళ్లకు నష్టం జరిగింది. తూర్పు, పశ్చిమ, నార్త్, సెంట్రల్ మండలాలతో పాటు విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో ఈ లెక్క తేలింది. ఇక వరద రాకపోయినా మరో 2,806 మంది తమ ఇళ్లకు నష్టం జరిగిందని క్లెయిం చేసుకున్నారు. నగరంలో అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌ఫ్లోర్ దెబ్బతిందని 3,125 మంది, ఫస్ట్‌ఫ్లోర్ దెబ్బతిందని 324 మంది, ఇతర ఫ్లోర్లు దెబ్బతిన్నాయని 149 మంది క్లెయిం చేశారు. అత్యధికంగా పక్కా ఇళ్ల గ్రౌండ్‌ఫ్లోర్ దెబ్బతిందని 15,949 మంది ఎన్యూమరేషన్ సిబ్బందికి వివరాలు తెలియజేశారు. దెబ్బతిన్న కచ్చా ఇళ్లు అత్యధికంగా 8,547 వరకు ఉన్నాయి. విజయవాడ నార్త్ మండలంలో అత్యధికంగా 12,850 ఇళ్లు ఉండగా, వీటిలో గ్రౌండ్‌ఫ్లోర్ 7,432, కచ్చా ఇళ్లు 2,726, అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌ఫ్లోర్ 1,255 ఉన్నాయి. విజయవాడ పశ్చిమ మండలంలో 4,814 ఇళ్లకు నష్టం జరిగింది. వీటిలో అత్యధికంగా గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు 2,700, కచ్చా ఇళ్లు 887, అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌ఫ్లోర్ 520 ఉన్నాయి. విజయవాడ రూరల్ మండల పరిధిలో మొత్తం 1,927 ఇళ్లు దెబ్బతిన్నాయి. గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు 687, కచ్చా ఇళ్లు 833 ఉన్నాయి. విజయవాడ సెంట్రల్ మండల పరిధిలో 1,202 ఇళ్లకు నష్టం చేకూరింది. పక్కా గ్రౌండ్‌ఫ్లోర్ 470, కచ్చా ఇళ్లు 553 ఉన్నాయి. విజయవాడ పశ్చిమ మండలంలో 1,121 ఇళ్లకు నష్టం కలిగింది. ఇందులో పక్కా గ్రౌండ్‌ఫ్లోర్ 327 ఇళ్లు, కచ్చా ఇళ్లు 686 ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో మొత్తం 1,476 ఇళ్లు దెబ్బతిన్నాయి.

ఎలక్ట్రానిక్ గృహోపకరణాల నష్టమిలా..

బుడమేరు ప్రభావిత ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్ గృహోపకరణాలకు తీవ్ర నష్టం కలిగింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 31,436 రిఫ్రిజిరేటర్లు దెబ్బతిన్నాయి. విజయవాడ నార్త్ మండలంలో 19,477, విజయవాడ పశ్చిమ మండలంలో 6,141, విజయవాడ రూరల్ మండలంలో 2,555, తూర్పు మండలంలో 1,124, ఇబ్రహీంపట్నం మండలంలో 1,283, సెంట్రల్ మండలంలో 856 రిఫ్రిజిరేటర్లకు నష్టం వాటిల్లింది. 26,723 టీవీలకు నష్టం చేకూరింది. విజయవాడ నార్త్‌లో అత్యధికంగా 16,729, విజయవాడ పశ్చిమలో 4,215, విజయవాడ రూరల్‌లో 2,630, విజయవాడ ఈస్ట్‌లో 1,177, ఇబ్రహీంపట్నంలో 1,202, విజయవాడ సెంట్రల్‌లో 770 చొప్పున టీవీలు దెబ్బతిన్నాయి. మొత్తంగా 21,153 వాషింగ్ మెషీన్లు దెబ్బతినగా, విజయవాడ నార్త్ మండలంలో 13,514, విజయవాడ పశ్చిమలో 4,516, విజయవాడ రూరల్ మండలంలో 1,597, తూర్పు మండలంలో 550, ఇబ్రహీంపట్నం మండలంలో 422 ఉన్నాయి. 2,051 ఏసీలు దెబ్బతిన్నాయి. విజయవాడ నార్త్‌లో 1,248, పశ్చిమలో 340, విజయవాడ రూరల్‌లో 196, విజయవాడ తూర్పులో 146, ఇబ్రహీంపట్నంలో 65, విజయవాడ సెంట్రల్‌లో 56 ఏసీలు డ్యామేజీ అయ్యాయి.



వరద బాధితులకు ఎన్యూమరేషన్ (ఫైల్)

దెబ్బతిన్న వాహనాలు

జిల్లావ్యాప్తంగా మొత్తంగా 43,821 వాహనాలకు నష్టం వాటిల్లింది. వీటిలో మోటారు ద్విచక్రవాహనాలు 37,093, సైకిళ్లు 3,664, ఆటోలు 421 వరకు ఉన్నాయి. విజయవాడ నార్త్ మండలంలో 27,368, పశ్చిమలో 10,570, విజయవాడ రూరల్ మండలంలో 2,977, తూర్పు మండలంలో 969, సెంట్రల్ మండలంలో 1,242, ఇబ్రహీంపట్నంలో 695 చొప్పున వాహనాలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రిక్షాలు 2,640 వరకూ ఉన్నాయి. అలాగే, 16,834 పశు సంపదను కోల్పోవాల్సి వచ్చింది. గేదెలు 398, గొర్రెలు 611, పౌల్ట్రీకోళ్లతో పాటు నాటుకోళ్లు కూడా కలిపి 15,624 ఉన్నాయి.

దసరా ఏర్పాట్లకు సన్నద్ధం కావాలి

- అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సృజన సమీక్ష
- భక్తులకు ఇబ్బంది లేకుండా భారీ బందోబస్తు : సీపీ
- త్వరగా దర్శనం పూర్తయ్యేలా చర్యలు : ఈవో
- 16న క్షేత్రస్థాయిలో పనుల పరిశీలనకు నిర్ణయం

6లో

ఆపరేషన్ బుడమేరుకు ప్రాధాన్యం

ఆక్రమణలపై నివేదికలివ్వండి • సర్వే నెంబర్ల వివరాలను సమర్పించండి

తొలిదశ చర్యలపై కలెక్టర్ సృజన సమీక్ష



రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి సారథి, ఎమ్మెల్యే గద్దె

బుడమేరుకు వరద నివారణ చర్యలు

- ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీలో మంత్రి సారథి

కృష్ణలంక, సెప్టెంబరు 13 : భవిష్యత్తులో బుడమేరుకు వరద పోటు రాకుండా ఏమి చేయాలనే అంశంపై ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నదని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం కృష్ణలంక 21వ డివిజన్‌లో రణదీవెనగర్ కరకట్ట వద్ద వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో పాటు మంత్రి పాల్గొని నిత్యావసర వస్తువులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృష్ణానది, బుడమేరుకు వచ్చిన వరదల వల్ల నష్టపోయిన వారికి నూజివీడు నియోజకవర్గంలోని సింకొల్లు గ్రామస్థులు నిత్యావసరాలను పంపిణీ చేయడానికి ముందుకు వచ్చారన్నారు.

కృష్ణా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసినా కొన్ని లీకుల వల్ల ఇళ్లు మునగడం జరిగిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అండగా వుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు. బుడమేరుకు భవిష్యత్తులో వరద రాకుండా ఏవిధంగా చేయాలనే ఆలోచనలను ప్రభుత్వం చేస్తోందని మంత్రి చెప్పారు. కృష్ణలంక రిటైనింగ్ వాల్ వద్ద ఇసుక వుండటం వల్ల నీరు ఇంకి ఇళ్ల వైపునకు వస్తోందని, వరదలు వచ్చినప్పుడు నీటిని పంపింగ్ చేయడానికి ప్రత్యేకంగా పంపింగ్ స్టేషన్లు అవసరమని గుర్తించామని, వాటిని కూడా నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. కార్యక్రమంలో బొప్పన భవకుమార్, గోరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కొప్పూరి కిరణ్ బాబు, కేశనం భావన్నారాయణ, పోడూరి పవన్‌కుమార్, గుండు శ్రీను, కొర్రా అప్పన్న, పోతిరెడ్డి వెంకటరమణ, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నాగులూరు చెరువుకు పడిన గండ్లను పరిశీలిస్తున్న దేవినేని ఉమా

నీటి సంఘాలను నిర్వీర్యం చేసిన జగన్

- మాజీమంత్రి ఉమా

రెడ్డిగూడెం, సెప్టెంబరు 13 : గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ రెడ్డి నీటి సంఘాలను నిర్వీర్యం చేయడం వల్లే ఇంతటి ఘోరాలు చూడాల్సి వచ్చిందని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. నాగులూరులో చెరువులకు పడిన గండ్లను ఆయన శుక్రవారం స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. గత వైసీపీ పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. బుడమేరును ఇష్టానుసారంగా కబ్జా చేయడం వల్ల వేల ఎకరాల్లో పంటలు పాడయ్యాయన్నారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో మంచి వారిని ఎన్నుకొని చెరువులను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ముప్పిడి నాగేశ్వర రెడ్డి, బొమ్మన కోటేశ్వరరావు, కామిశెట్టి వెంకట నరసయ్య, పైడిమర్ల కిరణ్‌కుమార్ రెడ్డి, చీపు వెంకటేశ్వరరావు, కొలుసు చిన్ని, మల్లాది పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు వస్త్రాలను అందజేస్తున్న కలెక్టర్

స్వచ్ఛంద సేవ అభినందనీయం : కలెక్టర్ సృజన

కృష్ణలంక: ఉద్యోగ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పది రోజులపాటు ముంపు బాధితులకు నిరంతర సేవలు అందించడంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది చేయూతనివ్వడం అభినందనీయమని కలెక్టర్ జి.సృజన తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలకు నూతన వస్త్రాల కిట్లను శుక్రవారం కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ, ముంపు బాధితులకు ప్రభుత్వపరంగా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరక్టర్ జి.ఉమాదేవి మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల సహకారంతో బాధితులకు చీర, దుప్పటి, లుంగీ, టవల్, నైట్‌డ్రస్, శానిటరీ నాప్‌కిన్స్‌లతో కూడిన రూ.లక్ష విలువైన కిట్లను 500 కుటుంబాలకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జేసీ నిధి మీనా, విశ్రాంత ఉద్యోగులు ఆర్.సూయజ్, కె.సుహాసినీదేవి, ఆర్.ఎల్.అన్నపూర్ణాదేవి, కె.కృష్ణకుమారి, సీడీపీవోలు జి.మంగమ్మ, పి.నాగమణి, ఏసీడీపీవో జ్యోత్స్న, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



బొబ్బర్లంక బాధితులకు తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిట్ల పంపిణీ

వరద బాధితులకు తానా వితరణ

మోపిదేవి/లబ్బీపేట, సెప్టెంబరు 13 : తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, తానా ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు శుక్రవారం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. బొబ్బర్లంక గ్రామంలోని 200 బాధిత కుటుంబాలకు ఐదు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ గోధుమ పిండి, ఆయిల్ ప్యాకెట్లతో కలిపి పదిరకాల నిత్యావసరాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, కృష్ణానది వరద ప్రభావిత ప్రాంతాల్లో సర్వం కోల్పోయిన ఆరు వేలమంది బాధితులకు సహాయం అందించిన తానా ఫౌండేషన్ చైర్మన్ వల్లేపల్లి శశికాంత్ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కె.కొత్తపాలెం దళితవాడలో ఢిల్లీలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రావణ కుమార్ ఆర్థిక సహకారంతో కాజ గ్రామానికి చెందిన ప్రసాద్, వేముల అన్విత, వేముల అద్విత్‌లు 150 కుటుంబాలకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, టీడీపీ గ్రామ అధ్యక్షులు దొప్పలపూడి జగదీష్, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి బీవీ రావు, వేమూరి వెంకటరావు, స్వచ్ఛంద కార్యకర్తలు శశికళ, సోనీబాబు, సుకన్య, దివ్య, రాము తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు దుస్తులు అందజేస్తున్న నేతలు

ఎన్టీఆర్ జిల్లా బీజేపీ జిల్లా కార్యాలయంలో అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, తదితరులు తానా ఫౌండేషన్ చైర్మన్ వల్లేపల్లి శశికాంత్ సహకారంతో దుస్తులను ముంపు బాధితులకు అందజేశారు.

దసరా ఏర్పాట్లకు సన్నద్ధం కావాలి



- అన్ని శాఖల అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన, చిత్రంలో సీపీ, వీఎంసీ కమిషనర్, దుర్గగుడి ఈవో తదితరులు

వన్‌టౌన్, సెప్టెంబరు 13 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అక్టోబరు 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. దసరా మహోత్సవాల నిర్వహణపై కలెక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, మునిసిపల్, రెవెన్యూ, పోలీస్, ట్రాఫిక్, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ తదితర శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేవస్థానంలో ప్రతీఏటా జరిగే దసరా ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా ప్రజలు తరలివస్తారన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. స్నాన ఘాట్లు, క్యూలైన్లు, కౌంటర్లు, ఇతర రద్దీ, ముఖ్యమైన ప్రదేశాలలో నిరంతరం నిఘా ఉంచుతున్నట్టు తెలిపారు. దుర్గగుడి ఈవో మాట్లాడుతూ, దసరా నవరాత్రులలో అమ్మవారికి చేసే అలంకారాలను వివరించారు. భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రసాదం, కళ్యాణ కట్ట కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. స్నాన ఘాట్లు, తాగునీరు, శానిటేషన్, సెక్యూరిటీ ఏర్పాట్లు రద్దీకి అనుగుణంగా క్యూల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టామని తెలిపారు. మునిసిపల్, పోలీస్, అగ్నిమాపక, వైద్య, రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, ఇతర విభాగాల ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

16న క్షేత్రస్థాయిలో సమావేశం

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 16న క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులతో కలిసి దేవస్థానంలో చేపట్టిన పనులు పరిశీలించి అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు కలెక్టర్ సృజన తెలిపారు. సమావేశంలో డీసీపీలు గౌతమ్ శాలి, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీ జి.రామకృష్ణ, ఆలయ ఈఈలు కేవీఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, డీఈవో లీలాకుమార్, ఏఈవోలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ బుడమేరుకు ప్రాధాన్యం

- ఆక్రమణలపై నివేదికలివ్వండి
- సర్వే నెంబర్ల వివరాలను సమర్పించండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సృజన

కృష్ణలంక, సెప్టెంబరు 13 : భవిష్యత్తులో బుడమేరు ముంపు నుంచి శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం 'ఆపరేషన్ బుడమేరు'కు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో సర్వే, ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్, వీఎంసీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి సర్వే నెంబర్లతో సహా ఆక్రమణలకు సంబంధించి పూర్తి నివేదిక సత్వరం సమర్పించాలని కలెక్టర్ జి.సృజన ఆదేశించారు. ఇందులో భాగంగా ఆక్రమణలకు గుర్తింపునకు తొలిదశలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ శుక్రవారం సర్వే, భూ రికార్డులు, నగరపాలక సంస్థ, రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల బుడమేరు పరీవాహక ప్రాంతంలో కురిసిన దాదాపు 40 వేల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో గండ్ల ద్వారా వచ్చిన నీటితో పరిసర లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు జలమయం కావడంతో పాటు నగరంలోని రెండులక్షలకు పైగా కుటుంబాలు ముంపుతో తీవ్రనష్టాన్ని చవిచూడటం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బుడమేరు ముంపునకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు 'ఆపరేషన్ బుడమేరు'ను ప్రకటించారని, ఈ నేపథ్యంలో బుడమేరు ఆక్రమణలకు సంబంధించిన నివేదికలను రూపొందించాల్సిన అవసరముందన్నారు. యుద్ధప్రాతిపదికన ఆక్రమణల తొలగింపునకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆక్రమణలు తొలగింపునకు శ్రీకారం చుట్టనుందని, ఈ నేపథ్యంలో ఆక్రమణల వాస్తవ వివరాలను సర్వే నెంబర్లతో సహా సమర్పించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ మున్సిపల్, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ఆక్రమణలపై నివేదిక రూపొందించాలని సూచించారు. వరద నీరు ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేందుకు ఆక్రమణల తొలగింపుతో పాటు పూడిక తీయడం, బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండి పడకుండా కట్టను పటిష్టపరచడం కూడా కీలకమని, వీటికి సంబంధించి ఇప్పటికే పనులు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, నగరపాలక సంస్థ చీఫ్ సిటీప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు బీమా క్లెయిమ్‌లు చేసుకోవచ్చు

విజయవాడ లీగల్ : వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం శని, ఆదివారాల్లోనూ పనిచేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన, దెబ్బతిన్న వాహనాలు, ఇళ్లు, దుకాణాలతో పాటు చిన్న, మధ్యతరహా వ్యాపారసముదాయాల వంటి ఆస్తులకు సంబంధించిన బీమా క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ఈనెల 9 నుంచి నిరాటంకంగా సేవలందిస్తోందని, బీమా సంస్థల ప్రతినిధులు ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో వుంటారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించండి

- కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతాకమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశపుహాలులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరచూ ప్రమాదాలు జరిగే అన్ని ప్రాంతాలను గుర్తించి అక్కడ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదం జరిగే ప్రాంతాలను తెలియజేసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. బుడమేరు వరదముంపు ప్రాంతాల్లో వరదతాకిడికి పాడైన ద్విచక్రవాహనాల రిపేర్లకు డీలర్లతో మాట్లడి స్పేర్‌పార్టులు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనాలు నడిపే ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలనే అంశంపై అవగాహన కల్పించి అక్కడికక్కడే వాహనదారులు హెల్మెట్ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, జాతీయరహదారుల అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, ఆర్అండ్‌బీ విభాగం ఈఈ శ్రీనివాసరావు, ఎంవీఐ ఎండీఎల్ సిద్ధిక్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి ఐదు లక్షలు



పెనమలూరు : ముంపు ప్రాంత బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి ఏలూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కొర్రై పాటి సాయిరోహిత్ ఐదు లక్షల చెక్కును శుక్రవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. చెక్కును అందించిన సాయిరోహిత్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

సహాయ చర్యలపై ప్రజల్లో సంతృప్తి

- మంత్రి నారాయణ



వన్‌టౌన్, సెప్టెంబరు 13 : ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో తుఫాను సహాయక చర్యల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. శుక్రవారం మంత్రిని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. సెంట్రల్ నియోజకవర్గం సింగ్‌నగర్‌లో వరదల అనంతరం జరిగిన సహాయ కార్యక్రమాలు, పునర్నిర్మాణాన్ని గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సింగ్‌నగర్ ప్రాంతంలో 1965 తరువాత ఇలాంటి వరద రాలేదని, దీనివల్ల తీరని నష్టం ఏర్పడిందన్నారు. అనంతరం సెంట్రల్ నియోజకవర్గం వరద ముంపు ప్రాంతాల్లో ప్రతిరోజు పర్యటించి తుఫాను సహాయక చర్యల్లో పాల్గొంటున్నందుకు మంత్రి నారాయణకు ఎమ్మెల్యే బొండా ఉమా కృతజ్ఞతలు తెలిపారు.

దీవుల రహదారులు పునరుద్ధరించండి



కోతకు గురైన ఎదురుమొండి - జింకపాలెం రహదారి

నాగాయలంక : కృష్ణానదికి వచ్చిన భారీ వరదలకు ధ్వంసమైన ఎదురుమొండి దీవుల రహదారులను పునరుద్ధరించాలని ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బ గ్రామస్థులు కోరుతున్నారు. వరదల ఉధృతికి రహదారులు దెబ్బతినటంతో ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారింది. ఎదురుమొండి - నాచుగుంట రహదారి ఏడు కిలో మీటర్లు ఉండగా, అందులో సుమారు రెండు కిలో మీటర్ల వరకు ధ్వంసమైందని తెలిపారు. ఎదురుమొండి నుంచి జింకపాలెం వెళ్లే రహదారి కూడా వరద ఉధృతికి భారీగా కోతకు గురైంది. కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులతో కలిసి భారీ కోతకు గురైన ఎదురుమొండి-జింకపాలెం రోడ్డును పరిశీలించారు. ఎదురుమొండి-నాచుగుంట, ఎదురుమొండి-జింకపాలెం రహదారుల తాత్కాలిక మరమ్మతుల కోసం అంచనాలు తక్షణమే తయారు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారులు సక్రమంగా లేకపోవటంతో వాహనదారులు, ప్రజలు సదరు రోడ్లపై రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి రహదారులను మరమ్మతులు చేయాలని దీవుల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబును వివరణ కోరగా, రహదారులు దెబ్బతిన్న చోట అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారని ఆయన వివరణ ఇచ్చారు.



ప్రహరీలో పాముల గుట్టలు!

గంపలగూడెం : గంపలగూడెం పటమటి దళితవాడలో కోట రజినికి చెందిన నివాస గృహ ప్రాంగణంలో 100కు పైగా పాములు కనిపించాయి. ఇంటి ప్రహరీకి కన్నం ఉండగా పాములు గుట్టలు గుట్టలు నివాసం ఏర్పరచుకున్నాయి. ఒక్కసారిగా అన్ని పాములు కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందారు. వాటిని సమాధి చేసే ప్రయత్నంలో మట్టి పోయగా.. అవి పక్కనే ఉన్న టేకు తోటలోకి జారుకున్నాయని స్థానికులు చెబుతున్నారు.

మొక్కజొన్న రైతు విలవిల!

- వేలాది ఎకరాల్లో కోట్లలో నష్టం
- నిలువునా ఎండిపోయిన తోటలు



భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట



పనికిరాని కండెలు

కంచికచర్ల, సెప్టెంబరు 13 : భారీ వర్షాలు, వరదలకు మెట్ట ప్రాంతంలో మొక్కజొన్న పంట అతలాకుతలమైంది. జిల్లాలో వేలాది ఎకరాల్లో తోటలు నాశనమయ్యాయి. ముదురు తోటల్లో కండెలు బూజు పట్టగా, లేత తోటలు కూడా దెబ్బతిన్నాయి. లక్షల్లో నష్టం వాటిల్లటంతో రైతులు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో మొక్కజొన్న ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగుచేశారు. దిగుబడి, మద్దతు ధర ఆశాజనకంగా ఉండటంతో ముఖ్యంగా పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్న వైపు మొగ్గుచూపటంతో పంట విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. కౌలు రూ. 15 వేలతో కలిపి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల వరకు పెట్టుబడి అయింది. దిగుబడులు బాగా వస్తాయని రైతులు భావించగా.. వరదల రూపంలో ఉపద్రవం ముంచెత్తింది. ఎడతెగని వర్షాలు, ఆపై వెల్లువలా విరుచుకుపడిన వరదలకు మొక్కజొన్న తోటలు బాగా దెబ్బతిన్నాయి. ముదురు తోటల్లో కండెలు పనికిరాకుండా పోయాయి. వర్షాలకు తేమ ఆరకపోవటంతో కండెల్లో గింజలు బూజు పట్టాయి. కొన్నిచోట్ల మొలకలు కూడా వచ్చాయి. తోటలు నిలువునా ఎండిపోయాయి. లేత తోటల్లో కనపడని నష్టం జరిగింది. కండెలు వచ్చినప్పటికీ ఇంకా గింజలు పోసుకోలేదు. తోటలు ఎర్రబడ్డాయి. గింజలు అవిసిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. దీనికితోడు వాగులు, వంకలతో పాటుగా వైరాయేరు, కట్లేరు, మునేరు, కృష్ణానది ఉప్పొంగటం వల్ల చుట్టు పక్కల కిలోమీటర్ల పొడవున పంటలు ముంపునకు గురయ్యాయి. రోజుల తరబడి నీటిలో ఉండటం వల్ల తోటలు నిలువునా మాడిపోయినట్టుగా నల్లగా మారాయి. గింజ కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని, పెట్టుబడి మొత్తం నష్టపోవాల్సి వచ్చిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల ప్రాథమిక సమాచారం ప్రకారం జిల్లాలో 3,550 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నది. ఎక్కువ విస్తీర్ణంలో పంట దెబ్బతిన్నదని రైతులు చెబుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

– మాగంటి బాలకృష్ణ, నక్కలంపేట



ఈ ఏడాది ఎంతో ఆశతో సాగు చేసిన మొక్కజొన్న, పెసర భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్నాయి. లక్షల్లో నష్టపోవాల్సి వచ్చింది. ఎన్యూమరేషన్ పూర్తిచేసి, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. పంటల బీమా సొమ్ము కూడా బాధిత రైతులకు అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

కరెన్సీ గణేశుడు!

- రూ.2.70 కోట్లతో అలంకారం

నందిగామ, సెప్టెంబరు 13: ఎన్టీఆర్ జిల్లా నందిగామ శ్రీవాసవీ మార్కెట్‌లో పూజలందుకుంటున్న గణనాథుడికి శ్రీలక్ష్మీ గణపతి అలంకారం చేశారు. శుక్రవారం స్వామివారికి 2.70 కోట్ల కరెన్సీతో ప్రత్యేక అలంకారం చేశారు. స్వామివారి మండపం మొత్తం కరెన్సీతో అలంకరించడంతో భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా రథం సెంటర్‌లో వెంకటేశ్వరస్వామి కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కరెన్సీ అలంకారంలో గణనాథుడు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ

లబ్బీపేట, సెప్టెంబరు 13: వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొని సేవలందించిన పారిశుధ్య కార్మికులకు తానా ఫౌండేషన్ చైర్మన్ వల్లేపల్లి శశికాంత్ సహకారంతో నూతన వస్త్రాలు అందజేశారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి నాగభూషణం, రమేష్, శ్రీధర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజానాయకుడు సీతారాం ఏచూరి

కృష్ణలంక, సెప్టెంబరు 13 : సీపీఎం తూర్పు కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ పలు డివిజన్లలో నివాళులు అర్పించారు. 21, 22, 17, 15, 9, 14, 7వ డివిజన్లలో పార్టీ శాఖలు నివాళులర్పించాయి. కృష్ణలంక 21వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి 50 ఏళ్లుగా కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రజల పక్షాన సమస్యలపై పోరాడిన గొప్ప నాయకుడన్నారు. 1974లో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి ఉద్యమంలో ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం నేడు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా అత్యుత్తమ స్థానంలో వున్నప్పుడు ముగిసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, చంద్రశేఖర్, శాంతి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

సీతారాం మరణం దేశానికి లోటు

పటమట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి, దేశానికి తీరని లోటని 14వ డివిజన్ సీపీఎం కార్యదర్శి రవీంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం 12, 13, 14 డివిజన్ల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో పటమట ఈ సేవా కేంద్రం వద్ద సీతారాం సంతాప సభ నిర్వహించి నాయకులు బెనర్జీ, యల్లారావు, ఏడుకొండలు నివాళి అర్పించారు.

సీతారాం ఏచూరికి కళాసంస్థల నివాళులు

విజయవాడ కల్చరల్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని పలు కళాసంస్థల ప్రతినిధులు తెలిపారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి, ఎక్స్‌రే సాహితీ సాంస్కృతిక సేవా సంస్థలు శుక్రవారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా కళాసంస్థల గదిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోళ్ల నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, డేవిడ్‌రాజు, బోడి అంజనేయరాజు, టీవీ వీరభద్రరావు మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుంచే ప్రజల పక్షాన సమస్యలపై స్పందిస్తూ నాయకునిగా ఆయన ప్రస్థానం ప్రారంభమైందని అన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్ వేదికగా గళం విప్పిన నాయకుడు ఏచూరి అని అన్నారు. ఉన్నత విద్యావంతుడైన ఆయన ప్రజల, దేశ సమస్యలపై కీలకమైన నిర్ణయాలు తీసుకొని అందించిన సేవలు గణనీయమైనవన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించిన సీతారాం ఏచూరి తెలుగువాడవ్వడం గర్వకారణం అని అన్నారు.

మత సామరస్యానికి ప్రతీక వినాయక చవితి

ఎమ్మెల్యే గద్దె

పటమట, సెప్టెంబరు 13 : వినాయక చవితి పండుగ మత సామరస్యానికి ప్రతీక అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. 14వ డివిజన్ దర్శిపేట శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 11వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గద్దె ముఖ్య అతిథిగా హాజరుకాగా, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదానాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించి మాట్లాడారు.

యూజీడీ పనుల పరిశీలన: 12వ డివిజన్ అశోకనగర్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను వీఎంసీ ఈఈ స్వామాజ్యంతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలు ఎదుర్కొంటున్న డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఈఈని కోరారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గద్దె రామ్మోహన్

వాంఛకల్ప గణపతిగా బాలగణపతి దర్శనం

వన్‌టౌన్, సెప్టెంబరు 13: స్థానిక పూలబావి వీధిలో ఉన్న బాలగణపతి స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు వాంఛకల్ప గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీలలిత సహస్ర పారాయణం, లక్ష కుంకుమార్చన, సువాసినీ పూజ, అనంతరం స్వామికి సహస్ర మోదక అర్చన నిర్వహించారు. సాయంత్రం సాయి సంకీర్తన భజన సమాజం వారిచే అక్కిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భగవన్నామ కీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గ్రంధి శ్రీనివాసరావు, సెక్రటరీ మామిడి కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ ఆతుకూరి రామనరసింహారావు, ట్రెజరర్ మండేపూడి వేణుగోపాల రావు, తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు హోంగార్డు సాయం



విజయవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : వరద బాధితుల సహాయం కోసం ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ హోంగార్డు ఎంవీఎస్ కుమారి రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో హోంమంత్రి అనితకు శుక్రవారం ఈ చెక్కును అందజేశారు. ఆమెను మంత్రి అనిత అభినందించారు.

వరద బాధితులకు దాతల చేయూత



బాధితులకు నిత్యావసర వస్తువులను అందిస్తున్న హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సభ్యులు

కృష్ణలంక, సెప్టెంబరు 13 : వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ద్వారా కృష్ణలంక, కండ్రిక ప్రాంతాల్లోని వరద బాధితులకు ఆయా సంస్థల ప్రతినిధులు సహాయ కార్యక్రమాలను శుక్రవారం అందించారు. కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాల (నెహ్రూనగర్)లో చదువుతున్న 320 మంది బాధిత కుటుంబాల పిల్లలకు, కండ్రికలోని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ నగర్ పాఠశాలలో చదువుతున్న 200 మంది పిల్లలకు నిత్యావసర సరుకులు, పరిశుభ్రత కిట్లను అందచేశారు. ఈ పంపిణీలో హెచ్‌సీఎల్ ఫౌండేషన్, వాసవ్య మహిళా మండలి సభ్యులు, పాఠశాలల హెచ్‌ఎంలు బి.రమేష్, సోషల్ వర్కర్ బి.వెంకటేశ్వరరావు, స్కూల్ చైర్మన్ వి.నాగలక్ష్మి, సొచార, హీల్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్వా డెవిల్స్ సంక్షేమ సంఘం సాయం



బాధితులకు దుప్పట్లు, లుంగీ, తదితరాలను అందిస్తున్న ఆక్వా డెవిల్స్ ప్రతినిధులు

వన్‌టౌన్: వరద బాధితులకు ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం 250 కుటుంబాలకు రెండు దుపట్లు, లుంగీ, టవల్, నైటీ, తదితరాల దుస్తుల కిట్లను పంపిణీ చేశారు. బీఆర్టీఎస్ రోడ్డులో వర్కర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు లింగిపిల్లి రామకృష్ణ, మాజీ కార్యదర్శి యార్లగడ్డ రమేష్ కుమార్, సభ్యుడు కర్రి సాంబయ్య, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల దాతృత్వం అభినందనీయం
ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు



నిత్యావసరాల కిట్‌లను అందిస్తున్న పరుచూరి అశోక్

పటమట: వరద బాధితులను ఆదుకోవటంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్న తీరు అభినందనీయమని ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు అన్నారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు చొరవతో రాయలసీమ సీఎస్ఐ, రాయలసీమ డయాసిస్ తరఫున బిషప్ ఐజక్ వరప్రసాద్ సహకారంతో సమకూర్చిన 1700 మందికి నిత్యావసరాల కిట్‌లను శుక్రవారం సింగ్‌నగర్ ఎంకే బేగ్ స్కూల్ వద్ద బాధితులకు అశోక్‌బాబు అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సి జాకోబ్ ప్రశాంత్, పి. సుశాంత్, అన్నిస్ మోజెస్, సీబీజె రస్సెల్ కిరణ్, యూత్ మెంబర్లు అజిత్, సుధీర్, చింటూపాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు వరద సాయం

ధర్నాచౌక్: బుడమేరు వరదలతో నష్టపోయిన ఫొటోగ్రాఫర్ల కుటుంబాలకు 'ఆంధ్రప్రదేశ్ ఫొటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 'ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వాటిని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. అసోసియేషన్ చైర్మన్ ఆర్‌వీ.అప్పారావు, రాష్ట్ర అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్, కార్యదర్శి మరీదు హరి మాట్లాడుతూ వివిధ జిల్లాల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్స్ సభ్యులు, బీఎస్ఎస్ మైక్రో ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో ఈ సాయాన్ని అందజేశామన్నారు. కాకినాడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్ని, అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న వర్ల రామయ్య

పేద కుటుంబాలను ఆదుకోవాలి

భవానీపురం: వరదల వలన తీవ్రంగా నష్టపోయిన పేద వర్గాల ప్రజలను స్వచ్ఛంద సంస్థలు ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అమృతహస్తం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దారా కరుణ శ్రీ కోరారు. 44వ డివిజన్‌లో వరద ముంపునకు గురైన 300 మంది పేదలకు శుక్రవారం స్టీల్ గ్లాస్, కంచం, దుప్పటి, టవల్, వాటర్ బాటిల్, బన్నులతో కూడిన కిట్‌లను అందజేశారు. అమృతహస్తం చారిటబుల్ ట్రస్ట్, శ్రీజ హెల్పింగ్ హ్యాండ్స్ హైదరాబాద్, పూర్ణ ఎం ఈవెంట్స్ ఆధ్వర్యంలో బాధితులకు కిట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గుడివాడ కృష్ణ కిషోర్, ఏఎస్ఐ టి నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, పూర్ణా ఈవెంట్స్ వలంటీర్లు పాల్గొన్నారు.



పేదలకు కిట్లు పంపిణీ చేస్తున్న దారా కరుణశ్రీ

ఇష్టంతో గణితం నేర్చుకోవాలి

● కేబీఎన్ కళాశాల మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ కల్మాబేగం



లబ్బీపేట, సెప్టెంబరు 13: గణితాన్ని భయంతో నేర్చుకోకుండా ఇష్టంతో నేర్చుకోవాలని కేబీఎన్ కళాశాల మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ పి.కల్మాబేగం అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం మ్యాథ్స్ అండ్ స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గణితం అన్ని శాస్త్రాలకు రాణి అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్మాబేగం మాట్లాడుతూ గణితాన్ని గణిత ఉపకరణాల ద్వారా విద్యార్థులు సులభంగా నేర్చుకోవచ్చని, మ్యాజిక్ స్క్వేర్ డాన్స్, సీస పద్యంలో కూడా గణితం అనేది పొదిగి ఉంది అని తెలిపారు. గణితంను సులభమైన పద్ధతిలో ఎలా నేర్చుకోవాలో విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ గణితం ద్వారా విమర్శనాత్మక ఆలోచన, తార్కిక ఆలోచన మెరుగుపడుతుందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ వి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

హరేకృష్ణ ఫౌండేషన్‌కు చానల్ కంపెనీ భూరి విరాళం



వన్‌టౌన్, సెప్టెంబరు 13: విజయవాడ, గుంటూరు వరద బాధితులకు హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న విశేషమైన సేవలను గుర్తించి చానల్ స్లాప్ కంపెనీ శుక్రవారం విరాళం అందించింది. హరేకృష్ణ ఫౌండేషన్ రీజనల్ ప్రెసిడెంట్ వంశీధర దాసకు కంపెనీ ఎండీ దోనేపూడి కిరణ్ రూ.12లక్షల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ వరద బాధితులకు హరేకృష్ణ ఫౌండేషన్ అండగా నిలబడటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోగవల్లి శ్రీధర్

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

● జిల్లా కన్వీనర్ బోగవల్లి శ్రీధర్

వన్‌టౌన్, సెప్టెంబరు 13: బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ బోగవల్లి శ్రీధర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరులో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా ప్రారంభించామన్నారు. ఇటీవల సంభవించిన వరదల దృష్ట్యా బీజేపీ నేతలు అంతా సహాయక చర్యల్లో ఉండటం వలన సభ్యత్వ నమోదు కొంతమేర నెమ్మదించిందన్నారు. గతంలో పశ్చిమలో 25వేల సభ్యత్వాలు నమోదు చేశామని, రానున్న రోజుల్లో ఆ సంఖ్యను 75వేల పైచిలుకు సభ్యత్వాల లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బీఎస్‌కే పట్నాయక్ మాట్లాడుతూ ఈసారి పార్టీ సభ్యత్వ నమోదు అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గన్నవరపు శ్రీనివాస్, కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి, కార్యదర్శి నున్న కృష్ణ, సెక్రటరీ వేరుకొండ ఉమాకాంత్, చేనేత కన్వీనర్ సత్యసాయి ప్రసాద్, పైలా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భారతీనగర్, సెప్టెంబరు 13 : విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని శనివారం ఉదయం 7 గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామచంద్రనగర్ కాలనీ, కరెన్సీనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

13వ రోజూ బాధితుల సహాయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



కృష్ణలంక, సెప్టెంబరు 13 : జిల్లాకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 13వ రోజు కూడా వారి సేవలను జక్కంపూడి కాలనీ, వైఎస్సార్ కాలనీలో మెడికల్ క్యాంపులో, పారిశుద్య కార్యక్రమంలో పాలుపంచుకున్నారని జిల్లా ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద బాధితుల సహాయంలో 13 రోజులు నిద్రాహారాలు మాని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలందించారన్నారు. నగరంలో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నలంద, లయోలా, కళాశాల, మారిస్ స్టెల్లా డిగ్రీ కళాశాలలు, కేబీఎన్ కళాశాల, విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్, లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు, సహకరించిన ప్రిన్సిపాల్‌కు జిల్లా కలెక్టర్ తరఫున, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చిన్నారుల ఎదుగుదలకు అవ్వా తాతలతో అనుబంధం అవసరం

గుణదల, సెప్టెంబరు 13: అవ్వా..తాతల అనుబంధం అనేది నేటి తరం చిన్నారుల ఎదుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్ జనరల్ మేనేజర్ శివారెడ్డి తెలిపారు. రామవరప్పాడు కరెన్సీనగర్లోని నెల్లూరు రవీంద్రభారతి స్కూల్లో గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుక శుక్రవారం నిర్వహించారు. ముందుగా చిన్నారులు అమ్మమ్మ...తాతయ్యల పాదాలకు నమస్కరించారు. వారికి పాదపూజ చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం శివారెడ్డి మాట్లాడుతూ పిల్లలు అవ్వాతాతల కనుసన్నల్లో పెరిగితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం కేశవరాజు, డీన్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



అవ్వా తాతలకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు

నిత్యావసర సరుకుల పంపిణీ



భారతీనగర్, సెప్టెంబరు 13: 4వ డివిజన్‌లో వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న వారికి అక్షయ పాత్ర, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను రమేష్ ఆసుపత్రి జంక్షన్ సమీపంలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద జాస్తి సాంబశివరావు శానిటరీ వర్కర్స్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో నర్సింగ్ కోర్సులు



విజయవాడలోని డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్టీఆర్ యూహెచ్ఎస్)- బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ కోటా కింద ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మైనారిటీ, నాన్ మైనారిటీ నర్సింగ్ కాలేజీల్లో 60 శాతం సీట్లు అలాట్ చేస్తారు. ప్రతి ప్రోగ్రామ్‌లో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు స్థానికులు సహా స్థానికేతర అభ్యర్థులందరూ పోటీ పడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ నాటికి సీట్ల వివరాలు ప్రకటిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. దీనిలో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు బయలాజికల్ అండ్ ఫిజికల్ సైన్సెస్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ /హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ అభ్యర్థు లు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఏపీఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జనరల్ కేటగిరీలో(దివ్యాంగులు సహా) 40382లోపు; ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో 48459లోపు ర్యాంక్ సాధించిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు పూర్తిచేసి స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాదిన్నర వ్యవధి గల ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024డిసెంబరు 31 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. అకడమిక్ మెరిట్, జీఎన్ఎం మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2360; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1888
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** https://dmtr.uhsap.in

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)కి చెందిన మధురై రీజనల్ సెంటర్- డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ ఐ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌నకు న్యూఢిల్లీలోని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు. దివ్యాంగులకు, దివ్యాంగుల తల్లిదండ్రులకు ఇన్‌స్టిట్యూషనల్ ఫీజు ఉండదు. దివ్యాంగుల తోబుట్టువులకు 75 శాతం ఫీజు రాయితీ లభిస్తుంది. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్(ఏఐసీటీఎస్‌డీ)- 'రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్(ఆర్ఎన్ఎంసీ) 2025'కు దరఖాస్తులు కోరుతోంది. మేథ్స్‌లో నేటి తరం విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకుగాను 'నేషనల్ మేథ్స్ స్కాలర్-2025' కాన్సెప్ట్‌తో ఈ పోటీని నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు మేథమెటిక్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా నాలుగోతరగతి నుంచి పన్నెండోతరగతి చదివే విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ఆసక్తి ఉన్నవారు జాతీయ స్థాయిలో తమ స్కిల్స్ ప్రదర్శించేందుకు ఇది సదవకాశం.

ఆన్‌లైన్ ఎగ్జామ్ వివరాలు: అభ్యర్థులు ఇంటి వద్దనే ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 60. రుణాత్మక మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎగ్జామ్ తేదీ, టైం స్లాట్, ఆన్‌లైన్ ఎగ్జామ్ లింక్ తదితరాలను విద్యార్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు.

- నాలుగు నుంచి పన్నెండు వరకు ప్రతి తరగతికీ నిర్దేశించిన ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

రివార్డులు: పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీరిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటిస్తారు. మొదటి బహుమతి కింద రూ.75,000; ద్వితీయ బహుమతి కింద రూ.50,000; తృతీయ బహుమతి కింద రూ.25,000; రన్నరప్‌లుగా నిలిచిన 50 మందికి ఒక్కొక్కరికి రూ.2000; అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 100 మందికి ఒక్కొక్కరికి రూ.500ల నగదు ఇస్తారు. విజేతలందరికీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఏఐసీటీ ఎస్‌డీ సర్టిఫికెట్, నేషనల్ మేథ్ స్కాలర్ ట్రోఫీ అందిస్తారు. సంస్థ అంతర్జాతీయంగా నిర్వహించే వివిధ ప్రాజెక్టులు, టెక్నికల్ ఈవెంట్లు సహా పలు సెమినార్లలో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. నేషనల్ మేథమెటిక్స్ సైంటిస్ట్ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. రోబోటిక్స్ ఆటోమేషన్ అండ్ కోడింగ్‌లో ట్రెయినింగ్ ఇస్తారు. ప్రథమ బహుమతి విజేతకు ఏడాది, ద్వితీయ బహుమతి పొందినవారికి ఆరు నెలలు, తృతీయ బహుమతి సాధించినవారికి మూడు నెలలు శిక్షణ ఇస్తారు. పోటీలో పాల్గొన్నవారందరికీ సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.270
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 10
- **ఫలితాలు విడుదల:** డిసెంబరు 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 30
- **విజేతల లిస్ట్ విడుదల:** 2025 జనవరి 15
- **వెబ్‌సైట్:** aictsd.com

నవ్య | చిత్రజ్యోతి

సందడంతా సెట్స్‌పైనే

ఈ నెలలో ఎన్టీఆర్ 'దేవర' మినహా పెద్ద హీరోల చిత్రాలేవి విడుదల లేకపోవడంతో థియేటర్లలో సందడి తగ్గనుంది. అయితే ఆ సందడి కాస్తా ఇప్పుడు సెట్స్‌లో మొదలైంది. హీరోలంతా కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. యువ కథానాయికలు సెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. సీనియర్ హీరోలు షూటింగ్స్‌కు సై అంటున్నారు. వీరిలో కొందరు హీరోయిన్లతో డ్యూయెట్లు పాడుతుండగా మరికొందరు విలన్లతో పోరాడుతున్నారు. మొత్తం మీద వరుస చిత్రీకరణలతో తెలుగు కథానాయకులు జోరు మీదున్నారు.

యాక్షన్ మోడ్‌లో వెంకీ

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. పది రోజుల క్రితమే పొల్లాచ్చిలో హీరోయిన్ మీనాక్షి చౌదరితో డ్యూయెట్ పాడుకున్నారు వెంకటేశ్. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారో లేదో వెంటనే యాక్షన్ సీక్వెన్స్ కోసం రంగంలోకి దిగారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ 15 రోజుల షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించనున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.






కూలీ సెట్స్‌లో నాగ్

మల్టీస్టారర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందుతున్న 'కూలీ' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. నాగార్జున్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనపై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రుతీహాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.



క్లైమాక్స్‌కు మట్కా

కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'మట్కా' చిత్రం షూటింగ్ క్లైమాక్స్‌కు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో పతాక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మాఫియా నాయకుడి పాత్రలో వరుణ్‌తేజ్ సరికొత్త మేకోవర్‌తో అలరించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.



రాజాసాబ్ పోరాటం

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ సాగుతోంది. ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటోంది. కొంత టాకీ పార్ట్‌ను పూర్తి చేసిన మారుతి తాజాగా పోరాట ఘట్టాలపై దృష్టి పెట్టారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో సాగే ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిశాక హనూ రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రభాస్ చెన్నై వెళ్లనున్నారు.

కేరళకు దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఈ వారంలో కేరళలో ఓ భారీ షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు యూనిట్ సన్నాహాలు చేసింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. అలాగే 'పుష్ప 2' క్లైమాక్స్ షూట్‌ను ముగించే పనిలో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు.

చందు మొండేటి, నాగచైతన్య కలయికలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని యూనిట్ తెలిపింది. టాకీపార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరిస్తున్నారు. చైతూకు జోడీగా సాయిపల్లవి కనిపించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' షూటింగ్ కొనసాగుతోంది. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. లుధీర్ బైరెడ్డి రూపొందిస్తున్న చిత్రం షూటింగ్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాల్గొంటున్నారు. శుక్రవారం నాని 'హిట్ 3' చిత్రీకరణ మొదలుపెట్టారు. సాయిదుర్గ తేజ్ హీరోగా రోహిత్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవలే రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ పార్ట్‌ను యూనిట్ పూర్తి చేసింది.

విరామం తర్వాత

పవన్ కల్యాణ్ పాలిటిక్స్‌తో బిజీగా మారడంతో షూటింగ్స్‌కు తాత్కాలిక విరామం ఇచ్చారు. 'హరి హర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్, ఓజీ' చిత్రాలను ఆయన పూర్తి చేయాల్సి ఉంది. అలాగే మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. 'గేమ్ ఛేంజర్' చిత్రం షూటింగ్‌ను ఇటీవలే పూర్తి చేసిన రామ్‌చరణ్ త్వరలోనే కొత్త సినిమా షూటింగ్‌లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. పీరియాడిక్ చిత్రం కావడంతో ప్రస్తుతం ఆయన సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. 'దేవర' ప్రచార కార్యక్రమాలను పూర్తి చేసిన ఎన్టీఆర్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రం కోసం రంగంలోకి దిగనున్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు యూనిట్ తెలిపింది. ఎన్టీఆర్ డిసెంబర్‌లో సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

హేమ డ్రగ్స్ తీసుకున్నారు

- మెడికల్ రిపోర్టులో రుజువైంది
- రేవ్‌పార్టీ కేసులో కోర్టుకు వెల్లడించిన పోలీసులు



బెంగళూరు నగరంలోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ.. అలియాస్ కృష్ణవేణి డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. విజయవాడకు చెందిన ఎల్ వాసు ఈ ఏడాది మే 19న జీఆర్ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో పాల్గొన్న హేమ.. ఎండీఎంఏ సేవించారని, ఆమె మెడికల్ రిపోర్టులు, సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు దాన్ని రుజువు చేస్తున్నాయని పోలీసులు చార్జిషీట్‌లో వెల్లడించారు. ఈ రేవ్ పార్టీకి డ్రగ్స్ సమకూర్చిన వారిలో డెంటిస్ట్ రణధీర్ బాబు కీలకంగా వ్యవహరించారని, అబూబకర్ సిద్ధిఖీ పార్టీకి వచ్చిన వారికి కొకైన్, ఎండీఎంఏ సరఫరా చేశారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో సీసీబీ పోలీసులు బెంగళూరు గ్రామీణ పరిధిలోని 8వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో సోమవారం 1,086 పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణతోపాటు 82 మంది సాక్షులను విచారించినట్లు అందులో పొందుపరిచారు. అర్ధరాత్రి జరిగిన పార్టీలో ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ఫ్యాషన్ డిజైనర్లు, కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. 27 మంది మహిళల సహా 79 మంది డ్రగ్స్ సేవించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆ వివరాలను పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. డ్రగ్స్ తీసుకున్న 79 మందితోపాటు రేవ్‌పార్టీ నిర్వాహకులు 9 మంది కలిపి మొత్తం 88 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాగా, హేమ మాత్రం తాను డ్రగ్స్ తీసుకోలేదని, పోలీసులు తన బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించలేదని మొదటి నుంచీ చెబుతున్నారు. మీడియా కూడా తనను అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతోందని ఆరోపించారు. తాను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనంటూ పలు ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

ఈసారి మహారాణి?

విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయంతో అటు పరిశ్రమ, ఇటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు దర్శకుడు నితిలన్ స్వామినాథన్. ఆయన దర్శకత్వం వహించబోయే కొత్త చిత్రంలో నయనతార లీడ్‌రోల్ పోషిస్తున్నట్లు, ఆ చిత్రానికి 'మహారాణి' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మహిళా ప్రాధాన్య కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నయనతార పాత్ర కొత్తతరహాలో ఉండబోతోందని కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 'మహారాజా' చిత్రాన్ని నిర్మించిన ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



వేట మొదలైంది



హీరో నాని 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్' రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం మొదలైంది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ ఫెరోషియస్ కేరెక్టర్ కోసం నాని పూర్తిగా మేకోవర్ అయ్యారు. తొలి రోజు షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో మే ఒకటిన ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు. ఈ సినిమాకు ఛాయాగ్రహణం: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ. జే మేయర్, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్: నాగేంద్ర తంగాల. లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధపు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.వెంకటరత్నం.

బావ.. బావమరిది



తమిళ హీరోలు కార్తీ, అరవింద్ స్వామి నటించిన చిత్రం 'సత్యం.. సుందరం'. ఇంతకుముందు '96' చిత్రాన్ని రూపొందించి ప్రశంసలు అందుకొన్న సి.ప్రేమ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. సూర్య, కార్తీ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 28న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. 'బావా.. బావా' అంటూ అరవింద్‌స్వామి వెంటపడుతూ ఆట పట్టించే టిపికల్ పాత్రను కార్తీ పోషించారు. వీరిద్దరూ పాల్గొన్న సన్నివేశాలతో రూపొందించిన టీజర్ అలరించింది. ఈ పాత్రలను దర్శకుడు అద్భుతంగా ప్రజెంట్ చేశారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషించారు మహేంద్రన్ జయరాజ్ ఛాయాగ్రహణాన్ని, గోవింద్ వసంత సంగీతాన్ని అందించారు.



చంద్రబోస్‌కు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం

పిల్లలను వారి అభిరుచులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప వ్యక్తి పొన్నం సత్తయ్య అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాలను ప్రదానం చేశారు. సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్, బలగం ఫేమ్ కొమురమ్మ, మొగులయ్యలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు 51వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి కథ మరోసారి

తెల్లదొరలకు ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కథను హీరో కృష్ణ అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన సంగతి విదితమే. ఈ వీరుని కథ మరోసారి తీయడానికి ఆర్.వి.వి. సత్యనారాయణ పూనుకున్నారు. అల్లూరి జీవిత చరిత్రలో యథార్థ సంఘటనల్ని ప్రజలకు అందించాలనే సంకల్పంతో 'మన్యం ధీరుడు' పేరుతో రూపొందించిన ఈ సినిమాలో అల్లూరి పాత్రను సత్యనారాయణ పోషించారు. నరేశ్ డెక్కల దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. అరకు, పాడేరు, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్‌లో షూటింగ్ చేశారు. భారీ ఖర్చుతో ఒక ఊరినే నిర్మించి అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరించామనీ, బానిస సంకెళ్లు తెంచుకుని బ్రిటీష్ తెల్లదొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయనీ నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 20న సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



టాకీస్..

మనసున్న తల్లి కథ



ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కథతో 'తల్లి మనసు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో ఆయన తనయుడు కిశోర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు వి. శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడు. 'హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన షూటింగ్‌లో రెండు పాటలతో సహా 80 శాతం చిత్రం పూర్తయింది. ఇంకో పాట, మిగిలిన టాకీ పార్ట్ చిత్రీకరించడంతో ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మా నాన్న చిత్రాల స్థాయికి తగ్గట్టుగా చక్కటి కథ, కథనాలతో సినిమా తీస్తున్నాం. ఇటువంటి కథాబలం ఉన్న మంచి చిత్రాన్ని తీస్తున్నందుకు సోషల్ మీడియా ద్వారా మంచి స్పందన లభిస్తోంది. అభినందనలు అందుతున్నాయి' అని నిర్మాత తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్ర నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు ముత్యాల సుబ్బయ్య తెలిపారు.

వరద బాధితులకు విరాళం

'జెట్టి' సినిమాతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు, '100 డ్రీమ్స్' పేరుతో ఎనిమిదేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ మానినేని వరద బాధితుల సహాయం కోసం రూ. పది లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి అందజేశారు కృష్ణ. '100 డ్రీమ్స్' ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను విని, మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ కోరారు



ధైర్యంగా ముందుకు రండి

నటి రోహిణి



కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా నడిగర్ సంఘం ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన విశాఖ కమిటీ ముందు బాధితులు బారులు తీరుతున్నట్లు ఆ కమిటీ అధ్యక్షురాలు, సినీ నటి రోహిణి తెలిపారు. ఈ విషయంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా అవకాశాల పేరుతో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న అనేకమంది యువతులు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని, వాటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నామని, ఆ విచారణ తర్వాత తదుపరి చర్యలపై ఆలోచన చేసి, ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసిన వారి వివరాలను బహిర్గతం చేయమని, చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నవారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని రోహిణి సూచించారు. ఇదిలా ఉండగా, హీరోయిన్ల గురించి యూట్యూబ్ చానెల్‌లో ఇష్టానుసారంగా, అసభ్యకరంగా మాట్లాడిన డాక్టర్ కాంతరాజ్ అనే వైద్యుడిపై నటి రోహిణి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కొన్ని సార్లు మనకు ఇష్టం లేకపోయినా ఇతరులను క్షమించాల్సి వస్తుంది. దీన్ని టాక్సిక్ ఫర్‌గివ్‌నెస్ అంటారు మానసిక నిపుణులు. ఇలాంటి సమయాల్లో మనం బయటకు ఆనందాన్ని వెలిబుచ్చినా.. మనసులో మాత్రం అసంతృప్తి మిగిలిపోతుంది. దీనివల్ల సమస్యలు పరిష్కారం కావని.. మరింత జటిలమవుతాయని అంటున్నారు మానసిక నిపుణులు.

క్షమించడమూ సరికాదు



ఎలా కనుక్కోవాలి: సరైన ఆలోచన లేకుండా క్షమించేయటం.. కొన్ని సంఘటనలు మనసును కలచివేస్తాయి. ఇబ్బంది పెడతాయి. అలాంటి సంఘటనలకు కారణమయిన వారిని ఆలోచన లేకుండా క్షమించేస్తే పరిస్థితులు మెరుగుపడవు. మనసులో అసంతృప్తి మిగిలిపోతుంది.

తీవ్రతను తగ్గించటం: ఇతరుల తప్పుల తీవ్రతను తగ్గించి.. వారు ఆ తప్పులు చేయటానికి వెనకున్న కారణాలను వెదికి వారిని క్షమించేస్తారు. దీని వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

బయటకు చెప్పకపోవటం: కోపం, ఆందోళన, ద్వేషం- వీటిని బయటకు ప్రదర్శించకుండా మనసులో దాచుకోవటం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు.

తప్పు మనదేనని భావించటం: ఇతరుల ప్రవర్తనకు తమదే కారణమని.. తప్పు మనదేనని భావించి.. ఇతరులను క్షమించేయటం వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుంది తప్ప తగ్గదు.

తప్పనిసరి సంబంధాలు: మనను ఇబ్బంది పెడుతున్నవారితో తప్పనిసరి పరిస్థితుల్లో సంబంధాలు కొనసాగించాల్సి వస్తే- దానిని టాక్సిక్ ఫర్‌గివ్‌నెస్ అనవచ్చు.

సంఘర్షణకు దూరంగా: సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించకుండా.. సంఘర్షణలకు దూరంగా ఉండటం సరైన పద్ధతి కాదు.

పరిష్కారమేమిటి?: టాక్సిక్ ఫర్‌గివ్‌నెస్ వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయనే విషయాన్ని గమనించినప్పుడు- వీలైనంత త్వరగా స్పందిస్తే మంచిది. ఈ స్పందన సరైన రీతిలో ఉండాలంటే కొన్ని ఎక్సర్‌సైజ్‌లను మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

డైరీలో రాయండి: ఒక డైరీ తీసుకొని దానిలో మనోభావాలన్నింటినీ విపులంగా రాయాలి. దీని వల్ల మనసు తేలికబడుతుంది.

పరిధులు నిర్ణయించుకోండి: సమస్యకు పరిధులు ఏమిటి? వాటిని ఎలా అధిగమించాలి? దానికి ఎలాంటి ప్రణాళిక అవసరం అనే విషయాలను నిర్ణయించుకోవాలి. అప్పుడు సమస్యపై స్పష్టత లభిస్తుంది.

వేచి చూడండి: కొన్ని సమస్యలకు కాలమే పరిష్కారం చూపిస్తుంది. అందువల్ల సమస్య ఏర్పడిన వెంటనే స్పందించకుండా కొద్ది కాలం వేచి చూడటం వల్ల ప్రయోజనం ఉంటుంది.

కాలపరిమితులు: ఇతరులను క్షమించటానికి కూడా కొన్ని కాలపరిమితులు నిర్ణయించుకోండి.

పుష్టిని ఇచ్చే 'పులగం'

కట్టు పొంగలి చాలా మందికి ఇష్టమైన వంటకం. దీన్నే మన వాళ్లు పులగం అని కూడా పిలుస్తారు. ఈ పులగం వెనక చాలా కథే ఉంది.

కట్టు పొంగలి అంటే కారపు పాయసం అని అర్థం. వాస్తవానికి 'పుల' అనే తెలుగు పదానికి బంగారం అని అర్థం. బంగారపు రంగులో ఉంటుంది కాబట్టి ఈ పొంగల్‌ను పులగం అని కూడా పిలుస్తారు. ఇక పులగాన్ని సంస్కృతంలో కృశరా అంటారు. దీని అర్థం కూడా బంగారపు రంగులో ఉండేదనే! శుభకార్యాలు.. దైవ కార్యాలలో దీనిని వండి నైవేద్యంగా పెట్టి ప్రసాదం పంచుతారు. 'అనంగత్రయోదశి వ్రతం' లాంటి సందర్భాల్లో పులగాన్నే నైవేద్యంగా పెడతారు. నందికేశుడి నోములోనూ, నవరాత్రుల్లోనూ పులగం తప్పనిసరిగా ఉంటుంది. మనుస్మృతి... బియ్యం, నువ్వులు, పెసరపప్పు కలిపి పాలు పోసి పులగం వండుతారని



పేర్కొంది. ఇక పులగం తయారీలో కూడా పరిణామ క్రమం ఉంది. దక్షిణాదిలో అల్లం, ఇంగువ, మిరియాలు జీలకర్ర, కరివేపాకు, జీడిపప్పు తాలింపు పెట్టే ఆచారం మొదలైతే.. ఉత్తరాదిలో రకరకాల కూరగాయల ముక్కలు ఉడికించి కలిపి కృశరాన్నాన్ని కిచిడీగా మార్చు చేసుకున్నారు. కృశరా లేదా పులగం గురించి యోగరత్నాకరం, భోజన కుతూహలం, క్షేమకుతూహలం లాంటి పాకశాస్త్ర గ్రంథాలు పులగాన్ని ఎలా చేసుకోవాలో వివరంగా ఇచ్చాయి. క్షేమశర్మ క్షేమకుతూహలంలో పులగం తయారీ గురించి ఇలా పేర్కొన్నాడు.

"తండులైః షష్టి సంఖ్యాతైః కండితైర్నచ ఖండితైః.. అష్టభాగవృతైర్ముద్గై సంయుక్తై ద్వార్ద శాంశకైః"

12 భాగాల బియ్యానికి 8 భాగాల పెసరపప్పు తీసుకోవాలి. బియ్యాన్ని నీళ్లలో కాసేపు నాననిచ్చి .. బాగా కడిగి ఇత్తడి గిన్నెలో గానీ కుండలోగానీ తీసుకుని తగినన్ని నీళ్ల పోసి పొయ్యి మీద పెట్టి అత్తెసరు అన్నం వండాలి.

"స్వార్ద్రానార్ద్రా నుసంధానా సబాహ్లీకా వరాన్వితా! సస్నేహా కామినీవేయం కృశరా శిశిరే హితా!

పెసరపప్పు, బియ్యం కలిపిన అన్నం ఉడుకుతుండగా, బాగా కండపట్టిన పచ్చి అల్లాన్ని చిన్ని ముక్కలుగా తరిగి కలపాలి. పసుపు, ఇంగువ, సైంధవలవణం, నెయ్యివేసి సన్నసెగన ఉడకనివ్వాలి. పొయ్యి మీంచి దింపబోయే ముందు, విరియం, జీలకర్రల్ని పైపైన దంచి, కరివేపాకు చేర్చి వేగనిచ్చి నేతితాలింపు పెడితే కమ్మగా ఉంటుంది. ఇలా చేస్తే చలికాలంలో ప్రియురాలులా సుఖాన్ని స్తుందీ పులగం.

"కృశరా దుర్జరా బల్యా గుర్వీ వాతవినాశినీ! బలపుష్టిమలశ్లేష్మపిత్తవిష్టంభకృత్సరా!"

వండిన పెసరముద్దపప్పుని అన్నంలో కలుపుకోవటానికి.. బియ్యమూ పెసరపప్పు కలిపి వండినదానికి తేడా ఏమిటనే ప్రశ్న తప్పక వస్తుంది. పప్పు అన్నంలో పెసరపప్పు గుణాలు మాత్రమే ఉన్నాయి. దాన్ని పులగంగా వండితే అది బంగారం లాంటి ఆహారపదార్థం అవుతుంది. ఇది ఆకలిని తీరుస్తుంది. ఉదయమే తింటే మధ్యాహ్నం దాకా దండిగా ఉంటుంది. ఇది బరువైన ఆహారం. మంచి నెయ్యితో వండుకుంటే తేలికగా అరుగుతుంది. మిరియాలు జీలకర్ర, సైంధవలవణం తేలికగా అరిగించేందుకు సాయపడతాయి. భయంకర వాత వ్యాధులున్నవారికి ఇది మంచి ఔషధంగా ఉపయోగపడ్తుంది. చర్మం గరుకుబారి ముడతలు పడి ముసలితనం ముంచుకొచ్చినట్టు కావటాన్ని ఇది అరికడుతుంది. కూరగాయల్లేని వంటకం కాబట్టి ఇందులో ఫైబర్ తక్కువ కాబట్టి విరేచనం కావటానికి ఇది సహకరించకపోయినప్పటికీ, పేగుల్ని మృదువు పరుస్తుంది. జీర్ణశక్తికి కావలసిన స్రావాలు పేగుల్లోకి విడుదల అయ్యేలా చేస్తుంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



కొన్ని ప్రాంతాల్లో కొన్ని వంటలు ప్రసిద్ధి. ఆ తర్వాతి కాలంలో అవి ప్రపంచమంతా విస్తరించినా... అసలు పేర్లు మాత్రం చెరిగిపోవు. అలాంటి కొన్ని వంటలే ఇవి.



ఎక్కడైనా అదే రుచి

బీబీ దా పులావ్

ఒకప్పుడు అవిభాజ్య భారత దేశంలోని పంజాబ్, సింధ్ ప్రాంతాల్లో దీనిని అతిథుల కోసం ఎక్కువగా చేసేవారు. దీనిలో వాడే పదార్థాలు అన్నీ మనకు ఆరోగ్యాన్ని ఇచ్చేవే! దీనిని ఇప్పటికీ చలికాలంలో ఎక్కువగా వండుతూ ఉంటారు.



కావాల్సిన పదార్థాలు:

చికెన్ ముక్కలు- ఒక కేజీ, బాసుమతి బియ్యం- 500 గ్రాములు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- 300 గ్రాములు, నెయ్యి- ఒక కప్పు, ఏలకులు-5, దాల్చిన చెక్క- ఒక అంగుళం, లవంగాలు-5, బిర్యానీ ఆకులు-5, ఎర్రకారం- రెండు చెంచాలు, పచ్చకారం- రెండు చెంచాలు, పెరుగు- పావు కేజీ, పచ్చిమిర్చి- 10, అల్లం వెల్లుల్లి పేస్ట్- 4 చెంచాలు, క్రీమ్- మూడు చెంచాలు, రోజ్ వాటర్- ఒక చెంచా, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం:

- బాసుమతి బియ్యాన్ని అరగంట నాననివ్వాలి.
- ఈ లోపులో ఒక మూకుడు పెట్టి కొద్దిగా నెయ్యి వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను దోరగా వేయించుకోవాలి. తరువాత ఒక ప్లేటులో వేసి, చల్లారనివ్వాలి. ఇందులో సగం ముక్కలను పులావ్‌లో కలపటానికి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన వాటిని మిక్సీలో వేసుకొని పేస్టులా చేసుకోవాలి.
- ఉల్లిపాయలను వేయించిన మూకుడులో ఇంకొంత నెయ్యి వేసి ఉల్లిపాయల పేస్ట్, అల్లం వెల్లుల్లి పేస్ట్‌లను వేయించాలి. వాటిలోనే దాల్చిన చెక్క, లవంగాలు, ఏలకులు, బిర్యానీ ఆకులు వేసి వేయించాలి. ఆ తర్వాత దానిలో చికెన్ ముక్కలు వేయాలి. ఈ మిశ్రమంలో ఎర్రకారం, పచ్చకారం, పెరుగు, తగినంత ఉప్పు వేయాలి. పైన మూత పెట్టి ఉడకనివ్వాలి.
- ఈ లోపులో ఒక గిన్నెలో తగినన్ని నీళ్లు పోసి బాసుమతి బియ్యాన్ని ఉడికించాలి. బియ్యం ఉడికిన తర్వాత వార్చి నీళ్లు తీసేయాలి.
- ఇంకొక పెద్ద మూకుడు తీసుకొని దానిలో చికెన్ మిశ్రమాన్ని, వేరపకాయ ముక్కలను వేయాలి. దానిపై ఉడికిన బాసుమతి బియ్యాన్ని ఒక పొరగా కప్పాలి. దానిపై రోజ్‌వాటర్, మిగిలిన నెయ్యి, క్రీమ్‌లు వేసి సన్నని సెగపై ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత వేయించిన ఉల్లిపాయ ముక్కలు వేయాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- బాసుమతి బియ్యంతో వండిన అన్నం పొడిగా ఉండాలి. ముద్దగా ఉండకూడదు.
- క్రీమ్ వేసిన ఐదు నిమిషాలలో పులావ్‌ను స్టౌ మీద నుంచి దింపేయాలి.

చంపారన్ మటన్

బిహార్‌లోని చంపారన్ జిల్లాలో పెళ్లిళ్లకు.. పండగలకు.. అందరూ కలిసి వండుకొనే వంటకమిది. ఒకప్పుడు చంపారన్‌కు మాత్రమే పరిమితమయిన ఈ వంటకం- ప్రస్తుతం దేశవ్యాప్తంగా హాట్ ఫేవరెట్‌గా మారింది. భిన్నమైన రుచితో ఉండే ఈ మటన్ కర్రీని కట్టెలు లేదా బొగ్గుల పొయ్యి మీద నెమ్మదిగా వండుతారు. అందరి ఇళ్లలోను కట్టెల పొయ్యిలు ఉండవు కాబట్టి సాధారణ గ్యాస్ స్టౌవ్‌పై తక్కువ మంట మీద దీనిని వండుకోవచ్చు.

కావాల్సిన పదార్థాలు

మటన్- ఒక కేజీ , ఉల్లిపాయ ముక్కలు- 750 గ్రాములు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఆరు టేబుల్ స్పూన్లు, పసుపు- ఒక టేబుల్ స్పూను, ధనియాల పొడి- ఒక టేబుల్ స్పూను, ఎర్ర కారం- ఒక టేబుల్ స్పూను, పెరుగు- 150 గ్రాములు, ఆవ నూనె- ఒక చిన్న కప్పు, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- తగినంత, గోధుమ పిండి- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- ఒక గిన్నెలో పెరుగు తీసుకొని దానిలో పసుపు, ధనియాల పొడి, ఎర్రకారం కలపాలి. ఈ మిశ్రమంలో మటన్ ముక్కలను వేసి 8 నుంచి 12 గంటలు నానబెట్టాలి.
- మూతి చిన్నదిగా ఉన్న ఒక దళసరి గిన్నెను తీసుకొని దానిలో ఆవ నూనెను వేసి వేడిచేయాలి. ఈ ఆవనూనెలో ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్‌లను వేసి దోరగా వేయించాలి.
- దీనిలో నానబెట్టిన మటన్ ముక్కలను వేయాలి. ఆ తర్వాత గిన్నెపై మూత పెట్టాలి.
- గోధుమపిండిలో నీళ్లు పోసి ముద్దగా చేయాలి. గిన్నెపై మూతను ఈ ముద్దతో సీల్ చేయాలి. ఒక గంట సేపు సన్నని సెగపై ఉడకనివ్వాలి. ఆ తర్వాత గోధుమ పిండి సీల్‌ను తీసేయాలి.
- ఇలా ఉడికిన కూరలో ఉప్పు, కొత్తిమీర వేయాలి. దీనిని రోటీలలో కానీ.. అన్నంలో కానీ కలుపుకొని తినవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- మటన్‌ను ఎంత సేపు పెరుగులో నానబెడితే అంత మంచి రుచి వస్తుంది
- మటన్ ముక్కలు వేసిన తర్వాత నీళ్లు పోయకూడదు. మటన్‌లో ఉండే జ్యూస్ కూరను ఉడికేలా చేస్తుంది.

సింధి కఢి

సింధి వంటలు చాలా రుచికరంగా ఉంటాయి. అంతే కాకుండా వీటిల్లో వాడే కూరలు, పదార్థాలు మనను ఆరోగ్యంగా కూడా ఉంచుతాయి. అలాంటి ఒక సింధి కూరను ఎలా చేయాలో తెలుసుకుందాం.

కావాల్సిన పదార్థాలు

టమాటోలు - ఆరు, బెండకాయలు- ఆరు, బీన్స్- పది, ములక్కాడలు- రెండు, అల్లం- ఒక అంగుళం, కరివేపాకు- తగినంత, పచ్చి మిరపకాయలు- రెండు, శనగపిండి- ఆరు చెంచాలు, పసుపు- ఒక చెంచా, ఎర్ర కారం- రెండు చెంచాలు, ఇంగువ- తగినంత, ఆవాలు- ఒక చెంచా, జీలకర్ర- ఒక చెంచా, మెంతులు- ఒక చెంచా, నెయ్యి- ఆరు చెంచాలు, నీళ్లు- ఒక కప్పు, ఉప్పు- తగినంత, తరిగిన కొత్తిమీర- తగినంత

తయారీ విధానం

- ముందుగా టమాటోలను మిక్సీలో వేసి ముద్దగా చేసుకోవాలి. కూరలను, పచ్చి మిరపకాయలను పొడవుగా ముక్కలుగా తరగాలి.
- ఒక మూకుడును స్టౌ మీద పెట్టి నెయ్యిని వేడి చేయాలి. దీనిలో ముందు ఆవాలు, ఆ తర్వాత జీలకర్ర, చివరగా మెంతులు, ఇంగువ వేయాలి. దానిలో శనగపిండిని వేసి దోరగా వేయించాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, అల్లం ముక్కలను వేసి వేయించాలి.
- దీనిలో కారం, పసుపు వేయాలి. ఆ తర్వాత టమోటో ముద్దను వేసి సన్నని సెగపై ఉడకనివ్వాలి. ఆ తర్వాత కూర ముక్కలన్నింటినీ వేసి నీళ్లు పోసి కలపాలి. మూకుడుపై మూత పెట్టి పదిహేను నిమిషాలు మగ్గనివ్వాలి.
- స్టౌ మీద నుంచి దింపి, తగినంత ఉప్పు వేసి, తరిగిన కొత్తిమీరను కూరపైన చల్లాలి.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- శనగపిండి వేసిన తర్వాత సన్నని సెగపైన వేయించాలి. లేకపోతే శనగపిండి మాడు వాసన వస్తుంది.
- ఇంగువను కొద్దిగా వేసుకోవాలి. లేకపోతే ఘాటు ఎక్కువ అయిపోతుంది.

మేకప్

స్కిన్ టోన్‌కు సూటయ్యేలా...

మేకప్ కోసం ఖరీదైన విదేశీ ఉత్పత్తులకు బదులుగా దేశీ ఉత్పత్తులను ఎంచుకుంటే, స్కిన్ టోన్‌కు మ్యాచ్ అయ్యేలా మేకప్ వేసుకోవడంతో పాటు, తక్కువ ఖర్చుతో మెరిసిపోవచ్చు. అదెలాగో చూద్దాం!

మన దేశ వాతావరణం, దానికి స్పందించే చర్మం తత్వం ఆధారంగా మేకప్ ఉత్పత్తులను ఎంచుకోవాలి. మన చర్మంలో మెలనిన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతూ ఉంటుంది. కాబట్టి పిగ్మెంటేషన్, కళ్ల కింద నల్లని వలయాలు, చర్మం జీవం కోల్పోవడం లాంటి లక్షణాలు సహజం. కాబట్టి వీటిని చర్మంలో కలిసిపోయేలా చేసే మేకప్ ప్రొడక్ట్స్ ఎంచుకోవాలి.

కన్‌సీల్, కరెక్ట్, లిఫ్ట్

పిగ్మెంటేషన్, డల్‌నెస్ పోగొట్టడం కోసం కలర్ కరెక్టర్, కన్‌సీలర్ ఎంచుకోవాలి. క్రీమ్ రూపంలో ఉండే కలర్ కరెక్టర్ తేలికగా బ్లెండ్ అవుతుంది. లిక్విడ్ కరెక్టర్లు త్వరగా సెట్ అయిపోతాయి కాబట్టి వాటిని దూరం పెట్టడమే మేలు. పిగ్మెంటేషన్ కోసం ఆరెంజ్ కలర్ కరెక్టర్, ముదురు చర్మ రంగు ఉన్నవాళ్లు పీచ్ మొదలు మరింత శాచురేటెడ్ రంగులను ఎంచుకోవాలి.

బ్లష్ ఇలా...

చర్మ రంగుతో మ్యాచ్ అయ్యే బ్లష్‌లనే ఎంచుకోవాలి. తెలుపు, చామనచాయ రంగులో ఉండేవాళ్లు డస్టీ రోజ్ బ్లష్ ఎంచుకోవాలి. ముదురు చర్మపు రంగు కలిగిన వాళ్లు, డార్కిష్ కోరల్ బ్లష్ ఎంచుకోవాలి. క్రీమ్ బ్లష్‌లను నేరుగా వేలితో అప్లై చేసుకోవడమే ఉత్తమం. పౌడర్ బ్లష్‌లను బ్రష్‌తోనే అప్లై చేసుకోవాలి.

న్యూడ్స్ ఇలా...


న్యూడ్ లిప్ కలర్స్‌లో ఒకరికి నప్పినవి ఇంకొకరికి నప్పకపోవచ్చు. కాబట్టి చర్మపు రంగు ఆధారంగా లిప్ కలర్ ఎంచుకోవాలి. పెదవులు ఏ రంగులో ఉన్నాయో, ఆ రంగుకు దగ్గరగా ఉండే లిప్ కలర్‌ను ఎంచుకుంటే సహజసిద్ధంగా ఉంటుంది. భారతీయులు పిగ్మెంటెడ్ పెదవులు కలిగి ఉంటారు. కాబట్టి లిప్ పెన్సిల్‌తో పెదవులకు రంగును నింపేసి, పైన లిప్ కలర్ అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మన పెదవుల అసలు రంగు, లిప్ కలర్‌లో నుంచి బయటకు బహిర్గతం కాకుండా ఉంటుంది. అయితే న్యూడ్ లిప్‌స్టిక్ కలర్ కంటే కాస్త ముదురు రంగు లిప్ పెన్సిల్ వాడుకోవాలి. లేదంటే చర్మపు రంగుతో కలిసిపోయి, సాదాసీదాగా కనిపించే ప్రమాదం ఉంటుంది.



ఫిల్టర్ కాఫీ రుచి మన సొంతం..!

ఆసియాలో మొట్టమొదటి ప్రొఫెషనల్ కాఫీ టేస్టర్‌గా మాత్రమే కాదు, దేశ విదేశాలలో కాఫీ టేస్టర్‌గా ఎన్నో అవార్డులనూ గెలుచుకున్నారామె. కాఫీతో దాదాపు 50 ఏళ్ల తన ప్రయాణంలో ఇక కాఫీ వద్దు అనే క్షణం రాలేదంటున్న ఆమె, **సునాలినీ మీనన్**. కాఫీ తనకెంతో ఇచ్చిందనీ చెబుతున్న సునాలినీ తన ప్రయాణం ఒడిదుడుకులతోనే సాగినా విజయవంతంగానే కొనసాగుతుందంటున్నారు. కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ కాఫీ టేస్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి ఇప్పుడు కాఫీ ల్యాబ్‌తో రైతులకు, వ్యాపారులకు అవసరమైన సేవలనందిస్తూనే చక్కటి,చిక్కటి కాఫీలు మనకు చేరడంలో సహాయపడుతున్నారు. కాఫీ టేస్టింగ్ అంటే రుచి చూసి, బాగుందా లేదా అని చెప్పడం మాత్రమే కాదని, వాసన, బీన్ రూపు, కాఫీ బీన్స్‌లో ఎసిడిటీ ఇలా ఎన్నో అంశాలను చూడాల్సి ఉంటుందన్న ఆమె నగరంలో జరుగుతున్న మొట్టమొదటి ఇండియన్ కాఫీ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో చిట్ చాట్ చేశారు. ఆ విశేషాలు...

ఇండియాలోనే మొట్టమొదటి కాఫీ ఫెస్టివల్ ఇది. ఈ ఫెస్ట్ బృందంలో ఒకరైన విద్య నాకు ఎప్పటి నుంచో తెలుసు. ఆమె ఉమెన్స్ కాఫీ అలయన్స్‌లో సభ్యురాలు. ఆమె ఈ ఫెస్ట్ గురించి చెప్పగానే నో అని నేను చెప్పలేకపోయాను. ఎందుకంటే కాఫీ నా వీక్‌నెస్. కాఫీ ఫెస్టివల్ అనగానే ఏదో చిన్నగా ఉంటుందనుకున్నాను. కానీ, ఇక్కడ ఇంత పెద్దగా దీనిని నిర్వహిస్తుండటం చూసి ఆశ్చర్య పోయాను.





హైదరాబాద్‌తో అనుబంధం...

హైదరాబాద్‌తో నా అనుబంధం అని అంటే.. ప్రత్యేకంగా ఈ నగరంతో కాదు కానీ, ఆంధ్రాతో నాకు ప్రత్యేక అనుబంధమే ఉంది. మరీ ముఖ్యంగా అరకుతో ! హైదరాబాద్‌కు 2010-12 కాలంలో తరచుగా వచ్చేదానిని. అప్పట్లో నాంది ఫౌండేషన్‌తో కలిసి తిరిగాను. అరకులో ఎన్నో అద్భుతాలను చూశాను. అక్కడ గిరిజన మహిళలతో అనుబంధం ఎప్పటికీ మరిచిపోలేను. హైదరాబాద్‌కు రావడం అంటే మరలా నా ఇంటికి నేను తిరిగి వచ్చినట్లుగా అనిపిస్తుంది. ఎందుకంటే, నేను పుట్టింది అప్పటి ఆంధ్రప్రదేశ్‌లోనే ! కానీ, చిన్నతనంలోనే వదిలి చెన్నై, ఆ తరువాత బెంగళూరు వెళ్లిపోవడంతో తెలుగు మరిచిపోయాను. ఆ భాష వింటుంటే చిన్నతనపు రోజులు గుర్తుకొచ్చాయి. ఆంధ్రాలో కనిపించిన ఆత్మీయత నన్ను బాగా కదిలించింది.

తాగు విధానం కూడా...

కాఫీ పట్ల మన అలవాటుకు మనం చిన్నతనం నుంచి ఇంటిలో కాఫీ తాగిన విధానం కూడా ఓ కారణం అవుతుంది. ఫిల్టర్ కాఫీ తాగేవాళ్లు దానినే ఇష్టపడతారు. డబ్బా కాఫీ తాగేవాళ్లు కూడా అలాగే ! మీకు మంచిదనిపించింది మరొకరికి నచ్చకపోవచ్చు. ఇది పూర్తిగా వ్యక్తిగత ఎంపిక.

దక్షిణాది వారు ఫిల్టర్ కాఫీని ఎక్కువగా ఇష్టపడుతుంటారు. ఏమిటి దానిలో స్పెషాలిటీ అని అంటే, ముందుగా చెప్పినట్లు అది వ్యక్తిగత ప్రాధాన్యత ఆధారంగానే ఉంటుంది. మన దేశంలో ఫిల్టర్ కాఫీ ఇష్టపడటానికి దానిని మనవారు కనుగొనడం కూడా ఓ కారణం కావొచ్చు. మీరు ఇటలీ వెళ్తే ఎస్ప్రెసో ఇష్టపడతారు. దానితోనే వారు ఎదిగారు. దక్షిణాది వారికి ఫిల్టర్ కాఫీ అంతే ! నాకు స్వతహాగా ఫిల్టర్‌కాఫీనే ఇష్టం. ఈ రోజు నేను తాగింది కూడా అదే! ఎందుకంటే, దక్షిణాది వాసిగా నాకు అదే నచ్చుతుంది. టేస్ట్ ప్రిఫరెన్స్ కావొచ్చు. అలాగని ఎస్ప్రెసో కాఫీ బాగోదు. కాపిచినో.. అద్భుతం అని చెప్పలేను.

నా ప్రయాణం గురించి చెప్పాలంటే...

నా 19 ఏళ్ల వయసులో కాఫీ టేస్టర్‌గా కాఫీ బోర్డ్ ఆఫ్ ఇండియాలో ప్రయాణం యాదృచ్ఛికంగా మొదలైంది. అదీ అసిస్టెంట్‌గా! నా 28 ఏళ్ల వయసులో హెడ్ ఆఫ్ క్వాలిటీగా ఎంపికయ్యాను. దాదాపు 50 ఏళ్లకు పైగా నా కాఫీ ప్రయాణం సాగింది. నా ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. మా బాస్ అప్పట్లో ఒకటే చెప్పారు.. ఓపిగ్గా ఉండు... సబ్జెక్ట్ పట్ల పూర్తి అవగాహన పెంచుకో... అనుకున్న దానికి కట్టుబడి ఉండు.. అని. అదే ఇప్పటికీ పాటిస్తున్నాను. నా ప్రయాణం కష్టతరమైనదే కానీ విజయవంతమైనది. కాఫీ టేస్టర్‌గా నాకు అన్నీ తెలుసని మాత్రం ఇప్పటి వరకూ అనుకోలేదు. ఇప్పటికీ ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాను.

• గిరి

మంచి కాఫీని గుర్తించడం ఎలా..

అసలు మంచి కాఫీ అంటే ఏమిటి ?ఒక్కొక్కరి అభిరుచి ఒక్కోలా ఉంటుంది. మీ మనసుకు ఏది నచ్చితే అదే మంచి కాఫీ అని నేనంటాను. ఒకరికి స్వీటు తినాలని ఉంటుంది. కానీ వారికి మురుకులు పెడితే నచ్చదు. అలాగే జిలేబీ తినాలనుకునే వారికి గులాబ్ జామ్ పెడితే నచ్చదు. ఎవరి అభిరుచి వారిది. కాఫీ కూడా అంతే! ఒకరికి ఫిల్టర్ కాఫీ నచ్చితే మరొకరికి రోస్టెడ్ కాఫీ నచ్చవచ్చు. మంచి కాఫీ అనేది వారి వ్యక్తిగత ఎంపిక. కొంతమంది స్ట్రాంగ్ కాఫీ కోరుకుంటారు. మరికొంత మంది ఇన్నోవేటివ్‌గా ఉండాలనుకుంటారు.

ఇండియా 'ఎ'కి భారీ ఆధిక్యం

దులీప్ ట్రోఫీ

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (56), ప్రథమ్ సింగ్ (59 బ్యాటింగ్) అర్ధ శతకాలతో సత్తా చాటడంతో ఇండియా 'డి'తో దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'ఎ' పైచేయి సాధించింది. శుక్రవారం ఆట ఆఖరికి 'ఎ' జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 115 పరుగులు చేసి, ఓవరాల్‌గా 222 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంతకుముందు ఓవర్‌నైట్ 288/8 స్కోరుతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన 'ఎ' మరో రెండు పరుగులు జోడించి మిగిలిన రెండు వికెట్లు కోల్పోయింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'డి' ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 183 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ దేవదత్ పడిక్కళ్ (92), హర్షిత్ రాణా (31) రాణించారు. 107 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇండియా 'ఎ'కి ఓపెనర్లు శుభారంభం అందించారు.

సంక్షిప్త స్కోర్లు: ఇండియా 'ఎ' తొలి ఇన్నింగ్స్ 290 (షామ్స్ ములానీ 89, తనుష్ 53, హర్షిత్ రాణా 4/51, కావేరప్ప 2/30, అర్ష్‌దీప్ 2/73); **రెండో ఇన్నింగ్స్: 115/1.**

ఇండియా 'డి' మొదటి ఇన్నింగ్స్: 183 (పడిక్కళ్ 92, హర్షిత్ రాణా 31, రికీ భుయ్ 23, ఖలీల్ 3/39, ఆఖీబ్ ఖాన్ 3/41)

రాణించిన జగదీశన్, అభిమన్యు

ఓపెనర్లు జగదీశన్ (67 బ్యాటింగ్), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (51 బ్యాటింగ్) హాఫ్ సెంచరీలతో చెలరేగడంతో ఇండియా 'సి'కి ఇండియా 'బి' దీటైన జవాబిస్తోంది. ఓపెనర్ల అజేయ ఇన్నింగ్స్‌తో రెండో రోజు ఆఖరికి ఇండియా 'బి' తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 124 పరుగులు చేసింది. అంతకుముందు కిందటిరోజు 357/5తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'సి' 525 పరుగుల భారీ స్కోరుకు ఆలౌటైంది. మానవ్ సుతార్ (82), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (58) అర్ధ శతకాలతో మెరిశారు.


జగదీశన్

సంక్షిప్త స్కోర్లు: ఇండియా 'సి' తొలి ఇన్నింగ్స్: 525 (ఇషాన్ 111, సుతార్ 82, రుతురాజ్ 58, రాహుల్ చాహర్ 4/73, ముకేష్ 4/126).

ఇండియా 'బి' తొలి ఇన్నింగ్స్: 124/0.



మొత్తంగా రద్దయింది!

అఫ్ఘానిస్థాన్, న్యూజిలాండ్ ఏకైక టెస్ట్


గ్రేటర్ నోయిడా: కనీసం ఒక్కటంటే..ఒక్క బంతి కూడా పడకుండానే అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ జరగాల్సిన ఏకైక టెస్ట్ మ్యాచ్ రద్దయింది. శుక్రవారం కూడా ఎడతెగని వర్షం పడడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. దాంతో వర్షంతో రద్దయిన ఎనిమిదో టెస్ట్‌గా ఈ మ్యాచ్ చరిత్ర పుటలకెక్కింది. భారత్‌లో ఇలా జరగడం మాత్రం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సోమవారం ఈ మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉండగా..అవుట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడంతో మొదటి రెండు రోజుల ఆట సాధ్యం కాలేదు. కనీసం టాస్ వేసేందుకూ వీలుపడలేదు. దాంతో టెస్ట్‌కు ఆతిథ్యమిచ్చేందుకు షహీద్ విజయ్ సింగ్ పాథక్ స్టేడియం సన్నద్ధం కాలేదని తేలిపోయింది. ఇక మిగిలిన మూడు రోజుల ఆట వరుణుడి ప్రతాపం కారణంగా రద్దయింది. 'గ్రేటర్ నోయిడాలో శుక్రవారమూ వర్షం పడింది. దాంతో అఫ్ఘాన్-కివీస్ జట్ల టెస్ట్ ఐదో రోజు ఆటను రద్దు చేస్తూ మ్యాచ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు' అని అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు తెలిపింది. 1877లో టెస్ట్ క్రికెట్ ప్రారంభంకాగా..నేటి వరకు ఈ 147 సంవత్సరాల్లో ..2549 టెస్ట్‌ల్లో మొత్తం 8 మ్యాచ్‌లు ఒక్క బంతీ పడకుండానే రద్దు జాబితాలో చేరాయి. చివరిసారి 26 ఏళ్ల కిందట..అంటే 1998లో ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. డిసెంబరు 20, 1998లో ఒకే రోజు రెండు టెస్ట్‌లు (భారత్-కివీస్, పాక్-జింబాబ్వే) రద్దయ్యాయి.. పాకిస్థాన్-జింబాబ్వే టెస్ట్ దట్టమైన పొగమంచువల్ల రద్దయింది. ఇక ఆసియాలో..91 సంవత్సరాలలో 731 టెస్ట్ మ్యాచ్‌ల్లో వర్షం వల్ల రద్దయిన తొలి మ్యాచ్ అఫ్ఘాన్-కివీస్‌దే.

రద్దయిన మ్యాచ్‌లు ఇవీ..

సంవత్సరం	వేదిక	ప్రత్యర్థులు
1890	ఓల్డ్‌ట్రాఫర్డ్	ఇంగ్లండ్-ఆస్ట్రేలియా (అప్పట్లో టెస్ట్‌లు 3 రోజులే జరిగేవి)
1938	ఓల్డ్‌ట్రాఫోర్డ్	ఇంగ్లండ్-ఆస్ట్రేలియా (నాలుగు రోజుల టెస్ట్)
1970	మెల్‌బోర్న్	ఆస్ట్రేలియా-ఇంగ్లండ్
1989	డ్యునెడిన్	న్యూజిలాండ్-పాకిస్థాన్
1990	బౌర్డా (గయానా)	వెస్టిండీస్-ఇంగ్లండ్
1998	ఫైసలాబాద్	పాకిస్థాన్-జింబాబ్వే
1998	డ్యునెడిన్	న్యూజిలాండ్-భారత్
2024	గ్రేటర్ నోయిడా	అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్

రొనాల్డో @ 100 కోట్లు

సోషల్ మీడియాలో సాకర్ స్టార్ రికార్డు



లిస్బన్: క్రిస్టియానో రొనాల్డో.. ఈ ప్రఖ్యాత ఫుట్‌బాలర్ మైదానం లోపలా, బయటా ఏం చేసినా సంచలనమే. ఇటీవలే యూట్యూబ్‌లో అడుగుపెడితే గంటన్నరలోనే మిలియన్.. వారం రోజుల్లోనే 50 మిలియన్ల సబ్‌స్క్రయిబర్లను సంపాదించి రికార్డులతో షేక్ చేశాడు. తాజాగా మరెవరికీ సాధ్యం కాదేమోనన్న రీతిలో సోషల్ మీడియాలో ఏకంగా ఒక బిలియన్ ఫాలోవర్లను దక్కించుకుని చరిత్ర సృష్టించాడు. శుక్రవారం ఉదయం అతడీ మైలురాయికి చేరుకున్నాడు. ఇప్పటివరకు ఎవరికీ ఈ రికార్డు లేదు. ఎక్స్ (11 కోట్ల 30 లక్షలు), ఇన్‌స్టాగ్రామ్ (64 కోట్లు), యూట్యూబ్ (6 కోట్ల 5 లక్షలు), ఫేస్‌బుక్ (17 కోట్లు), చైనాకు చెందిన కువాషో (94 లక్షలు), వీబో (75 లక్షలు)లలో అతడికి ఎకౌంట్స్ ఉన్నాయి. 'మనం చరిత్ర సృష్టించాం. ఇది సంఖ్య మాత్రమే కాదు. మీ ప్రేమాభిమానాలకు నిదర్శనం. మదైరా వీధుల నుంచి.. ప్రపంచంలోనే అతిపెద్ద వేదికల వరకు.. నేనింకా మరిన్ని విజయాలు సాధించి చరిత్ర సృష్టించాల్సిన అవసరం ఉంది' అంటూ రొనాల్డో కృతజ్ఞతలు తెలిపాడు. గత నెల 21న రొనాల్డో తన యూట్యూబ్ చానెల్ ఆరంభించడంతో వన్ బిలియన్ రికార్డును చాలా వేగంగా చేరుకోగలిగాడు.

సెమీస్‌లో ధ్రువ్ జోడీ

వియత్నాం ఓపెన్

హో చి మిన్ సిటీ: ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ వియత్నాం ఓపెన్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తోంది. ఈ భారత జంట మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ క్వార్టర్స్ పోరులో ఆరోసీడ్ ధ్రువ్-తనీషా ద్వయం 14-21, 21-10, 21-14తో భారత్‌కే చెందిన టాప్‌సీడ్ సతీశ్ కుమరన్-ఆద్య జంటపై విజయం సాధించింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో తెలుగు కుర్రాడు తరుణ్ మన్నెపల్లి పోరాటం క్వార్టర్స్‌కే పరిమితమైంది. తరుణ్ 13-21, 13-21తో ఒగావ (జపాన్) చేతిలో పరాజయం పాలయ్యాడు.


రామ్‌కుమార్-శ్రీరామ్ బాలాజీ

భారత్‌కు కఠిన సవాల్

స్వీడన్‌తో పోరు
నేటి నుంచి డేవిస్‌కప్

స్టాక్‌హోమ్: డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్1లో భాగంగా భారత టెన్నిస్ జట్టు శని, ఆదివారాల్లో స్వీడన్‌తో తలపడనుంది. టాప్ సింగిల్స్ స్టార్ సుమిత్ నగాల్, యుకీ భాంబ్రి జట్టులో లేరు. దీంతో డబుల్స్ స్పెషలిస్ట్ శ్రీరామ్ బాలాజీపై ఆధారపడాల్సి వస్తోంది. శనివారం జరిగే తొలి సింగిల్స్‌లో ఎలియాస్ వైమర్‌తో బాలాజీ ఆడనున్నాడు. ఆ తర్వాత రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ రామ్‌నాథన్- దిగ్గజ ఆటగాడు బోర్న్‌బోర్గ్ కుమారుడు లియో బోర్గ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. అలాగే ఆదివారం డబుల్స్‌లో బాలాజీ-రామ్‌నాథన్ కలిసి ఆడనున్నారు. తర్వాత రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. భారత కాలమాన ప్రకారం తొలిరోజు పోటీలు సా 5.30 గం.కు, రెండో రోజు పోటీలు మ.3.30కి ప్రారంభమవుతాయి.



తీర్థుకు రజతం

● వ్రితి, వర్షిత్‌కు కాంస్యాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తెలుగు స్విమ్మర్లు పతకాల మోత మోగిస్తున్నారు. శుక్రవారం ముగిసిన ఈ పోటీల్లో విజయవాడ స్విమ్మర్ తీర్థు సామదేవ్ రజతం, హైదరాబాద్ స్విమ్మర్లు వ్రితి అగర్వాల్, వర్షిత్ కాంస్యాలు కొల్లగొట్టారు. పురుషుల 400 మీటర్ల మెడ్లేలో తీర్థు 4 నిమిషాల 36.44 సెకన్లలో రేసును పూర్తి చేసి ద్వితీయ స్థానంలో నిలవగా, వర్షిత్ (4 ని, 37.68 సె.) మూడో స్థానం దక్కించుకున్నాడు. మహిళల 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో వ్రితి 2 ని. 9.25 సెకన్లలో రేసును ముగించి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో వ్రితికి ఇది ఐదో పతకం.

ప్రాక్టీస్ మొదలెట్టారు

చెన్నైలో టీమిండియా
19 నుంచి బంగ్లాతో తొలి టెస్టు


కోహ్లీ, బుమ్రా

చెన్నై: నెల రోజులకుపైగా విశ్రాంతి తర్వాత టీవిండియా క్రికెటర్లు తిరిగి సాధన ఆరంభించారు. బంగ్లాదేశ్‌తో జరుగబోయే రెండు టెస్టుల సిరీస్ కోసం కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో జట్టు ఆటగాళ్లంతా శుక్రవారం నెట్స్‌లో చెమటోడ్చారు. ఈనెల 19న చెపాక్‌లో తొలి టెస్టు ఆరంభం కానుంది. కెప్టెన్ రోహిత్ శర్మ, కొన్ని రోజులుగా కుటుంబంతో కలిసి లండన్‌లో సేద దీరిన విరాట్ కోహ్లీ, కొత్త బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ కూడా పాల్గొన్నారు. విరాట్ 45 నిమిషాలపాటు నెట్స్‌లో గడపగా, బౌలర్ బుమ్రా పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాడు. 'ఆసక్తికర హోమ్ సీజన్ కోసం కౌంట్‌డౌన్ ఆరంభమైంది' అంటూ తొలి రోజు ప్రాక్టీస్ ఫొటోలను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతకుముందు రోహిత్ గురువారం రాత్రి చేరుకోగా విరాట్ నేరుగా లండన్ నుంచే చెన్నైకి వచ్చాడు. ఈ సిరీస్‌కు ముందు ఆగస్టులో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ ఓడిన విషయం తెలిసిందే. ఇక కోచ్ గంభీర్ అతడి సహాయక సిబ్బంది ఆధ్వర్యంలో భారత్‌కిది తొలి టెస్టు కావడం గమనార్హం. అందుకే గౌతీ శిక్షణలో భారత్ ఎలాంటి వ్యూహంతో బరిలోకి దిగనుందనే ఆసక్తి వ్యక్తమవుతోంది. అటు బంగ్లా జట్టు ఇటీవలే పాక్‌ను 2-0తో చిత్తుగా ఓడించిన ఊపులో ఉంది. అలాగే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరే క్రమంలో టీమిండియాకు ఈ సిరీస్ విజయం అత్యంత కీలకం కానుంది. ఆ తర్వాత కివీస్‌తో మూడు, ఆసీస్‌తో ఐదు టెస్టులు ఆడనుంది. 68.52 విజయాల శాతంతో రోహిత్ సేన డబ్ల్యూటీసీ పట్టికలో టాప్‌లో కొనసాగుతోంది.

ఆ ఇద్దరి ప్రదర్శన ఆసక్తికరం: మ్యాక్స్‌వెల్

ప్రపంచ క్రికెట్‌లో దిగ్గజాలు విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్‌ల ప్రదర్శనను తిలకించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ తెలిపాడు. ఈ ఏడాది చివర్లో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇద్దరు సూపర్‌స్టార్లు ముఖాముఖిగా తలపడబోవడం ఒక ఎత్తయితే.. ఏ జట్టు ట్రోఫీ గెలుచుకుంటుందనేది వీరి ప్రదర్శనపైనే ఆధారపడి ఉంటుందని మ్యాక్సీ అన్నాడు.

వరల్డ్ యూనివర్సిటీ పోటీలకు ఉమ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): విజయవాడ షూటర్ మద్దినేని ఉమామహేష్ వరల్డ్ యూనివర్సిటీ రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు. ఈ పోటీలు వచ్చే నవంబరు 9 నుంచి 13 వరకు న్యూఢిల్లీలో జరగనున్నాయి. న్యూఢిల్లీలో ఈనెల 10 నుంచి 14 వరకు జరిగిన ట్రయల్స్‌లో ఉమ పాల్గొన్నాడు. కేఎల్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించిన ఉమ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి, ప్రపంచ గేమ్స్‌కు అర్హత సాధించాడు.

టాప్-25 మాల్స్ జాబితాలో హైదరాబాద్ శరత్ సిటీ క్యాపిటల్

న్యూఢిల్లీ: రోజూ ఎక్కువ మంది షాపింగ్ చేసే టాప్-25 మాల్స్‌లో ఒక హైదరాబాద్ మాల్‌కు స్థానం లభించింది. కొండాపూర్‌లోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ ఈ జాబితాలో తొమ్మిదవ స్థానం సంపాదించింది. ఢిల్లీలోని వెగాస్ ఈ జాబితాలో అగ్రస్థానం సాంపాదించింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ మధ్య దేశంలోని ప్రధాన నగరాల్లోని మాల్స్‌లో షాపింగ్‌కు వచ్చిన వ్యక్తుల రాకపోకల ఆధారంగా జియోఐక్యూ అనే సంస్థ ఈ జాబితాను రూపొందించింది. రెండో స్థానం కూడా ఢిల్లీకి చెందిన వీ3ఎస్ ఈస్ట్ సెంటర్ మాల్‌కు దక్కింది. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతంలోని ఫినిక్స్ మార్కెట్ సిటీకి మూడో స్థానం దక్కింది. ముంబైకే చెందిన ఆర్ సిటీ మాల్ ఆరు, వివియానా మాల్ ఐదు, సీ వుడ్స్ గ్రాండ్ 10, హై స్ట్రీట్ ఫీనిక్స్ 12వ స్థానాల్లో నిలిచాయి.

5 లక్షల వరకు యూపీఐ చెల్లింపులు

ఆదివారం నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ: ఆదివారం నుంచి యూపీఐ చెల్లింపుల పరిమితి పెరగనుంది. రోజువారీ లావాదేవీల ద్వారా చెల్లించే పరిమితి రూ.5 లక్షలకు పెంచాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్ణయించింది. అయితే ఇది పన్ను చెల్లింపులు, హాస్పిటల్, విద్యా సేవల చెల్లింపులకు మాత్రమే పరిమితమని స్పష్టం చేసింది. మిగతా చెల్లింపుల రోజువారీ పరిమితిని ప్రస్తుత రూ.లక్ష దగ్గరే పరిమితం చేసింది.

మేము సచ్ఛీలురం, నిజాయితీపరులం

» దురుద్దేశాలతోనే మాపై ఆరోపణలు
» సెబీలో చేరేటప్పుడే అన్ని విషయాల వెల్లడి
» తప్పుడు ఆరోపణలపై కోర్టుకు వెళతాం
» మాధవి పురి, ధవల్ బుచ్



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవల్ బుచ్ ఎట్టకేలకు నోరు విప్పారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ, కాంగ్రెస్ పార్టీ తమపై పదే పదే చేస్తున్న ఆరోపణలను పూర్తిగా కొట్టివేశారు. దురుద్దేశాలతో పనిగట్టుకుని తప్పుడు ఆరోపణలతో తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిని కోర్టుకు ఈడ్చేందుకు వెనకాడేది లేదని హెచ్చరించారు. దీనికి సంబంధించి బుచ్ దంపతులు శుక్రవారం ఆరు పేజీల ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో వారు తమపై వచ్చిన ప్రతి ఆరోపణకు సమాధానం ఇచ్చారు.

అవి ఇ-సాప్స్ చెల్లింపులు మాత్రమే

సెబీలో చేరిన తర్వాత కూడా తాను గతంలో పనిచేసిన ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి చెల్లింపులు అందుకున్నట్టు హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపైనా మాధవి బుచ్ వివరణ ఇచ్చారు. అవి ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ (ఇ-సాప్స్), కంట్రిబ్యూటరీ యాన్యుటీలు మాత్రమేనని స్పష్టం చేశారు. ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి తనకు ఈ రెండు చెల్లింపులు వస్తాయనే విషయాన్ని సెబీలో చేరేటప్పుడే వెల్లడించినట్టు తెలిపారు. సెబీ మార్గదర్శకాలు కూడా ఇందుకు అనుమతిస్తాయన్నారు.

ఆ ఫైల్స్ తాకనేలేదు..

అలాగే తాను 2017లో సెబీ డైరెక్టర్‌గా చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు ఐసీఐసీఐ బ్యాంక్ గ్రూప్ కంపెనీల ఫైల్స్ ఏవీ ముట్టుకోలేదని సెబీ చీఫ్ స్పష్టం చేశారు. తాను స్థాపించిన అగోరా అడ్వైజరీ, అగోరా పార్ట్‌నర్స్ సంస్థల నుంచి కూడా 2017 నుంచి తాను ఎలాంటి చెల్లింపులు అందుకోలేదన్నారు. తన భర్త నుంచి సేవలు అందుకున్న మహీంద్రా గ్రూప్ కంపెనీల ఫైల్స్ కూడా తాను ఎన్నడూ ముట్టలేదన్నారు.

పసిడి మళ్లీ రూ.75,000 పైకి

ఒక్కరోజే రూ.1,200 పెరుగుదల

2 నెలల గరిష్ఠానికి చేరిక
వెండి రూ.2,000 జంప్



న్యూఢిల్లీ: విలువైన లోహాల ధరలు మళ్లీ కొండెక్కాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం నాడు రూ.1,200 పెరిగి దాదాపు రెండు నెలల గరిష్ఠ స్థాయి రూ.75,550కి చేరుకుంది. అంతర్జాతీయంగా పసిడికి డిమాండ్ పెరగడంతోపాటు దేశీయంగా ఆభరణ వర్తకులు భారీగా కొనుగోళ్లకు పాల్పడటం ఇందుకు కారణమైంది. కిలో వెండి మరో రూ.2,000 పెరిగి రూ.89,000 ధర పలికింది. పారిశ్రామిక అవసరాలతోపాటు నాణేల తయారీదారుల కొనుగోళ్లు పెరగడం ఇందుకు కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. వెండి ధర పెరగడం వరుసగా ఇది నాలుగో రోజు. ఈ 4 రోజుల్లో వెండి ధర రూ.5,200 పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో బులియన్ ధరల ర్యాలీకి వచ్చే వారంలో అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలే ప్రధాన కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 1.15 శాతం పెరుగుదలతో సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి 2,610 డాలర్లకు ఎగబాకింది. వెండి 3.20 శాతం ఎగబాకి 31.05 డాలర్ల వద్ద ట్రేడైంది. సాధారణంగా ఫెడ్ రేట్లు, బులియన్ ధరలది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్నప్పుడు విలువైన లోహాల ధరలు తగ్గుతాయి. ఫెడ్ రేట్ల తగ్గుదల సమయంలో బులియన్ ధరలు ఎగబాకుతాయి. ప్రస్తుత బులియన్ ర్యాలీ మున్ముందూ కొనసాగనుందని బులియన్ విశ్లేషకులంటున్నారు. వచ్చే ఏడాదిలో ఔన్స్ బంగారం 3,000 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

సూచీలకు స్వల్ప నష్టాలు

ముంబై: క్రితం సెషన్‌లో సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 71.77 పాయింట్లు కోల్పోయి 82,890.94 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 32.40 పాయింట్లు క్షీణించి 25,356.50 వద్ద స్థిరపడింది. రికార్డు గరిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు పవర్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ రంగాలకు చెందిన కొన్ని షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 1.37 శాతం నష్టంతో సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బ్లూచిప్‌లు అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ చిన్న, మధ్య స్థాయి షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్ క్యాప్ సూచీ 0.95 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.48 శాతం ఎగిశాయి. రంగాలవారీ సూచీల్లో ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ అర శాతానికి పైగా నష్టపోయాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు పెరిగి 83.92 వద్ద ముగిసింది.

రికార్డు స్థాయికి ఫారెక్స్ నిల్వలు

విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు వరుసగా రెండో వారం సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. ఈనెల 6తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 525 కోట్ల డాలర్ల వృద్ధితో మొత్తం 68,924 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ శుక్రవారం వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 229 కోట్ల డాలర్ల పెరుగుదలతో 68,398 కోట్ల డాలర్ల వద్దకు చేరాయి.

కో-లొకేషన్ కేసులో ఎన్ఎస్ఈకి ఊరట

న్యూఢిల్లీ: కో-లొకేషన్ కేసుకు సంబంధించి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)కు భారీ ఊరట లభించడంతో పాటు పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు వచ్చేందుకు ఈ ఎక్స్ఛేంజీకి మార్గం సుగమమైంది. ఈ కేసులో ఎన్ఎస్ఈతో పాటు ఎక్స్ఛేంజీ మాజీ చీఫ్ చిత్ర రామకృష్ణ సహా ఏడుగురు మాజీ ఉద్యోగులపై వచ్చిన నియంత్రణ నియమావళి ఉల్లంఘన ఆరోపణలను సెబీ కొట్టివేసింది. ఆ ఆరోపణలను రుజువు చేసేందుకు సరైన ఆధారాలు లేని కారణంగా కేసును మూసివేస్తున్నట్లు శుక్రవారం జారీ చేసిన 83 పేజీల ఉత్తర్వులో సెబీ పేర్కొంది. ఎన్ఎస్ఈ మాజీ ఎండీ, సీఈఓ చిత్ర రామకృష్ణ హయాంలో జరిగిన వ్యవహారమిది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,450 ▲	68,250 ▲	95,000 ▲
ముంబై	73,044 ▲	66,908 ▲	86,100 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ

హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	553	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	123
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	120
కర్నూలు	115	నెల్లూరు	120
విశాఖపట్నం	106	అనంతపురం	120
గోదావరి	123		

అయినా చేరాల్సిన దూరం ఎంతో ఉంది

ద్రవ్యోల్బణం అదుపుపై ఆర్‌బీఐ గవర్నర్ దాస్



సింగపూర్: భారత్‌లో ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందని, అయినప్పటికీ చేరాల్సిన దూరం ఇంకా ఎంతో ఉన్నదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 3.65 శాతంగా నమోదైంది. ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించిన కట్టడి పరిధి 4 శాతం కన్నా దిగువనే ద్రవ్యోల్బణం ఉండడం వరుసగా ఇది రెండో నెల. 2022 ఏప్రిల్‌లో నమోదైన గరిష్ఠ స్థాయి 7.8 శాతం నుంచి ప్రస్తుత స్థాయికి దిగి రావడం హర్షణీయమే అయినా అప్రమత్తత తప్పదని ఆయన వ్యాఖ్యానించారు.

బ్రెటన్ వుడ్స్ కమిటీ నిర్వహణలోని ఫ్యూచర్ ఆఫ్ ఫైనాన్స్ ఫోరమ్ 2024 కార్యక్రమంలో కీలకోపన్యాసం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.4 శాతం ఉండి వచ్చే ఏడాదికి 4.5 శాతానికి, 2025-26 సంవత్సరానికి 4.1 శాతానికి దిగి వస్తుందన్నది ఆర్‌బీఐ అంచనా. ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో ద్రవ్య విధాన నిర్వహణలో సెంట్రల్ బ్యాంకులు అప్రమత్తంగా ఉండక తప్పదని, అలాగే ప్రభుత్వాలు సరఫరాల పరంగా క్రియాశీలంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఇటీవల వెలువరించిన విధాన ప్రకటన అనంతరం కీలక వడ్డీ రేట్లు తగ్గవచ్చన్న ఆశలు జోరందుకున్నాయని, అయితే దీర్ఘకాలంగా వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిల్లో ఉన్న నేపథ్యంలో ఎదురయ్యే రిస్క్‌ను కూడా పరిగణనలోకి తీసుకోక తప్పదని దాస్ అన్నారు.

వారివో హై స్పీడ్ ఈ-స్కూటర్ సీఆర్ఎక్స్

ధర రూ.79,999



న్యూఢిల్లీ: విద్యుత్ టూ వీలర్ స్టార్టప్ వారివో మోటార్స్ హై స్పీడ్ స్కూటర్ సీఆర్ఎక్స్‌ను మార్కెట్లోకి తెచ్చింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.79,999. ఇప్పటివరకు వారివో గంటకు 25 కిలోమీటర్ల కన్నా తక్కువ వేగంతో నడిచే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు మాత్రమే మార్కెటింగ్ చేస్తోంది. సీఆర్ఎక్స్ గంటకు 55 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించగలుగుతుంది. గరిష్ఠంగా 150 కిలోల బరువు వరకు మోయగలుగుతుంది. ఈ ఏడాది సీఆర్ఎక్స్ 8 వేల యూనిట్లు విక్రయించడం లక్ష్యంగా పెట్టుకున్నామని కంపెనీ సీఈఓ షమ్మీ శర్మ తెలిపారు. సీఆర్ఎక్స్‌తో తాము హైస్పీడ్ స్కూటర్లలో మిడ్ సెగ్మెంట్‌లో ప్రవేశించినట్టయిందని ఆయన చెప్పారు. రాబోయే మూడేళ్ల కాలంలో ఆదాయాల్లో 90 నుంచి 100 శాతం వృద్ధి సాధించాలన్నది తమ లక్ష్యమని కంపెనీ డైరెక్టర్ రాజీవ్ గోయెల్ తెలిపారు.

టీసీఎస్ ఉద్యోగులకు ఐటీ నోటీసులు

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఉద్యోగులకు ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ పెద్ద షాకిచ్చింది. రూ.50,000 నుంచి రూ.1.5 లక్షల వరకు పన్ను చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. ఇలా నోటీసులు అందుకున్న ఉద్యోగుల సంఖ్య వేలల్లోనే ఉంటుందని సమాచారం. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం టీడీఎస్‌కు సంబంధించి ఐటీ శాఖ ఈ నోటీసులు జారీ చేసినట్టు భావిస్తున్నారు. అయితే ఈ నోటీసుల ప్రకారం పన్ను చెల్లించవద్దని టీసీఎస్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులను కోరింది. దీనికి సంబంధించి కంపెనీ మానవ వనరుల (హెచ్ఆర్) విభాగం.. ఐటీ శాఖ అధికారులతో మాట్లాడుతోంది. ఐటీ అధికారుల నుంచి పూర్తి స్పష్టత వచ్చే వరకు పన్ను చెల్లించవద్దని కంపెనీ ఉద్యోగులను కోరింది.

ఎగుమతులకు చెన్నై ప్లాంట్: ఫోర్డ్

చెన్నై: ఫోర్డ్ మోటార్ తమ చెన్నై ప్లాంట్‌ను పూర్తిగా ఎగుమతులకు వినియోగించుకునేందుకు సిద్ధమవుతోంది. కంపెనీ ఈ విషయం తమిళనాడు ప్రభుత్వానికి తెలియచేసింది. భారత్‌లో వాహనాల తయారీని నిలిపివేయాలనుకుంటున్నట్టు తెలియచేస్తూ 2021లో కంపెనీ లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) జారీ చేసింది. అయితే తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో సమావేశమైన అనంతరం ఎగుమతి మార్కెట్లకు వాహనాలు తయారుచేయడానికి చెన్నై ప్లాంట్‌ను ఉపయోగించుకోవాలనుకుంటున్నట్టు ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా చెన్నై ప్లాంట్‌ను సిద్ధం చేస్తామని ఫోర్డ్ ఇంటర్నేషనల్ మార్కెట్స్ గ్రూప్ ప్రెసిడెంట్ కే హార్ట్ తెలిపారు. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఏలేరుకు మళ్లీ పెరిగిన వరద

▸ 13 వేల ఎకరాల్లోని పంట పొలాలు ముంపులోనే..


కాకినాడ జిల్లా ఏలేశ్వరం జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

పిఠాపురం, సెప్టెంబరు 13: ఏలేరు వరద ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ఏలేరు రిజర్వాయర్ నుంచి మిగులు జలాల విడుదలను గురువారం ఉదయం పూర్తిగా నిలిపివేయగా ఇన్‌ఫ్లో పెరగడంతో మళ్లీ విడుదల చేయడం ప్రారంభించారు. శుక్రవారం దీనిని మరింతగా పెంచారు. రిజర్వాయర్‌కు ఉదయం 6గంటలకు ఇన్‌ఫ్లో 6,308 క్యూసెక్కులకు పెరిగింది. నీటినిల్వలు గరిష్ఠ స్థాయికి చేరుతున్న నేపథ్యంలో మిగులు జలాల విడుదలను 3,875 క్యూసెక్కుల నుంచి 4,875 క్యూసెక్కులకు పెంచారు. డ్యాంలో గరిష్ఠ నీటినిల్వ 24.11 టీఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రం 6గంటలకు 22.56 టీఎంసీల నిల్వ ఉంది. ఏలేరు వరద ప్రభావం పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలను ఇంకా వెంటాడుతోంది. సుమారు 13వేల ఎకరాల్లో పంట పొలాలు ఇంకా ముంపులో కొనసాగుతున్నాయి. పది గ్రామాల్లో వరద ప్రభా వం ఉంది. మల్లవరం, రమణక్కపేట, ఉప్పరగూడెం ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహిస్తోంది. తాజాగా మిగులు జలాల విడుదలతో కాలువలు మళ్లీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాకినాడ జిల్లాలో ఏలేరు, సుద్దగడ్డ వరదలు, అధిక వర్షాల కారణంగా 75వేల ఎకరాల్లో వరి, పత్తి, కాయగూరలు తదితర పంటలకు నష్టం వాటిల్లిందని, రైతాంగం రూ.178 కోట్లు విలువైన పంటను కోల్పోయిందని అధికారులు అంచనా వేశారు.

శాంతించిన గోదావరి

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/పోలవరం, సెప్టెంబరు 13: గోదావరి శాంతించింది. వరద తగ్గుముఖం పట్టింది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుక్రవారం ఉదయం 5.30గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. మొదటి ప్రమాద హెచ్చరికను రాత్రి వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం బ్యారేజీ నీటిమట్టం 12.20 అడుగులు ఉంది. బ్యారేజీ నుంచి 10,46,957 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ నీటిమట్టం 11.75 అడుగులకు చేరినా, దిగువకు వెళ్లే మిగులు జలాలు 10లక్షల క్యూసెక్కుల కంటే తగ్గినా మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకుంటారు. భద్రాచలం వద్ద బాగా తగ్గిన వరద సాయంకాలం 6గంటల నుంచి నిలకడగా మారడం గమనార్హం. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.50 అడుగులుగా ఉంది. కాగా, ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న 9,50,233 క్యూసెక్కుల అదనపు వరద జలాలను జల వనరుల శాఖ అధికారులు స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఈశాన్య బంగాళాఖాతంలో శుక్రవారం ఉదయం ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయువ్యంగా పయనించి మధ్యాహ్నానికి తీవ్ర అల్పపీడనంగా, సాయంత్రానికి వాయుగుండంగా బలపడింది. ఇది పశ్చిమ వాయువ్యంగా పయనించి శుక్రవారం రాత్రికి బంగ్లాదేశ్‌లో తీరం దాటుతుందని, ఆ తరువాత పశ్చిమ బెంగాల్ మీదుగా పయనిస్తుందని..దీని ప్రభావం రాష్ట్రంపై ఏమీ ఉండబోదని వాతావరణ నిపుణులు స్పష్టంచేశారు. కాగా శుక్రవారం రాష్ట్రంలో అనేకచోట్ల ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. కావలిలో 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

వరద ప్రాంతాల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లోని విద్యార్థులకు మరోసారి స్టూడెంట్ కిట్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విజయవాడ, కొల్లేరు సమీప ప్రాంతాల్లో వరదల వల్ల అనేక ఇళ్లలోకి నీరు వెళ్లి వస్తువులన్నీ పాడైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అనేక మంది విద్యార్థుల పుస్తకాలు, బ్యాగులు కూడా పాడైనట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో వారికి మరోసారి కిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. సుమారు 8 వేల మంది విద్యార్థులకు కిట్లు ఇవ్వాల్సి వస్తుందని అంచనా.


విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు కార్యక్రమం దృశ్యం


పొజిషన్‌లోకి వచ్చినట్టే వచ్చి.. నీటిలో మునిగిన బోటు

నేడు ఒడ్డుకు లాగేందుకు ప్రయత్నాలు.. ప్రకాశం బ్యారేజ్ వద్ద బోటు ఆపరేషన్

విజయవాడ (ఆంధ్రజ్యోతి)/ కాకినాడ సిటీ, సెప్టెంబరు 13: ప్రకాశం బ్యారేజ్ వద్ద జరుగుతున్న బోటు ఆపరేషన్‌లో కాస్త ముందడుగు పడింది. ఒక బోటుపై మరొకటి ఎక్కి కూర్చున్నట్టుగా ఉన్న బోటును సీ లయన్ కంపెనీకి చెందిన నిపుణులు విడదీశారు. అయితే ఇది పొజిషన్‌లోకి వచ్చినట్టే వచ్చి మళ్లీ నీట మునిగింది. ఆపరేషన్‌లో భాగంగా శుక్రవారం తొలుత ఈ బోటును అడుగు భాగం, పై భాగం నుంచి ఆక్సీ ఆర్క్ కటింగ్ ద్వారా కట్ చేశారు. ప్రకాశం బ్యారేజ్ పైకి వేసిన రోప్‌లు, మోడల్ గెస్ట్‌హౌస్ వైపున వేసిన రోప్‌లతో బలంగా లాగితే ఈ బోటు రెండు ముక్కలవుతుందని భావించారు. ముందుగా కాకినాడకు చెందిన అబ్బులు టీం (రిగ్గర్స్) మోడల్ గెస్ట్ హౌస్ వైపున బోటుకు ఇనుప రోప్ ఏర్పాటు చేశారు. క్రేన్‌తో ఈ రోప్‌ను లాగడంతో అడుగున బోటు మీద నుంచి నీళ్లలోకి ఒరిగింది. దీన్ని నిలబెట్టడం కోసం ప్రకాశం బ్యారేజ్‌పై నుంచి క్రేన్లతో లాగడానికి ప్రయత్నించినప్పుడు బోటు నీళ్లలోకి మునిగిపోయింది. బోటు నీళ్లలో మునిగిపోయినా నీటిలో తిరిగేటప్పుడు ఏ స్థితిలో ఉంటుందో అదే స్థితిలోనే ఉంది కాబట్టి క్రేన్లతో లాగడం సులభమని ఇంజనీర్లు చెబుతున్నారు. శనివారం ఈ బోటును మోడల్ గెస్ట్‌హౌస్ వైపున ఉన్న క్రేన్‌తో అక్కడ ఉండే ఘాట్ వద్దకు లాగాలని నిర్ణయించారు.

2, 3 రోజుల్లో ఒడ్డుకు లాగుతాం: అబ్బులు

ప్రకాశం బ్యారేజ్ గేట్ల వద్ద నిలిచిన బోట్లను రెండు, మూడు రోజుల్లో ఒడ్డుకు లాగుతామని కాకినాడ జగన్నాథపురం ప్రాంతానికి చెందిన ఎస్ఎస్ మెరైన్స్ అధినేత పెంటపాటి అబ్బులు చెప్పారు. ఈ బోట్లను ఒడ్డుకు లాగడానికి కాకినాడ నుంచి 15 మందితో కూడిన బృందం ఇప్పటికే రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా బృందం లీడర్ అబ్బులు మాట్లాడుతూ.. ఒక బోటును పొజిషన్‌లో పెట్టామని, బోట్లను రెండు, మూడు రోజుల్లో ఒడ్డుకు లాగుతామని తెలిపారు.


వరద బాధితులకు పరిహారానికి సంబంధించిన ఫైలును పరిశీలిస్తున్న సీఎం

ఆ పనులు బాగా చేయడం లేదు

జాతీయ రహదారుల నిర్మాణం, నిర్వహణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారుల పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు సరిగ్గా పనిచేయడం లేదని సమీక్షా సమావేశంలో చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రహదారి పనులు సకాలంలో పూర్తయ్యేలా, నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆదేశించారు.

మూడు మల్టీ మోడల్ లాజిస్టిక్స్

రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేయనున్నామని సీఎం ప్రకటించారు. అనంతపురం, విశాఖ, విజయవాడల్లో ఇవి రాబోతున్నాయని చెప్పారు. వీటి ద్వారా రైల్, రోడ్, సముద్ర, విమానాయాన మార్గాల ద్వారా కనెక్టివిటీ పెరగనుందని సీఎం చెప్పారు. విదేశీ ఎగుమతులు కూడా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అందరికీ సాయం

(మొదటి పేజీ తరువాయి)

17న బాధితులకు సాయం అందిద్దామని తెలిపారు. ఎన్యుమరేషన్ జరుగుతున్న విధానాన్ని అధికారులు... సీఎంకు వివరించారు. ఎన్యుమరేషన్‌లో రీ-వెరిఫికేషన్ జరిపి, ప్రతి బాధితుడికీ జరిగిన నష్టాన్ని సేకరిస్తున్నామని తెలిపారు.

క్లెయిమ్‌లను వారంలో పరిష్కరించండి

ఇళ్లు పూర్తిగా మునిగి, ఆస్తినష్టం జరిగిన వారితో పాటు మొదటి ఫ్లోర్‌లో ఉన్నవారికి సైతం సాయం అందిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో విజయవాడ కలెక్టరేట్‌లో ఆయన మంత్రులు, సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, ముఖ్య కార్యదర్శి (ప్లానింగ్) పీయూష్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన, బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ ఏజెన్సీల ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో వరద నష్టాల క్లెయిమ్‌ల పరిష్కారం, రుణాల రీషెడ్యూలింగ్, రీస్ట్రక్చర్, మారటోరియం, కొత్త రుణాల మంజూరు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల రిపేరింగ్, తదితర అంశాలపై చర్చించారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయవలసింది అంతా చేస్తున్నాయి. ఇన్సూరెన్స్, బ్యాంక్‌లు కూడా సహకరించాలి. సంస్థలపై విశ్వసనీయత పెరిగేలా వాటి కృషి ఉండాలి. ఇప్పటి నుంచి ఏడు రోజుల్లో క్లెయిమ్‌లు పరిష్కరించండి" అని చంద్రబాబు కోరారు. మానవతా కోణంలో బాధితులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. "వరద కారణంగా ఇంటిలో వస్తువులన్నీ పాడైపోయిన మొదటి అంతస్తువారికి ఒక మొత్తం, రెండవ ఫ్లోర్ నుంచి ఆ పైన ఉన్నవారికి కొంత మొత్తం ఇద్దాం. దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలకు కూడా పరిహారం ఇద్దాం. పూర్తిగా ఇళ్లు దెబ్బతిన్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ఇళ్లు నిర్మించి ఇద్దాం. క్లెయిమ్‌ల పరిష్కారంలో వేగంతో పాటు సరైన న్యాయం అందడం అవసరం. ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదు. చివరి బాధితుడి వరకు న్యాయం జరగాలి" అని సీఎం స్పష్టం చేశారు. "110కి పైగా పైరింజన్‌లతో గృహాలు, రహదారులు శుభ్రం చేశాం. ప్రజలకు భరోసా కల్పించేలా వ్యవస్థ పట్ల విశ్వసనీయత పెరిగేలా బాధిత ప్రజలకు సేవలు అందించాలి. సంక్షోభంలో ఉన్న ప్రజలను కష్టాల నుంచి గటెక్కించేందుకు సహకారం బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ కంపెనీలు అందించాలి" అని చంద్రబాబు కోరారు.

రోడ్ల మరమ్మతులకు 476 కోట్లు

రాష్ట్రంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక శాఖను ఆదేశించారు. గుంతలు పూడ్చేందుకు రూ.290 కోట్లు, భారీ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకోసం మరో రూ.186 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. విపత్తు స్పందన నిధి కింద ఈ నిధులు సర్దుబాటు చేసుకోవాలన్నారు. మొత్తంగా రహదారుల మరమ్మతుల కోసం రూ.476 కోట్లు ఇస్తామని చంద్రబాబు ఆర్అండ్‌బీకి హామీ ఇచ్చారు. శుక్రవారం ఇక్కడి సచివాలయంలో రోడ్లు భవనాలశాఖ పనులపై ఆయన సమీక్ష చేశారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇంజనీరింగ్ చీఫ్ నయీముల్లా, జాతీయ రహదారుల చీఫ్ ఇంజనీర్ రామచంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రహదారుల మరమ్మతుల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించిన అధికారులు.. గతంలో ప్రకటించిన రూ.290 కోట్ల నిధులు విడుదల చేయాలని కోరగా.. సీఎం అంగీకరించారు. వెంటనే ఆర్అండ్‌బీకి బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్ఓ) ఇవ్వాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. మరో రెండు రోజుల్లో ఈ ఉత్తర్వులిస్తామని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, వరదల వల్ల ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు తదితర జిల్లాల పరిధిలో 4వేల కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని చీఫ్ ఇంజనీర్ నయీముల్లా సీఎంకు నివేదించారు. మరమ్మతులకు తక్షణంగా రూ.186 కోట్లు అవసరమని తెలిపారు. ఈ నిధులను కూడా త్వరలో అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే, సీఆర్ఎఫ్ కింద రూ.500 కోట్ల బకాయిలున్నాయని ఈఎన్‌సీ నయీముల్లా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కాంట్రాక్టర్ల నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని వివరించగా, ఆ నిధులు ఇస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పీపీపీ రోడ్లపై సర్వే

రాష్ట్రంలో స్టేట్ హైవేలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) కింద చేపట్టే విషయంలో ప్రభుత్వం కృతనిశ్చయంతోనే ఉంది. ఈ ప్రాజెక్టుపై సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సీఎం చంద్రబాబు ఆర్అండ్‌బీని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రహదారి అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) కింద 3,931 కి.మీ రహదారులను పీపీపీ మోడల్‌లో చేపట్టేందుకు సర్వే చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం తొలుత సమగ్ర ప్రాజెక్టును రూపొందించాల్సి ఉంది. ఈ పని పూర్తి చేసేందుకు కన్సల్టెంట్‌లను ఆర్అండ్‌బీ సమకూర్చుకోవాల్సి ఉంది.


ఉడా, కండ్రిక కాలనీల్లో మోటార్ బైక్‌పై వరద నీటిలో మంత్రి నారాయణ పర్యటన

నష్టం అంచనాలు పూర్తికాగానే పరిహారం పంపిణీ

▸ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 13: విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ క్రమం తప్పకుండా పర్యటిస్తున్నారు. శుక్రవారం మంత్రి స్వయంగా బైక్ నడుపుకుంటూ అధికారులతో కలసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో వరద నీటిలో నడిచి వెళ్లి బాధితులను పరామర్శించారు. కండ్రిక, ఉడా కాలనీలు, జర్నలిస్టు కాలనీల్లోని ఇళ్ల మధ్యలో నిలిచిన నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వరద బాధితులకు ఏ మేరకు నష్టం జరిగిందో అంచనాలు వేస్తున్నారని, నివేదిక సిద్ధం కాగానే పరిహారం అందించనున్నట్టు చెప్పారు. ఇంటికి వచ్చి నష్టం వివరాలు అడగలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, ఒకవేళ ఎక్కడైనా ఇళ్లను వదిలిపెట్టినట్లయితే మరోసారి వెళ్లి వివరాలు సేకరించమని ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఇంకా కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఉందని, శుక్రవారం రాత్రికి అంతా తగ్గిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

18న కేబినెట్

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 18న జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు అమరావతి సచివాలయంలో సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు పంపారు. 15వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం పేర్కొంది. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడను ముంచెత్తిన బుడమేరు వరద, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో పంట నష్టం, ఆస్తి నష్టం తదితర అంశాలపై ఈ కేబినెట్ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

అంత తాత్సారమా?

ఇసుక అక్రమ తవ్వకాలపై కేసుల నమోదులో జాప్యమెందుకు?

▸ జగన్ సర్కారు తీరుపై సుప్రీం కోర్టు ఆగ్రహం

▸ ఆదేశాలు జారీ చేశాక కూడా ఆలస్యంగా నోటీసులు ఇచ్చారని ఆక్షేపణ

▸ అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు

▸ సర్కారు మారాకే చర్యలు మొదలు

▸ పెట్టామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

▸ నవంబరు 14లోపు అఫిడవిట్‌కు ఆదేశం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాల అంశంలో గత జగన్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసుల నమోదులో తాత్సారం చేశారంటూ దుయ్యబట్టింది. తాము ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా ఆలస్యంగా ఎప్పుడో నోటీసులు జారీ చేశారని పేర్కొంది. జేపీ వెంచర్స్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఏపీలో నదీ భూగర్భ జలాలతో పాటు ఇతర ప్రదేశాల్లో ఇసుక అక్రమ మైనింగ్ వ్యవహారం, ఉల్లంఘనలు జరుగుతున్నాయని గతంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)లో న్యాయవాది దండా నాగేంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన గ్రీన్ ట్రిబ్యునల్ జేపీ వెంచర్స్‌కు భారీ జరిమానా విధించింది. ట్రిబ్యునల్ ఆదేశాలను జేపీ వెంచర్స్ సంస్థ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై శుక్రవారం సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం పలు అంశాలను ప్రస్తావించింది. షోకాజ్ నోటీసులు, ఎఫ్ఐఆర్‌లు అన్నీ ఈ ఏడాది జూలై, ఆగస్టులోనే ఎందుకు ఉన్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. ఎక్కువ షోకాజ్ నోటీసులు ఒకే తరహాలో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా జూలై, ఆగస్టులో నోటీసులు జారీ చేశారని, కేసుల నమోదులో ఎందుకు తాత్సారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాతే కేసుల నమోదుతో పాటు తదుపరి చర్యలు మొదలు పెట్టామని ధర్మాసనానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు తెలిపారు. ఇప్పటి వరకు 9 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ఈ వ్యవహారంలో తమపై ఎక్కడా కేసు నమోదు చేయలేదని, తమపై అక్రమ మైనింగ్ ఆరోపణలు లేవని జేపీ వెంచర్స్ తరఫు న్యాయవాది తెలిపారు. గతంలో జేపీ వెంచర్స్ దాఖలు చేసిన ఇదే పిటిషన్‌పై విచారణ సమయంలో రాష్ట్రంలో అక్రమ మైనింగ్ నిలుపుదల చేయాలని, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. గతంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలిపేలా సమగ్ర సమాచారంతో నవంబరు 14లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. నవంబరు 18న తదుపరి విచారణ చేపట్టనున్నట్టు పేర్కొంది.

నిజమే.. ఏలేరు ఆధునికీకరణ చేపట్టలేదు


కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటలో వరద బాధితులను పరామర్శించేందుకు ట్రాక్టర్‌పై వెళుతున్న మాజీ సీఎం జగన్

(మొదటి పేజీ తరువాయి)

వదిలేశామని విచిత్ర సమర్థన వినిపించారు. కాకినాడ జిల్లా ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో శుక్రవారం జగన్ పర్యటించారు. కాకినాడ జిల్లాలోని వరద ప్రాంతాల్లో గట్టు దాటి పొలంలోకి దిగని ఆయన.. పెద్దగా వరద ప్రభావం లేని ఏరియాల్లో మాత్రం హడావుడి చేశారు. నెత్తిన చేతులు ఉంచుతూ, ముద్దులు పెడుతూ అక్కడ కనిపించిన ఆయన.. నిండా మునిగిన వరద బాధితులతో మాత్రం అంటీముట్టనట్టు ప్రవర్తించారు. అనంతరం యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అడుగడుగునా అబద్ధాలు వల్లించారు. తన ప్రభుత్వ వైఫల్యాలను వింత సమర్థనతో డబ్బా కొట్టుకునే ప్రయత్నం చేశారు. ఏలేరు ఆధునికీకరణ చేయకపోవడం వల్లే వరద కాకినాడ జిల్లాను చాలావరకు ముంచేయడానికి గత వైసీపీ పాలనే కారణమంటూ సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, విజయవాడ, ఏలేరు వరదలు మ్యాన్‌మేడ్ (మానవ కల్పిత) వరదలంటూ అవగాహన లేని వ్యాఖ్యలు చేశారు.

ఏలేరును 'రివర్స్'లో ముంచారు

జగన్ సీఎం కాకముందు అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం ఏలేరు ప్రాజెక్టు టెండర్లు పూర్తి చేసి పనులకు శంకుస్థాపన చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రివర్స్ టెండరింగ్ పేరుతో నాడు వాటిని రద్దు చేశారు. ఐదేళ్లూ ప్రాజెక్టు నిర్వహణను గాలికి వదిలేశారు. అయితే ఈ తప్పిదాలన్నింటినీ జగన్ అడ్డగోలుగా సమర్థించుకుంటూ, కూటమి ప్రభుత్వంపై నిందలేయడానికి ప్రయత్నించారు. తన పాలనలో వర్షాలు సమృద్ధిగా పడడంతో కాలువల్లో 10 వేల క్యూసెక్కుల వరద నీరు వెళ్లే అవకాశం ఉన్నందువల్ల ఆధునీకరణ చేయలేదన్నారు. అలాగే జగన్ సీఎంగా ఉండగా పంటల బీమా పథకం ప్రీమియం సొమ్ములు చెల్లించకుండా ఎగ్గొట్టారు. కానీ అది చంద్రబాబు చెల్లించకపోవడం వల్లే 2023-24 ఖరీఫ్ సీజన్‌కు బీమా పరిహారం అందలేదని వరద ప్రాంతాల పర్యటనలో జగన్ బొంకారు. పంటనష్టాలను యాప్ సహాయంతో చంద్రబాబు ప్రభుత్వం పారదర్శకంగా నమోదు చేస్తుంటే, జగన్ మాత్రం అసలు ఇంకా నమోదు జరగలేదని అబద్ధాలాడారు. అదే సమయంలో చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అక్కసును వెళ్లగక్కారు. చంద్రబాబు డ్రామా ఆర్టిస్ట్ అని, పవన్‌కల్యాణ్ సినిమా ఆర్టిస్ట్ అన్నారు.


ఇదేం పరామర్శ?!

వెళ్లింది వరద బాధితులను పరామర్శించి, పెను విపత్తు కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించి, కష్టంలో ఉన్న ప్రజలను ఓదార్చడానికి! కానీ, జగన్ కాకినాడ జిల్లా పర్యటనలో ఇవేవీ కనిపించలేదు. బాధితులతో పెద్దగా మాట్లాడింది లేదు. కారుదిగి రెండడుగులు కూడా నడవకుండానే రోడ్లపైనే వారితో పొడి పొడిగా మాట్లాడి మమ అనిపించేశారు. ఏలేరు వరదకు అత్యధికంగా పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు మండలం అతలాకుతలం కాగా.. నిరసనలు, నిలదీతల భయంతో ఆ మండలాన్ని కాదని ఆ పక్కనే ఓ మోస్తరు ముంపు ఉన్న పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో పర్యటించారు. వాస్తవానికి ఏలేరు వరద ముంపునకు ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమేనని బాధితుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ సీఎంగా ఉన్న సమయంలో 2022 జూలైలో గొల్లప్రోలులో ఓ సభకు హాజరై ఏలేరు ఆధునీకరణ ఫేజ్1, ఫేజ్2 పనులకు రూ.292 కోట్లు మంజూరు చేస్తున్నట్టు గొప్పగా ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. దీంతో ఏలేరు వరదల్లో 64 గ్రామాలు కకావికలమయ్యాయి. ముంపు తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో పర్యటిస్తే నిరసనలు వస్తాయనే భయంతో పెద్దగా నష్టం లేని పిఠాపురంలోని మాదాపురం, యు.కొత్తపల్లి మండలంలో పాత ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట గ్రామాల్లో జగన్ పర్యటించారు. పైగా ఇందులో రెండు గ్రామాలు పూర్తిగా వైసీపీ ఆధిపత్యం ఉన్న, తన సామాజికవర్గం అధికంగా ఉన్న ప్రాంతాలు కావడం విశేషం. తొలుత మాదాపురం పరిధిలోని శివారులోని తమ ముంపు ప్రాంతాల్లోకి రావాలని స్థానిక వరద బాధితులు ఆహ్వానించగా జగన్ వెళ్లలేదు. బాధితులతో తన కారుపక్కనే నిలబడి పలకరించి వెళ్లిపోయారు. ఆ తర్వాత దారిలో పలు కుగ్రామాలకు (హేమ్‌లెట్స్) వరద ముప్పు లేకపోయినా రోడ్డుపై ఆగి వారికి ముద్దులు కురిపించారు. తర్వాత రమణక్కపేటకు వెళ్లేసరికి వరద పారుతుండడంతో ట్రాక్టర్ ఎక్కి గ్రామంలోకి వెళ్లి బాధితులతో పొడిపొడిగా మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం లేకపోవడం వల్లే ప్రజలకు కష్టాలు వచ్చాయంటూ చెప్పుకొచ్చారు. మరో పక్క జగన్ రాకతో కొందరు వైసీపీ శ్రేణులు నాగులాపల్లి, దారి మధ్యలో పలుచోట్ల బాణసంచా కాల్చడం విశేషం. అసలే బాధల్లో ఉన్న ప్రజలకు మధ్యకు వచ్చిన సమయంలో పార్టీ నేతలు బాణసంచా కాల్చి ఆనందాలు జరపడంపై జగన్ తీరుపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అబద్ధాల్లో జగన్‌రెడ్డి గోబెల్స్‌కు తండ్రి

▸ బుడమేరు, ఏలూరు పాపం ముమ్మాటికీ ఆయనదే


▸ పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోట, సెప్టెంబరు 13: ఏలేరు రిజర్వాయర్ వరదల గురించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, అసత్యాలు వల్లెవేయడంలో ఆయన గోబెల్స్‌కు తండ్రిలా తయారయ్యాడని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదల్లో శవ, బురద రాజకీయాలకు జగన్‌రెడ్డి తెరలేపాడన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఏలేరు ఆధునీకరణకు రూ.58కోట్ల నిధులు మంజూరు చేస్తే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరిట ఆ పనులు నిలిపివేశారన్నారు. జగన్ పాలనలో ఏలేరు ఆధునీకరణ పనులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు ఈ వరదలు వచ్చిఉండేవి కావన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వ హయాంలో బుడమేరుకు రూ.150 కోట్ల మేర నిధులు ఆధునీకరణ కోసం మంజూరు చేస్తే 2020 సెప్టెంబరు 8న జీవో 365 పేరిట పనులు ఆపేయడం జగన్ తప్పిదమే కారణమన్నారు. బుడమేరు, ఏలేరు వరదలు ముమ్మాటికీ జగన్‌రెడ్డి పాపమేనన్నారు. గోదావరి వరదల్లో వందలాది గ్రామాలు నీటమునిగిపోవడానికి కారణం జగన్‌రెడ్డి నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. మ్యాన్ మేడ్ వరదలు అంటూ జగన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఏలేరు మరో 'అన్నమయ్య' కాకుండా కాపాడాం

▸ శవాలు కనిపించలేదని దిగులుపడ్డ జగన్: నిమ్మల ధ్వజం



అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'జగన్ హయాంలో ఆయన సొంత జిల్లాలో అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఇప్పుడు ఏలేరు రిజర్వాయర్‌కు కనీవినీ ఎరుగని స్థాయిలో వరద ప్రవాహం వచ్చింది. ప్రభుత్వ అప్రమత్తత వల్ల ప్రాణ నష్టం జరగలేదు. ఏలేరు మరో అన్నమయ్య డ్యాం కాకుండా కాపాడాం' అని నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం ఆయన విజయవాడలోని ఎన్టీఆర్ కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. బెంగుళూరు నుంచి అంత కష్టపడి వచ్చినా ఏలేరు కింద శవాలు కనిపించలేదని వైసీపీ నేత జగన్ కాకినాడ జిల్లా పర్యటనలో దిగులుపడ్డారని ఎద్దేవా చేశారు. ఏలేరు రిజర్వాయర్‌కు వస్తున్న వరద ప్రవాహంపై ప్రభుత్వం ముందు నుంచి అప్రమత్తతో ఉందని వివరించారు. కట్ట 114 చోట్ల బలహీనంగా ఉందని గుర్తించి, పటిష్టపర్చామని చెప్పారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఇటువంటి అప్రమత్తత లేకుండా నిర్లక్ష్యంగా ఉండటం వల్లే అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయిందని ఆరోపించారు. గతంలో చంద్రబాబు ఇన్‌పుట్ సబ్సిడీ రూ.20 వేలు ఇచ్చేవారని.. దాన్ని జగన్ రూ.16 వేలకు కుదించారని.. టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు దానిని రూ.25 వేలకు పెంచిందని నిమ్మల వివరించారు.

కృష్ణాజలాలపై మాకు హక్కు ఉంది

అమరావతి, హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వినియోగించుకున్నా, కరువు ప్రభావిత ప్రాంతాల్లో కృష్ణా జలాలను వినియోగించుకునే హక్కు తమకు ఉందని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. కృష్ణా బేసిన్‌లో పాత ప్రాజెక్టుల కింద నీటి వినియోగానికి రక్షణ ఉందని, ఆ అంశాన్ని సమీక్షించడం సరికాదని వాదించింది. కృష్ణా జలాలపై తెలంగాణ చేస్తున్న వాదన అంతా తప్పు అని తెలిపింది. ఈ విషయంలో బచావత్ ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయాల్సిందేనని కోరింది. తెలంగాణ వాదిస్తున్నట్లుగా కృష్ణా నదీ జలాల్లో సగం వాటా ఆ రాష్ట్రానికి ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పింది. ఈ నెల 20వ తేదీన కృష్ణా జలాలపై తమ వాదనలను స్పష్టంగా వినిపిస్తామని ఏపీ వెల్లడించింది. అంతకుముందు, రెండు రాష్ట్రాల అభిప్రాయాలను ట్రిబ్యునల్ కోరింది. నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు మాత్రమే కృష్ణా జలాలపై హక్కు ఉంటుందని తెలంగాణ పేర్కొంది. ఈ వాదనను ఏపీ వ్యతిరేకించింది. తెలంగాణ లేవనెత్తిన 46 అంశాలూ వాస్తవం కాదని గురువారం ట్రిబ్యునల్‌కు పంపిన రిజాయిండర్‌లో వాదించింది. ఒకరి వాదనలపై మరొకరు తమ అభ్యంతరాలు వెల్లడించడం ట్రిబ్యునల్ ప్రక్రియలో మూడోదశ అని రాష్ట్ర జల వనరుల శాఖ వర్గాలు తెలిపాయి. ఈ దశలో భాగంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్రాలు తమ వాదనలు వినిపిస్తాయని ఈ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ లేవనెత్తిన అంశాన్నింటిపైనా సవివరంగా తమ అభ్యంతరాలు, హక్కులగురించి స్పష్టం చేశామని ట్రిబ్యునల్‌కు ఏపీ వెల్లడించింది.

లేఖలోని ప్రధానాంశాలు..

1 కరువుపీడిత ప్రాంతమైనందున తాము గోదావరి జలాల వినియోగిస్తున్నా, కృష్ణా నది పరీవాహక ప్రాంతమైనందున కృష్ణా జలాలపై హక్కులుంటాయన్న తెలంగాణ వాదనలో వాస్తవంలేదు. తెలంగాణ కరువు ప్రాంతంగా లేదు. అక్కడి అన్ని ప్రాంతాలూ ఇప్పటికే అభివృద్ధి చెందాయి. - ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, వినియోగంపై కృష్ణా నదీ వివాద ట్రిబ్యునల్-1 రక్షణ కల్పించింది. 1960 నాటికి నిర్మించిన ప్రాజెక్టుల వారీగా రాష్ట్రాలకు నదీ జలాల కేటాయింపు జరిగింది. మిగులు జలాల కేటాయింపు పూర్తిగా రాష్ట్రాలకు ఉన్న అవసరాల ఆధారంగా కేటాయించారు. కృష్ణానదీ ట్రిబ్యునల్ రాష్ట్ర విభజన చట్టంలోనూ నదీజలాల కేటాయింపులపై స్పష్టతను ఇచ్చింది. గత ఏడాది అక్టోబరు ఆరో తేదీన ఈ ట్రిబ్యునల్‌ను కొనసాగిస్తూ కేంద్రం ఆదేశించింది.

1 పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా అస్యూర్డ్ వాటర్‌ను వినియోగించుకునే హక్కు ఆంధ్రాకు ఉంది. చెన్నైకు తాగునీటి అవసరాల కోసం 15 టీఎంసీలు పంపేందుకు కేటాయింపులు ఉన్నాయి. డిపెండబుల్ వాటర్ విషయంలో తెలంగాణకు అభ్యంతరం తెలిపే హక్కేలేదు.

1 కృష్ణా నదీ జలాల వివాద ట్రిబ్యునల్ 1, కృష్ణా నదీ జలాల వివాద ట్రిబ్యునల్ -2 ఇచ్చిన ఆదేశాలను మార్చేందుకు వీలుదేదు. ఇది 1956 చట్టం సెక్షన్ 4(1) ప్రకారం ఉల్లంఘన కిందకు వస్తుంది.

1 రాజకీయ కారణాలతో ట్రిబ్యునల్ తీర్పులను సవరించడం సాధ్యం కాదు. చట్టం మేరకు తెలంగాణ చేసిన వాదనలేవీ చెల్లనేరవు. కృష్ణా నదీ జలాలపై గతంలో ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాల పునఃసమీక్షకు ఆస్కారం లేదు.

1 కృష్ణా నదీజలాల వివాద ట్రిబ్యునల్ నిర్ణయంపై వ్యాఖ్యానించేందుకు వీల్లేదు.

1 తెలుగుగంగ ప్రాజెక్టుకు కేటాయించిన 77 టీఎంసీలు కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోవేనని కృష్ణా నదీ వివాద ట్రిబ్యునల్-2 స్పష్టంచేసింది. గతంలో తెలుగుగంగపై తెలంగాణ చేసిన వాదనను కేడబ్ల్యుడీటీ-2 తోసిపుచ్చింది.

1 కర్ణాటక. మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సంయుక్తంగా చెన్నై నగరానికి తాగునీటి అవసరాలు తీర్చేందుకు తెలుగుగంగ నుంచి జలాలు వదులుతామని అంగీకరించాయి.

1 ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకంలో వివాదం లేదు.

1 కృష్ణాలో తుంగభద్ర అంతర్భాగమే. రాయలసీమ మొత్తం కృష్ణా జలాలపై ఆధారపడి ఉంది.

1 తాగునీటి అవసరాల కోసం 230 టీఎంసీలు కేటాయించాలన్న తెలంగాణ వాదనను వ్యతిరేకిస్తున్నాం.

1 కృష్ణా జలాల కేటాయింపులపై కర్ణాటక, మహారాష్ట్ర అభ్యంతరం చెప్పలేదు. తెలంగాణ వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకునేందుకు వీల్లేదు.

1 తెలంగాణ వాదన ట్రిబ్యునల్ విధివిధానాలను తప్పుదోవ పట్టించేదిగా ఉంది.

సర్వీస్ కోటాపై ప్రతిష్టంభన

» వైద్యులతో ఆరోగ్య శాఖ చర్చలు విఫలం

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ కోటాపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. పాత పద్ధతిలోనే కోటా అమలు చేయాలని వైద్యులు కోరుతున్నారు. అయితే భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సర్వీస్ కోటాను కుదించామని, ప్రభుత్వంపై భారం తగ్గించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తొలిసారి పీహెచ్‌సీ వైద్యులతో చర్చలు జరిపారు. శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టీ. కృష్ణబాబు, కమిషనర్ డాక్టర్ హరికిరణ్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ ఎ.సిరి దాదాపు రెండున్నర గంటల పాటు వైద్యులతో చర్చించారు. జీవో 85 ప్రకారమే సర్వీస్ కోటా అమలు చేస్తామని, ఇందులో ఎలాంటి మార్పు ఉండదని తెల్చిచెప్పారు. చర్చలు కొలిక్కి రాకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని వైద్యులు స్పష్టం చేశారు. అంతకుముందు ఎం.టీ.కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ మూడేళ్ల నుంచి 756 మంది ప్రభుత్వ వైద్యులు పీజీ కోర్సుల్లో ఉన్నారని వివరించారు. పాత జీవో అమలు చేస్తే గతంలో మాదిరిగానే సీట్లు కేటాయించాల్సి వస్తుందని, దాదాపు 1,000మంది పీజీ కోర్సులకు వెళ్తే పీహెచ్‌సీల్లో సేవలకు సమస్యలు వస్తాయని తెలిపారు. వీరంతా పీజీ పూర్తి చేసుకుని తిరిగివచ్చిన తర్వాత స్పెషలిస్ట్ పోస్టులు అందుబాటులో లేకుంటే ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. పీజీ లీన్ (పీజీ చేసే వైద్యుల వేతనం) తీసుకునేవారి సంఖ్య పెరిగితే ప్రభుత్వంపై భారం పెరుగుతుందని తెలిపారు. 2027 నాటికి ఎంతమంది స్పెషలిస్ట్ వైద్యులు అవసరమో దానికి అనుగుణంగా, నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగానే సర్వీస్ కోటాను కుదించామన్నారు. సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైద్యులను కోరారు.

ఆప్షన్-3 ఇళ్ల బిల్లులు నిలిపివేత

» అక్టోబరు నాటికి 50 వేల ఇళ్ల పూర్తికి చర్యలు

» 10 వేల ఇళ్ల శ్లాబులకు 100 రోజుల ప్రణాళిక

» గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లకు కేటాయించిన ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని, ఈ విచారణలో గుర్తించిన లోపాలను సరిదిద్దేవరకు బిల్లుల చెల్లింపులను నిలిపివేస్తున్నట్లు గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆప్షన్-3 ఇళ్ల కాంట్రాక్టర్లు, హౌసింగ్‌ఉన్నతాధికారులతో శుక్రవారం ఆయన విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని జిల్లాల హౌసింగ్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ పేదల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టులు తీసుకుని రెండేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న 50 వేల ఆప్షన్-3 ఇళ్లను అక్టోబరు నెలాఖరులోపు పూర్తి చేయించే బాధ్యతను హౌసింగ్ అధికారులు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. జియో ట్యాగింగ్, ఇతర పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని, జిల్లాల అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలను పూర్తి చేయాలంటూ దిశానిర్దేశం చేశారు. హౌసింగ్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. 100 రోజులు లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 10 వేల ఇళ్ల శ్లాబులను ఈ వారంలోనే పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.

48 గంటల్లో పాస్‌పోర్టులు

సరెండర్ చేయండి

టీడీపీ ఆఫీసు, బాబు ఇంటిపై దాడుల కేసుల్లో..జోగి రమేశ్, అవినాశ్‌కు సుప్రీం ఆదేశం

» వైసీపీ ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, తలశిలకు కూడా

» విచారణాధికారులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లాలి: ధర్మాసనం

» తదుపరి ఉత్తర్వులిచ్చేదాకా పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశం


జోగి రమేశ్


దేవినేని అవినాశ్


లేళ్ల అప్పిరెడ్డి


తలశిల రఘురాం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై దాడి, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసుల్లో వైసీపీ నేతలు జోగి రమేశ్, దేవినేని అవినాశ్, ఒగ్గు గవాస్కర్, ఆ పార్టీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం తమ పాస్‌పోర్టులను 48గంటల్లో దర్యాప్తు అధికారులకు సరెండర్ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పోలీసుల విచారణకు సహకరించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వారి ముందు హాజరు కావాలని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు పిటిషనర్లపై ఎలాంటి చర్యలూ వద్దని పోలీసులకు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అవినాశ్, అప్పిరెడ్డి, తలశిల.. చంద్రబాబు ఇంటిపై కేసులో జోగి రమేశ్‌తోపాటు మరికొందరిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం వారు దాఖలు చేసిన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆ తీర్పును ఈ నెల 9న అవినాశ్, అప్పిరెడ్డి, తలశిల, ఒగ్గు గవాస్కర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అలాగే.. తనకు న్యాయం చేయాలని ఈ నెల 10న జోగి రమేశ్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, నీరజ్ కిషన్ కౌశల్, అల్లంకి రమేశ్.. రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు. వైసీపీ నేతల దాడులకు సంబంధించిన సీసీ ఫుటేజీలను రోహత్గీ, లూథ్రా న్యాయస్థానానికి అందించారు. వాటిని తర్వాత పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. దేవినేని అవినాశ్ గతంలో విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నించారని రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం.. 48 గంటల్లో పాస్‌పోర్టులు సరెండర్ చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఇంకా జగన్ జపమేనా

(మొదటి పేజీ తరువాయి)

మార్పు రావడం లేదు. ప్రభుత్వ రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, భూమి డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లపై జగన్ ఫొటోలు వద్దని, అలా ఉన్నవాటిని ప్రజలకు అందించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు పదేపదే హితబోధ చేసినా వాళ్ల మారడం లేదు. జగన్ జపమే చేస్తామంటూ స్వామి భక్తి చాటుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకున్న ఉదంతమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. వత్సవాయి మండలం దుబ్బాకపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు సర్టిఫైడ్ అడంగల్ కాపీ ఇవ్వాలని గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. మండల తహసీల్దార్ ఇచ్చిన సర్టిఫైడ్ కాపీని గ్రామ సచివాలయం నుంచి ఆ రైతుకు 12వ తేదీన జారీ చేశారు. దాన్ని పరిశీలిస్తే ఎగువ కుడిభాగంలో జగన్ చిరునవ్వులు చిందిస్తున్న ఫొటో, నవరత్నాల లోగో ఉంది. దానిపై తహసీల్దార్ పేరు, సంతకం కూడా ఉన్నాయి. జగన్ ప్రభుత్వంలో సర్టిఫికెట్లు, పట్టా పుస్తకాలపై ఆయన ఫొటోలు నింపేసిన సంగతి తెలిసిందే. చివరకు ఆస్పత్రుల్లో అత్యవసర చికిత్స కోసం చేరిన పేషంట్ల కోసం రూపొందించే చీటీలు, రికార్డుల్లోనూ జగన్ బొమ్మలేశారు. భూముల సర్వే అనంతరం రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలపై కూడా జగన్, రాజశేఖరరెడ్డి ఫొటో, పేరుతో పాటు నవరత్నాల లోగోలు ముద్రించారు. వీటిని చూసి రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమకు వారసత్వంగా వచ్చిన భూముల పట్టాలపై జగన్ బొమ్మలేమిటి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరయితే ఆ పట్టా పుస్తకాలను తీసుకునేందుకు నిరాకరించారు. మరికొందరు ఆ పుస్తకాలను బహిరంగంగానే చింపేసి తగలబెట్టారు.

చంద్రబాబు ఆదేశించినా...

తమ ప్రభుత్వం వస్తే పాస్‌పుస్తకాలు, ప్రభుత్వ రికార్డులు, సర్టిఫికెట్లపై ఉన్న జగన్ బొమ్మలు తొలగిస్తామని ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా చంద్రబాబు ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. రైతులకు ఇచ్చే పాసుపుస్తకాలు, విద్యార్థులకు ఇచ్చే ధ్రువీకరణ పత్రాలపై జగన్ ఫొటోలు తొలగించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రైతులకు ఇచ్చి ఉంటే వాటి ని వెనక్కి తీసుకోవాలని, రైతులకు రాజముద్ర ఉన్న పాసుపుస్తకాలే ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు. ఇది జరిగి మూడు నెలలవుతోంది. అయినా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇచ్చే రెవెన్యూ ధ్రువీకరణ పత్రాలు, సర్టిఫికెట్లపై ఇంకా జగన్ బొమ్మలే కనిపిస్తున్నాయి. అంటే.. ముఖ్యమంత్రి ఆదేశాలు ఈ శాఖకు వర్తించడం లేదా? లేక సీఎం ఆదేశాలంటే లెక్కలేక ఇలాంటి పనులు చేస్తున్నారా? అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలతో జగన్ బొమ్మలున్న రికార్డులను వెనక్కి తీసుకోవాలని, ఆ పేరిట పుస్తకాలు, సర్టిఫికెట్లు ఇవ్వకూడదని సాధారణ పరిపాలన శాఖ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. సీఎస్ పేరిట ఆదేశాలు ఆయా శాఖలకు వెళ్లాలి. కానీ ఇప్పటిదాకా సీఎస్ అలాంటి ఆదేశాలు ఇవ్వలేదని తెలిసింది. రెవెన్యూ శాఖ అయినా ఇవ్వాలి. కానీ ఆ శాఖ స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వలేదని అధికార వర్గాలే చెబుతున్నాయి. జగన్ ఫొటోలు వద్దని ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు సమన్వయం చేసుకొని వాటిని అమలు చేయాలి. కానీ తాజా పరిణామాన్ని పరిశీలిస్తే సమన్వయలోపం కనిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కనీసం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ అయినా ఈ అంశంపై దృష్టిసారించాల్సి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

గనుల వెంకటరెడ్డి కోసం విస్తృత గాలింపు

» మూడు చోట్ల ఏసీబీ సోదాలు

» గనుల శాఖ కార్యాలయంలోనూ తనిఖీలు.. కీలక పత్రాలు స్వాధీనం

అమరావతి/రాయచోటి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాలో అవకతవకలకు సంబంధించి గనుల శాఖ మాజీ డైరెక్టర్, మాజీ సీఎం జగన్‌కు ఆత్మీయుడైన వీజీ వెంకటరెడ్డి కోసం ఏసీబీ ముమ్మరంగా గాలిస్తోంది. ఆయనపై గురువారం కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఏసీబీ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఏపీ, తమిళనాడు, తెలంగాణల్లో జల్లెడ పడుతున్నారు. గురువారం రాత్రి, శుక్రవారం చెన్నై, తిరుపతి, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు, కొర్లకుంట తదితర గ్రామాల్లోని ఆయన నివాసాల్లో సోదాలు జరిపారు. రైల్వేకోడూరులో ఆయన అత్తగారింట్లో తనిఖీలు చేసి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. మంగంపేట ముగ్గురాళ్ల కుంభకోణంలోనూ ఆయన పాత్ర ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి కూడా సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. వైసీపీ అధికారంలో ఉండగా.. ఓబులవారిపల్లె మండలం మంగంపేట ఏపీఎండీసీ గనుల్లో కోట్ల రూపాయల ముగ్గురాళ్లను వైసీపీ నాయకుడికి చెందిన ఓ పల్వరైజింగ్ మిల్లుకు అక్రమంగా రాత్రికి రాత్రే తరలించారు. అయితే విజిలెన్స్ అధికారులు పరిశీలించి.. ఒక లారీలో మాత్రమే రాళ్లను తరలించారని, వాటిని స్వాధీనం చేసుకున్నామని బుకాయించారు. ఇక్కడ ఇతర జిల్లాలకు చెందిన 300మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు వెంకటరెడ్డిపై ఉన్నాయి. సోదాలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని ఏసీబీ అధికారి గిరిధర్ తెలిపారు.

గనుల శాఖ ఆఫీసులో కీలక సమాచారం!

ఏసీబీ అధికారులు వెంకటరెడ్డి సమీప బంధువుల నివాసాల్లోనూ తనిఖీలు చేశారు. గనుల శాఖ కార్యాలయంలో కూడా పలు రికార్డులను పరిశీలించి వెంట తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పలు కీలక సమాచారం లభించినట్లు తెలిసింది. ఇసుక కాంట్రాక్టు, నిర్వహణలో రూ.2,500 కోట్ల మేర అవినీతి, అక్రమాలు జరిగినట్లుగా ఏసీబీ ఇప్పటికే గుర్తించింది. ఈ కేసులో మరింత విచారణ చేపట్టేందుకు వెంకటరెడ్డిని ప్రశ్నించాల్సి ఉంది. కానీ ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గనుల శాఖలో ఆయన సన్నిహితులైన అధికారులను ఏసీబీ విచారించినట్లు తెలిసింది. వీరిలో ముగ్గురు ఆయనతో అంటకాగిన ఉన్నతాధికారులు, ఇద్దరు సూపరింటెండెంట్లు, ఇద్దరు పీఏలు, ఓ కన్సల్టెన్సీ ఉద్యోగి సహా ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు ఉన్నారు. వెంకటరెడ్డి ఆదేశిస్తేనే ఫైళ్లు పెట్టామని, ఇందులో తమ సొంత ప్రయోజనాలేమీ లేవని వీరు ఏసీబీకి చెప్పినట్లు తెలిసింది. బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలన్న ప్రతిపాదనపై లిఖితపూర్వకంగా అసమ్మతి(డిసెంట్) ఎందుకు నమోదు చేయలేదన్న ప్రశ్నకు వారుబదులివ్వలేదు. కాగా వెంకటరెడ్డి నివాసం, ఆయన బంధువుల ఇళ్లలో సోదాల్లో ఎక్కడా ఏ ఒక్క ఆధారం, డేటా కనిపించకుండా ముందుగానే క్లియర్ చేసుకున్నారని ఏసీబీ అధికారులు గుర్తించారు. బంధువుల ఫోన్లను పరిశీలించగా.. ఆయనపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తలు తప్ప మరేమీ లేకుండా, ఎలాంటి ఇతర సమాచారం కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తేలింది. ఫోన్లను కూడా ముందుగానే క్లీన్ చేసుకున్నారని తెలిసింది.

ఇసుక అక్రమాలు రూ.2,566 కోట్లపైనే: ఏసీబీ

ఇసుక అక్రమాల్లో రూ.2566 కోట్లపైనే అక్రమాలు జరిగాయని ఏసీబీ ప్రకటించింది. గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఇసుక తవ్వకం కంపెనీలతో కలిసి కుట్రలుచేసి ప్రభుత్వానికి తీవ్రనష్టం చేకూర్చారని, ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేశారని శుక్రవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయనపై అవినీతి నిరోధక చట్టం(సవరణ)-2018, ఐపీసీ, గనుల, ఖనిజాల చట్టం-1957లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపింది. 'విచారణలో భాగంగా వెంకటరెడ్డి నివాసాలతోపాటు విజయవాడలోని జీసీకేసీ ప్రాజెక్ట్స్, ప్రతిమ ఇన్‌ఫ్రా ఆఫీసుల్లో సోదాలు జరిపాం. పలు కీలక అంశాలు వెలుగుచూశాయి. ప్రైవేటు సంస్థలు అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా భారీ యంత్రాలు ఉపయోగించి లీజు పరిధి దాటి ఇసుక తవ్వకాలు జరిపాయి. పర్యావరణాన్ని దెబ్బతీశాయి. జేపీ వెంచర్స్ లిమిటెడ్, జీసీకేసీ ప్రాజెక్ట్స్, ప్రతిమ ఇన్‌ఫ్రా వంటి కంపెనీలతో వెంకటరెడ్డి చేతులు కలిపి కుట్ర చేశారు. వెంకటరెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడారు. కుట్రపూరితంగా జేపీ వెంచర్స్‌కు 120కోట్ల బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారు. ఇది నేరపూరిత ద్రోహం. ఆయన తన చర్యల ద్వారా జేపీ వెంచర్స్, ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలను లాభపరిచి ప్రభుత్వాన్ని నష్టపరిచారు' అని ప్రకటనలో వెల్లడించింది.

'పట్టభద్ర' బరిలో టీడీపీ!

» కృష్ణా-గుంటూరు, గోదావరి ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీకి నిర్ణయం

» జిల్లాల నేతలతో అధ్యక్షుడు పల్లా టెలికాన్ఫరెన్స్

» అభ్యర్థులపై అభిప్రాయాలు చెప్పాలని సూచన

» ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు టీడీపీ దూరం?

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరిగే రెండు పట్టభద్ర ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో పోటీ చేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. కృష్ణా, గుంటూరు జిల్లాలకు కలిపి ఒక సీటు.. ఉభయ గోదావరి జిల్లాలకు కలిపి మరో సీటుకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ రెండు సీట్ల పరిధిలో కొత్త ఓటర్ల చేరికకు ఎన్నికల కమిషన్ ఇటీవల షెడ్యూల్ ప్రకటించింది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పోలింగ్ షెడ్యూల్ వెలువడుతుంది. గత ఏడాది ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్రంలో మూడు పట్టభద్ర ఎమ్మెల్సీ సీట్లకు ఎన్నికలు జరిగితే టీడీపీ ఈ మూడు సీట్లనూ మంచి మెజారిటీతో గెలుచుకుంది. ఈ ఫలితాల ద్వారా రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఏడాది ముందే తేటతెల్లమైంది. వాటిని గెలుచుకున్న అనుభవంతో కృష్ణా-గుంటూరు, గోదావరి సీట్లను కూడా గెలుచుకోవాలని టీడీపీ పట్టుదలగా ఉంది. శాసన మండలిలో ప్రస్తుతం టీడీపీ సంఖ్యాబలం తక్కువగా ఉంది. దానిని పెంచుకోవడానికి ఈ సీట్లలో గెలుపు ఉపయోగపడుతుందని భావిస్తోంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ నిర్ణయాన్ని వారికి వివరించి అభ్యర్థులు ఎవరైతే బాగుంటుందో సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. స్థానికంగా నేతలతో సంప్రదింపులు జరిపి సమన్వయం చేసే బాధ్యతను ఉభయ గోదావరి జిల్లాల్లో మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్‌కు.. కృష్ణా, గుంటూరు జిల్లాల బాధ్యతను అక్కడి మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్‌కు అప్పగించారు. జిల్లాల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత కొద్ది రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. బరిలో దిగేందుకు నేతలు పెద్దసంఖ్యలోనే ఆసక్తి ప్రదర్శిస్తుండడంతో పోటీ నెలకొంది. ఉభయ గోదావరి జిల్లాల నుంచి పోటీ మరీ ఎక్కువగా ఉన్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరిలో మెట్ల వెంకటరమణ, చెరుకూరి సాయిరాం, గుణ్ణం చంద్రమౌళి, కటకంశెట్టి సత్య ప్రభాకర్, బొడ్డు వెంకటరమణ, పేరాబత్తుల రాజశేఖర్, అక్కల రిశ్వంత్ రాయ్, బోళ్ల వెంకట కృష్ణప్రసాద్.. పశ్చిమ గోదావరిలో ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో రామరాజుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కృష్ణా-గుంటూరు స్థానాన్ని గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, తెలుగు యువత నాయకుడు రావిపాటి సాయికృష్ణ, కృష్ణా జిల్లాలో గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు ఆశిస్తున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ (యూటీఎఫ్) మరణం వల్ల ఖాళీ అయిన సీటుకు కూడా త్వరలో ఉపఎన్నిక జరుగనుంది. ఈ ఎన్నికలో మాత్రం పోటీ చేయరాదని టీడీపీ నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఏ ఉపాధ్యాయ సంఘానికైనా మద్దతు ఇస్తుందా లేక తటస్థంగా ఉంటుందా అన్నది చూడాల్సి ఉంది. తటస్థంగా ఉండేందుకే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది.

నందిగం సురేశ్‌కు పోలీసు కస్టడీ

మంగళగిరి, సెప్టెంబరు 13: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేసిన కేసులో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీసు కస్టడీలో విచారించేందుకు కోర్టు అనుమతించింది. 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 17వ తేదీ మధ్యాహ్నం 12 వరకు ఆయన్ను పోలీసు కస్టడీకి ఇస్తూ మంగళగిరి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కె.సురేశ్‌బాబు శుక్రవారం ఆదేశాలు జారీచేశారు. ఆయన్ను మంగళగిరి పోలీసు స్టేషన్‌లో న్యాయవాది సమక్షంలో విచారించాలని స్పష్టం చేశారు. ఈ దాడిలో సురేశ్ కీలక పాత్ర అని పోలీసులు భావిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఆ పార్టీ నేత దేవినేని అవినాశ్‌తో కలిసి కుట్ర పన్ని టీడీపీ ఆఫీసుపైకి వైసీపీ మూకలను పంపించారనడానికి ఇప్పటికే వారు ప్రాథమిక ఆధారాలు సంపాదించినట్లు తెలిసింది. గత విచారణ సందర్భంగా సురేశ్ సహకరించలేదని.. మరోసారి తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు అనుమతించడంతో ఆయన్ను ప్రశ్నించి వివరాలు రాబట్టేందుకు సమాయత్తమవుతున్నారు.

హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా

జస్టిస్ రవినాథ్ తిల్హారి



అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి నియమితులయ్యారు. ఈ నియామకానికి సంబంధించి ప్రభుత్వం ఈ నెల 11న గెజిట్ ప్రచురించింది. ఏపీ హైకోర్టు సీజే, ఏపీ న్యాయసేవాధికార సంస్థ పాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నిర్ణయం మేరకు ఈ నియామకం చేపట్టారు.

స్టేట్ బోర్డులోకి సీబీఎస్ఈ విద్యార్థులు

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వెయ్యి సీబీఎస్ఈ పాఠశాలల్లోని విద్యార్థులను స్టేట్ బోర్డులోకి మారుస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వారి భవిష్యత్తు దృష్ట్యా ఈ ఏడాదికి వారిని స్టేట్ బోర్డులోనే పరీక్షలు రాయించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిపై ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం జీవో జారీచేశారు. వెయ్యి పాఠశాలల్లో 76,990 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారు ఈ ఏడాది సీబీఎస్ఈ బోర్డులో పరీక్షలు రాయాల్సి ఉందని వివరించారు.

ఐ-ప్యాక్ పోయింది..

ప్యాక్ మిగిలింది!

» వైసీపీ రాజకీయ సలహా కమిటీ సభ్యుడిగా పెద్దిరెడ్డి

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఐ-ప్యాక్ పోయింది. ఇప్పుడు పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ (ప్యాక్) మాత్రమే మిగిలింది. ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్యాక్ సభ్యుడిగా శుక్రవారం నియమించారు. దీంతో ఐ-ప్యాక్ టీంకు, దాని వ్యవస్థాపకులైన ప్రశాంత్ కిశోర్, రిషిరాజ్ సింగ్‌లకు పూర్తిగా ఉద్వాసన పలికినట్లయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్ష బాధ్యతలనూ పెద్దిరెడ్డికి కట్టబెట్టారు. బీజేపీ అనుబంధ విభాగానికి చెందిన ఆళ్ల మోహన్ సాయిదత్‌ను ఇటీవల పార్టీ నిర్మాణం కోసం సలహాదారుగా జగన్ నియమించిన సంగతి తెలిసిందే.

వైసీపీకి నలుగురు అధికార ప్రతినిధులు

వైసీపీ అధికార ప్రతినిధులుగా టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జూపూడి ప్రభాకరరావు, మాజీ మంత్రి ఆర్కే రోజా, ఆరె శ్యామలను నియమిస్తూ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రోజా, జూపూడి టీడీపీపై అడ్డగోలుగా విరుచుకుపడేవారు. ఇప్పుడు ఆ స్థాయిలో పాలకపక్షంపై రాజకీయ దాడి చేస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ముందుకొస్తున్న ఆప్త హస్తాలు



భాష్యం విరాళం రూ.4 కోట్లు

భాష్యం పేరమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ భారీ విరాళాన్ని ప్రకటించింది. ట్రస్టు తరఫున భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, రామకృష్ణ తనయుడు భాష్యం సాకేతరామ్ తదితరులు రూ.4 కోట్లు విరాళం చెక్కును సీఎం చంద్రబాబుకు అందించారు.



ఎస్ఆర్ఎం వితరణ రూ.3 కోట్లు

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్, ఎస్ఆర్ఎం ట్రస్టీ బాలాజీ సత్యనారాయణన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ప్రొఫెసర్ డి.నారాయణరావు, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్ బృందం శుక్రవారం సీఎం చంద్రబాబును కలిసి రూ.3 కోట్లు చెక్కును అందించింది.

» సీఎంఆర్ఎఫ్‌కు కొనసాగుతున్న విరాళాలు

» ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 2 కోట్లు, వసుధ ఫౌండేషన్ కోటి

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బుడమేరు ముంపు కష్టాలను చూసి చలించని హృదయం లేదు. వారిని ఆదుకోవడానికి ఆప్త హస్తాలు ముందుకొస్తూనే ఉన్నాయి. శుక్రవారం పలువురు రాజకీయ నేతలు, పారిశ్రామిక వేత్తలు, దాతలు సీఎం చంద్రబాబును కలిశారు. విరాళం చెక్కులను అందించారు. వారందరికీ ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.2 కోట్లు, బెకామ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ అధినేత బొల్లినేని కృష్ణమోహన్ రూ.1.25 కోట్లు, తులసీ సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత తులసీ రామచంద్రప్రభు రూ.కోటి, విశాఖపట్నం పోర్టు ట్రస్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, ఇతర అధికారులు రూ.కోటి విరాళాన్ని... కలెక్టర్ ఎంఎన్ హరేంధిర్ ప్రసాద్‌కు అందించారు.

వసుధ ఫౌండేషన్ విరాళం

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామానికి చెందిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.కోటి చెక్కును సీఎం చంద్రబాబుకు అందించారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు...

ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్, రిటైర్డ్ ఉద్యోగులు రూ.50లక్షలు, మాజీ ఎంపీ, టీడీపీ సీనియర్ నేత కంభంపాటి రామ్మోహన్‌రావు రూ.50లక్షలు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా డైరెక్టర్ కేవీఎల్వీ రాజు, ప్రెసిడెంట్ ఏఎస్ వీరారెడ్డి హోం మంత్రి అనిత ద్వారా రూ.50 లక్షలు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ రూ.32.49 లక్షలు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్, ప్రసాద్ కన్‌స్ట్రక్షన్స్ తరఫున ఎస్ ప్రసాదరాజు రూ.25లక్షలు అందించారు. నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి రూ.25లక్షల విరాళం డీడీని స్పీడ్‌పోస్టులో పంపారు. తణుకు మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా కుమారుడు యలమర్తి అవినాష్ రూ.20 లక్షలు, జయలక్ష్మీ ఫర్టిలైజర్స్ రూ.20 లక్షలు, సిరి సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అరిమిల్లి వివేకానంద రూ.10 లక్షలు, చుండూరి మధుసూదన్‌రావు రూ.10 లక్షలు, శ్రీకాంత్ ఫ్లోర్ ఇండస్ట్రీస్ తరుపున శ్రీకాంత్ రూ.5 లక్షలు, ఏలూరు రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తరఫున కే సాయి రోహిత్ రూ.5 లక్షలు, మీసేవా ప్రతినిధులు రూ.5 లక్షలు, ఎక్స్ సైనిక్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున వెంకటరెడ్డి రూ.3.30 లక్షలు, డాక్టర్ శివప్రసాద్ హార్ట్ క్లినిక్స్ తరఫున పీ రోసీ శిరీష్ రూ.3 లక్షలు, కనగదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ రూ.3 లక్షలు సీఎంకు అందజేశారు.

గాజులు ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే


సీపీఎం మాజీ ఎమ్మెల్యే పుతుంబాక భారతి తన వంతు సాయంగా మూడు బంగారు గాజులను సీఎం చంద్రబాబుకు అందించారు. అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ హైదరాబాద్ తరఫున టీఎంబీ బుచ్చిరాజు రూ.2 లక్షలు, ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య రూ.2లక్షలు, ఎస్ లక్ష్మీనారాయణ రూ.2 లక్షలు, డీ దశరథ రామానాయుడు రూ.లక్షా 23వేలు, తెనాలి వాకర్స్ క్లబ్ రూ.లక్షా 15 వేలు, కేపీఆర్ రాజేశ్వరీ రూ.లక్షా 11 వేలు, ఆర్ నరసింహారెడ్డి రూ.లక్షా 10వేలు, రాజోలు బీవీ రామకృష్ణ అండ్ స్కూల్ చిల్డ్రన్స్, నలందా స్కూల్ రూ.లక్ష, ఎం సరిత రూ.లక్ష, పీ రామమూర్తి రూ.లక్ష, ఎం.సుబ్బారాయుడు రూ.లక్ష, వెర్సిటీ సేఫ్టీ సొల్యూషన్స్ కే శ్రీనివాస్ రూ.లక్ష, కోనేరు చైతన్య కృష్ణ రూ.లక్ష, గుంటూరు జిల్లా ల్యాబ్ ఎక్స్‌రే ఓనర్స్ అసోసియేషన్ రూ.లక్ష, కే బాలసాయికృష్ణ రూ.50 వేలు చంద్రబాబుకు అందించారు. హైకోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అక్కిన వేణుగోపాలరావు ఉద్యోగుల బేసిక్ పే నుంచి ఒకరోజు వేతనం, వీఆర్వోల అసోసియేషన్ తరఫున ఒకరోజు వేతనానికి సంబంధించిన లేఖలను డీహెచ్ రవీంద్రరాజు సీఎంకు అందజేశారు. వీఆర్‌ఓలు ఒకరోజు బేసిక్ పేను అందించాలని నిర్ణయించారు.

లోకేశ్‌కు అందించిన విరాళాలు

మంత్రి లోకేశ్‌కు తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ నేతృత్వంలో సేకరించిన రూ.1,63,77,261 విరాళాన్ని అందజేశారు. గుంటూరుకు చెందిన సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఎండీ, సెక్రటరీ భీమనాథం భరత్‌రెడ్డి, శివశిరీష రూ.10 లక్షలు, విజయవాడకు చెందిన ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.10 లక్షలు, గుంటూరుకు చెందిన పీఎస్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత బీ.శ్రీనివాసరావు రూ.5 లక్షలు, విజయవాడకు చెందిన మొక్కపాటి సత్యనారాయణ రూ.2,42,764, గుంటూరుకు చెందిన ఆరుషి ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ అధినేత యెండ్లూరి సత్యనారాయణ రూ.లక్ష అందజేశారు.


మంత్రి లోకేశ్‌కు రూ.కోటి 63 లక్షల చెక్కును అందజేస్తున్న తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ తదితరులు


రూ.కోటి చెక్కు అందిస్తున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు


రూ.50 లక్షల చెక్కు అందజేస్తున్న మాజీ ఎంపీ కంభంపాటి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అగ్నిమాపక సేవలు ప్రశంసనీయం

- అగ్నిమాపక శాఖ డీజీ ప్రతాప్
- వరదల్లో సేవలందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాల అందజేత



సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీ ప్రతాప్

విద్యాధరపురం, సెప్టెంబరు 12: వరద ముంపు ప్రాంతాల్లో అగ్నిమాపకదళం సేవలు ప్రశంసనీయమని అగ్నిమాపకశాఖ డీజీ ప్రతాప్ అన్నారు. శుక్రవారం భవానీపురం స్వాతిరోడ్డులో వరద ముంపు ప్రాంతాల్లో సేవలు అందించిన అగ్నిమాపకదళం సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. వరద ముంపు ప్రాంతాల్లో అగ్నిమాపకదళం అందించిన సేవలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా డీజీ ప్రతాప్ మాట్లాడుతూ నగరంలోని 32 వార్డులు బుడమేరు ముంపులో పది రోజులపాటు ఉన్నాయని తెలిపారు. తనకు తెలిసి ఇంతటి విపత్తు రావటం ఇదే తొలిసారని వ్యాఖ్యానించారు. ముంపు ప్రాంతాల ప్రజలను రక్షించడంలో అగ్నిమాపక దళం కీలకపాత్ర పోషించదని తెలిపారు. 1.25 లక్షల మందికి అవసరమైన మందులు, ఆహారం అందించామన్నారు. 13 వేల మందిని వరద ముంపు నుంచి బయటకు తీసుకువచ్చామని తెలిపారు. మరోవైపు వరద నీరు తగ్గిన తర్వాత 111 శకటాలు 1,301 సిబ్బందితో ఇళ్లు, రోడ్లను శుభ్రం చేయటంలో విశేషంగా పనిచేశామని చెప్పారు. వరద ముంపునకు గురైన 75,700 ఇళ్లను శుభ్రం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆ శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పి. వెంకటరమణ, డి.మురళీ మోహన్, పి.ఉదయకుమార్, జి.శ్రీనివాస్, ఆర్.జ్ఞానసుందరం, ఈ. స్వామి, ఎ.వి.శంకరరావు, స్థానిక కూటమి నేతలు సుబ్బారెడ్డి, పి.వి.చినసుబ్బయ్య పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



రాణిగారితోట, సెప్టెంబర్13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి చిత్రపటానికి రాణిగారితోటలోని సుందరయ్య గ్రంథాలయంలో 17వ డివిజన్ సీపీఎం శాఖ శుక్రవారం ఘనంగా నివాళులర్పించింది. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మార్క్సిస్టు మేధావిని కార్మిక, కర్షకలోకం కోల్పోయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, వెంకటేశ్వరరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయి ఆటకట్టు

పోలీసులకు అప్పగించిన ఐఏఎస్ అధికారి

విజయవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువతిని వేధించడమే కాకుండా ఆమెపై చేయిచేసుకున్న ఆకతాయిని ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కృష్ణాజిల్లా పమిడిముక్కలకు చెందిన శ్రీకాంత్ అనే యువకుడు విజయవాడలో కూలీ పనుల కోసం వచ్చాడు. మద్యం తాగి నిర్మల కాన్వెంట్ జంక్షన్ పక్కన ఉన్న సర్వీసు రోడ్డులో నడిచి వెళ్తున్నాడు. ఇక్కడే ఓ హాస్టల్‌లో ఆయాగా పనిచేస్తున్న మహిళ జక్కంపూడి కాలనీ నుంచి హాస్టల్‌కు వస్తోంది. ఇటీవల వచ్చిన వరదలకు ఆమె ఇల్లు మునిగిపోయింది. ఆ ఇంటిని చూసుకుని ఆమె స్కూటర్‌పై హాస్టల్‌కు వస్తోంది. ఎదురుగా వెళ్లిన శ్రీకాంత్ ఆమెను టీజ్ చేశాడు. ఆమె ఎదురు తిరగడంతో చెంపపై చేయి చేసుకున్నాడు. దీనితో ఆమె అతడిపై తిరిగి చేయి చేసుకుంది. ఆ సమయంలో సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి వెళ్తున్నారు. ఆ కాన్వాయ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న ఆ దృశ్యాన్ని చూసి పోలీసు అధికారులకు ఫోన్‌లో సమాచారం చెప్పారు. పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్‌కిషోర్ తన సిబ్బందితో వెంటనే నిర్మల కాన్వెంట్ జంక్షన్‌కు చేరుకున్నారు. శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



వరద నీరు తరలింపు

వన్‌టౌన్, సెప్టెంబరు 13: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వరద ప్రాంతాల్లో ఉన్న నీరును త్వరగా బయటకు పంపేందుకు సంబంధిత శాఖల అధికారులు రెండు రోజుల నుంచి కండ్రిక, ముస్తాబాద రోడ్లకు గండిపెడుతున్నారు. బుడమేరు వరద కారణంగా కండ్రిక, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్, సుందరయ్య నగర్, తదితర ప్రాంతాల్లో భారీగా నీరు చేరింది. ముస్తాబాద రోడ్డు సమీప ప్రాంతాలలో వరద నీరు భారీగా నిలిచింది. ఈ నీరు బయటకు వెళ్లటానికి వీలు లేకపోవటంతో గత కొన్ని రోజుల నుంచి అక్కడే నిలిచిపోయింది. ఈ ప్రాంతాలను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు సంబంధిత విభాగాల శాఖల మంత్రులు పర్యటించి పరిశీలించారు. వరదనీటిని త్వరగా బయటకు పంపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా కండ్రిక, సాయిబాబు గుడి, వాటర్ ట్యాంక్, మరొకచోట రోడ్లకు అధికారులు గండ్లుపెట్టి నీటిని బయటకు పంపుతున్నారు. ముస్తాబాద రోడ్డుకు కూడా గండిపెట్టి అక్కడ ఉన్న వరద నీటిని బయటకు పంపుతున్నారు. కండ్రిక వద్ద రోడ్డుకు గండి పెట్టటంతో విజయవాడ నుంచి నున్నకు వెళ్లే రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నున్న వెళ్లేవారు కండ్రిక ప్రాంతం లోపల పాతపాడు రోడ్డులోకి వెళ్లి నూతనంగా నిర్మించిన బైపాస్ రోడ్డుమీదుగా నున్నకు వెళుతున్నారు. సంబంధిత అధికారులు కండ్రిక వద్ద తవ్విన రోడ్డు ప్రదేశాలలో పర్మినెంట్‌గా తూములు ఏర్పాటు చేసే పనులు వేగవంతంగా చేస్తున్నారు. ఈ పనులు శనివారం ఉదయానికి పూర్తికానున్నాయి.

బ్యారేజ్‌కు బోట్ల గండం

ప్రకాశం బ్యారేజ్‌కి బోట్ల గండం పొంచి ఉంది. వరదలు వచ్చిన ప్రతీసారి ఎగువ ప్రాంతం నుంచి ఇసుకను రవాణా చేసే కార్గో బోట్లు కొట్టుకొస్తున్నాయి. బ్యారేజ్ గేట్లను బలంగా ఢీకొంటున్నాయి. ఈ ఘటనల్లో గేట్ల వెనుక భాగంలోని వెయిట్లు ధ్వంసమవుతున్నాయి. ప్రమాదానికి ఆజ్యం పోస్తున్నాయి. ప్రభుత్వానికి భారీగా నష్టం కలిగిస్తున్నాయి. ఈ పరిణామాలు ఇరిగేషన్ అధికారులకు కంటిమీద కునుకులేకుండా చేసుస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

వరదలకు కొట్టుకొస్తున్న కార్గో బోట్లు

- 2019లో 68వ నంబరు గేటు వద్ద ఇరుక్కున్న బోటు
- ఈ ఏడాది మూడు కౌంటర్ వెయిట్లను ఢీ కొట్టిన బోట్లు
- వరుస ఘటనలతో జలవనరుల శాఖ ఇంజనీర్లలో ఆందోళన

2019 లో..

- ప్రకాశం బ్యారేజ్‌కి సుమారుగా 10లక్షల క్యూసెక్కుల వరదొచ్చింది. ఈ ఉధృతికి గొల్లపూడి వైపు నుంచి ఒక బోటు కొట్టుకొచ్చింది. సరిగ్గా 68వ నంబరు గేటుకు మధ్యలో ఇరుక్కుపోయింది. వారం రోజులకుపైగా శ్రమించి ఎన్నో ప్లాన్‌లు అమలు చేస్తే బోటు బయటకొచ్చింది. ఇప్పటికీ ఈ బోటు బ్యారేజ్ కార్యాలయం వద్ద నదిలో కనిపిస్తోంది.

2024 లో..

- ప్రకాశం బ్యారేజ్‌కి సుమారుగా 10లక్షల క్యూసెక్కుల వరదొచ్చింది. ఈ ఉధృతికి గొల్లపూడి వైపు నుంచి ఒక బోటు కొట్టుకొచ్చింది. సరిగ్గా 68వ నంబరు గేటుకు మధ్యలో ఇరుక్కుపోయింది. వారం రోజులకుపైగా శ్రమించి ఎన్నో ప్లాన్‌లు అమలు చేస్తే బోటు బయటకొచ్చింది. ఇప్పటికీ ఈ బోటు బ్యారేజ్ కార్యాలయం వద్ద నదిలో కనిపిస్తోంది.

గత ఐదేళ్లలో బ్యారేజ్ నిర్వహణ నిధులు సున్నా

వరదలు వచ్చినప్పుడు నగరంలో ఏ ప్రాంతం మునుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతుంటే.. ప్రకాశం బ్యారేజ్‌కు ఏ ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందోనని జలవనరుల శాఖ అధికారులు భయపడుతున్నారు. 2019లో ఒక ప్రమాదం త్రుటిలో తప్పిందని అనుకున్న సమయంలో ఈ ఏడాది మరో ప్రమాదం సంభవించింది. కొద్దిరోజుల కిందట కార్గో బోట్లు ఢీకొట్టడడంతో బ్యారేజ్ కౌంటర్ వెయిట్లు విరిగి రూ.కోటి వరకు నష్టం జరిగింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు బ్యారేజ్ నిర్వాహణకు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదు. సాధారణంగా జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టులు, బ్యారేజ్‌ల నిర్వాహణకు ప్రతి ఏడాది ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతారు. వాటిని పరిశీలించి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం ఐదేళ్ల కాలంలో బ్యారేజ్ నిర్వహణకు ఒక్క రూపాయి నిధులను కేటాయించలేదు.



బ్యారేజ్ వద్ద నదిలో బోట్లు

కార్గో బోట్లతోనే ప్రమాదాలు

ఇబ్రహీంపట్నం, ఫెర్రీ, గొల్లపూడి వైపున మత్స్యకారుల బోట్లతోపాటు ఇసుకను రవాణా చేసే కార్గో బోట్లు ఉంటాయి. దీనికి దిగువన భవానీపురంలో మత్స్యకారుల బోట్లు కొన్ని లంగరు వేసి ఉంటాయి. మత్స్యకారులు వేట సాగించే బోట్ల కంటే కార్గో బోట్ల బరువు ఎక్కువగా ఉంటుంది. ఈ బోట్లను దలసరి ఇనుముతో తయారు చేస్తారు. ఒక్కోదాని బరువు 40-50టన్నుల వరకు ఉంటుంది. వేటకు ఉపయోగించే బోట్లను చెక్కతో తయారు చేస్తారు. బ్యారేజ్ వద్దకు ఇప్పటి వరకు మత్స్యకారుల బోట్లు కొట్టుకు రాలేదు. 2019లో కార్గో బోటు కొట్టుకుని వచ్చి 68వ నంబరు గేటుకు మధ్యలో ఇరుక్కుపోయింది. బ్యారేజ్‌కు వరద తగ్గుముఖం పట్టడంతో అన్ని గేట్లను నాడు మూసివేశారు. బోటు ఇరుక్కుపోవడంతో ఈ గేటును కిందికి దింపడం సాధ్యం కాలేదు. ఫలితంగా బ్యారేజ్ నుంచి నీరు వృథాగా కిందకు పోయింది. ఈ బోటు అప్పట్లో గేటును ఢీ కొట్టి ఉంటే భారీగానే నష్టం జరిగేది. గేటుకు బోటు తగలకపోవడంతో ఇంజనీర్లు ఊపిరిపీల్చుకున్నారు. బ్యారేజ్‌కు ఇన్‌ఫ్లో పెరుగుతున్న ప్రతిసారీ జలవనరుల శాఖ హెచ్చరికలు జారీ చేస్తుంది. మరో వైపు వర్షాలకు సంబంధించి వాతావరణ హెచ్చరికలు ఇస్తుంది. ఈ రెండింటితో బోట్లకు ఒడ్డున లంగరు వేస్తారు.

పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

నదిలో రాకపోకలు సాగించే బోట్ల యజమానులు మారిటైం బోర్డు నుంచి అనుమతి తీసుకుంటారు. రిజిస్ట్రేషన్ మొత్తం ఇక్కడే జరుగుతుంది. జలవనరుల శాఖ తిరగడానికి అనుమతి మాత్రమే ఇస్తుంది. అదే మత్స్యకారుల బోట్లకు మత్స్యశాఖ ఒక నంబరు కేటాయిస్తుంది. ఇలా అనుమతులు తీసుకున్న తర్వాత యజమానులు బోట్లను నదిలో తిప్పేస్తున్నారు. అసలు వాటిపై పర్యవేక్షణ బాధ్యత ఎవరిది అన్న ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకడం లేదు. 'బోట్ల వల్ల బ్యారేజ్‌కు నష్టం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయడం తప్పితే వాటిపై చర్యలు తీసుకునే ఎలాంటి అధికారం మాకు లేదు' అని జలవనరుల శాఖకు చెందిన ఓ ఇంజనీరు చెప్పారు. తాజాగా ఐదు బోట్లు ప్రకాశం బ్యారేజ్ వద్ద కౌంటర్ వెయిట్లను ఢీ కొట్టిన ఘటనలో వైసీపీకి చెందిన కోమటి రామ్మోహన్, వక్కలగడ్డ ఉషాద్రిలను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన రెండు బోట్ల యజమానులు ఇప్పటి వరకు బయటకు రాకపోవడం గమనార్హం.



ప్రకాశం బ్యారేజ్

పనులకు అనుమతి పొందండి

రాజమండ్రి రైల్వేస్టేషన్ అప్‌గ్రేడేషన్‌పై అధికారులకు ఎంపీ పురందేశ్వరి సూచన

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 13: రాజమండ్రి రైల్వేస్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులకు సంబంధించిన వివిధ అనుమతులను త్వరితగతిన పొందాలని రాజమండ్రి ఎంపీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రైల్వే అధికారులను కోరారు. శుక్రవారం విజయవాడ డీఆర్ఎం కార్యాలయంలో రాజమండ్రి రైల్వేస్టేషన్ మేజర్ అప్‌గ్రేడేషన్‌పై జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్, సంబంధిత అధికారులు, బ్రాంచి అధికారుల బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజమండ్రి రైల్వేస్టేషన్ అప్‌గ్రేడేషన్ పనులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రైల్వే అధికారుల సమన్వయంతో ప్రాజెక్టును పూర్తిచేయాలని సూచించారు. కాలపరిమితిలో పనులను పూర్తి చేయటానికి తగిన



డీఆర్ఎం నరేంద్ర ఎ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

అనుమతులను పొందాలని, వాటి ప్రాముఖ్యతను కూడా ఆమె చెప్పారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ అప్‌గ్రేడేషన్ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన అనుభూతిని కలుగజేస్తుందని తెలిపారు. రూ.284.88 కోట్ల వ్యయంతో చేపడుతున్న ప్రతిష్టాత్మక రాజమండ్రి రైల్వే స్టేషన్ మేజర్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ఒక మైలు రాయిగా నిలుస్తుందని డిఆర్ఎం తెలిపారు. రాజమండ్రి రైల్వేస్టేషన్ పడమర వైపు జి ప్లస్ త్రీ, తూర్పు వైపు జి ప్లస్ ఫైవ్‌లతో కొత్త స్టేషన్ భవనాల నిర్మాణం, 17 ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టులు, 300 కార్లు పార్కింగ్ చేసేందుకు నాలుగు స్థలాలను అభివృద్ధి చేయటం, ఆరు మీటర్ల వెడల్పు గల కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను రెండువైపులా నిర్మించటం, భవిష్యత్తులో స్టేషన్‌కు తూర్పు వైపున అదనపు ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయటం, బహుళ స్థాయి కార్ పార్కింగ్, తదితరాలను అప్‌గ్రేడేషన్‌లో పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం పి.ఈ. ఎడ్విన్, సి.హెచ్.పి.ఆర్. విఠల్, సీనియర్ డీసీఎం వి.రాంబాబు, సీనియర్ డివిఎస్ (కోఆర్డినేషన్) ఎస్.వరుణ బాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ

వన్‌టౌన్, సెప్టెంబరు 13: సింగ్‌నగర్‌లోని 3,500 వరద బాధిత కుటుంబాలకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి అందించిన నిత్యావసర సరుకులను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద ముంపు బాధితులను ఆదుకోవటానికి సీఎం చంద్ర బాబు నాయుడు నిద్రాహారాలు లేకుండా పనిచేశారని శ్లాఘించారు. బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ బుడమేరుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగారు నాయుడు, మరక శ్రీనివాస్, ఎస్.కె. జానీవలి, ఎస్.కె. పర్వీన్, మహేష్, శ్రీహరి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న విఘ్నేష్ రెడ్డి, మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే బొండా తదితరులు

కండ్రిక, అంబాపురంలో మార్పు ట్రస్ట్ సాయం..

అంబాపురం, కండ్రిక ప్రాంతాల్లో వరద ముంపు బాధితులకు మహిళా శిశు సంక్షేమ శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్, మార్పు ట్రస్ట్ డైరెక్టర్ ఆర్.సూయజ్ శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన చేతుల మీదుగా ట్రస్ట్ తరపున రూ.50 వేలు విలువైన చీరలు, దుప్పట్లు, నైటీలు, టవల్స్ న్యాప్‌కిన్లను 500 కుటుంబాలకు అందజేశారు. ఇక్కడే కొంతమందికి వాటిని పంపిణీ చేయగా, మిగతావి కండ్రిక, అంబాపురం గ్రామాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేసేందుకు వస్తున్న దాతలకు అభినందనలు తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని అన్ని వర్గాల వారికి విజ్ఞప్తిచేశారు. సూయజ్ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా కలిసికట్టుగా సర్వ స్వం కోల్పోయిన వరద బాధితులకు అం డగా నిలవాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ మాజీ అధికా రిణులు కృష్ణకుమారి, సుహాసిని, అన్న పూర్ణ, సుధ, ఎన్టీఆర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి పాల్గొన్నారు.

13వ రోజు ఆరు వేల మందికి ఆహారం

సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు వరద బాధిత కండ్రిక ప్రాంతంలోని 64వ డివిజన్‌లో 13వ రోజు కూడా ఆరు వేల మందికి అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ టీడీపీ నాయకులు కె.రవి కుమార్, కె.వరలక్ష్మి ఆధ్వర్యంలో ఉమా అన్న సైన్యం వరద బాధితులకు ట్రాక్టర్ల ద్వారా భోజనం పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.హర్ష, పి.గిరి, ఫణి, జి.పిచ్చియ్య, డి.కిరణ్ రెడ్డి, పి.సతీష్, టి. భవానీ, ఎస్.కె.బాబు, హరి, పలగాని శివ, సాయి, అప్పలనాయుడు, కోసూరి రాజేష్, కన్నా జగదీష్, పాల్గొన్నారు.

రాష్ట్రేతరుల విరాళం

కృష్ణలంక : వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి రాష్ట్రేతరులు కూడా ముందుకొచ్చి విరాళాలు అందించడం మంచి పరిణామమని గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఉయ్ ద పీపుల్ ఇండియా, ఎన్‌జీఓ, యస్విరెన్ సభ్యులు, కింగ్స్ కాలేజ్ లండన్ అలుమిని సభ్యులు కలిసి రూ.65 వేల చెక్‌ను మంత్రికి అందించారు. అలాగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ సభ్యులు, వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు కూడా మంత్రి రవీంద్రను కలిసి విరాళం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో తవిళనాడు కేడర్ ఐఏఎస్ సాహేమీనా, స్టీఫెన్ అనురాగ్ ప్రత్తిపాటి, డాక్టర్ ఎన్సీ నిహాల్, డాక్టర్ మనోజ్, సాహిల్ తదితరులు ఉన్నారు.

దత్తపీఠం రూ.25 లక్షలు

పటమట : నగరంలో బుడమేరు వరద బాధితులను ఆదుకోవాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదేశాల మేరకు దత్తపీఠం ప్రతినిధులు రూ25లక్షల చెక్కును సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడుకు అందజేశారు. ఈ దత్తపీఠం ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ హెచ్‌వీ ప్రసాద్, దుర్గాప్రసాద్, పరిమి గిరి, ఏఎస్‌ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

లబ్బీపేట : ది కృష్ణ డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియస్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.5లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఅభినందించారు. బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు.

వరద నష్టంపై సబ్ కమిటీ

మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ

కృష్ణలంక, సెప్టెంబరు 13 : వరద నష్టంపై మంత్రులు, అధికారులతో సబ్ కమిటీ వేశామని మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. కలెక్టరేట్ నుంచి సీఎం చంద్రబాబు నాయుడు పది రోజులపాటు సమీక్ష చేశారని, ఈ కమిటీ కూడా సమీక్షిస్తుందన్నారు. కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ చాలా మంది ఇళ్లల్లో ఫర్నీచర్ దెబ్బతిందని తెలిపారు. కార్లు, స్కూటర్లు, బైక్‌లు పాడైపోయాయని చెప్పారు. ప్రతి ఇంటిలో వరద నష్టం అంచనా వేశా మని తెలిపారు. నష్టం అంచనాలో కొంతమంది ఇళ్లల్లో లేరని, దెబ్బతిన్న ఇళ్లు, నీళ్లలో ఉండిపోయిన ఇళ్లు బాగా ఉన్నాయన్నారు. 53,399 ఇళ్లు, 36 వేల 2 వీలర్స్, 2 వేల కార్లు ఇతర వాహనాలు నీళ్లల్లో ఉన్నాయన్నారు. 33,508 వాహనాలు రకరకాలుగా దెబ్బతిన్నాయన్నారు. 26,545 టీవీలు, ఫ్రిజ్‌లు 31 వేలకు పైగా, వాషింగ్ మెషిన్లు 20 వేలకు పైగా దెబ్బతిన్నాయన్నారు. రూ.5 వేల కోట్ల నష్టం వ్యవసాయ రంగానికి జరిగిందని, రేపు సాయంత్రానికి వరద నష్టం అంచనా పూర్తి అవుతుందన్నారు. ముఖ్యమంత్రి ఎవరికి ఎంత నష్టం ఇవ్వాలని నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. 17వ తేదీ లోగా వరద నష్టం అంచనా పూర్తి అవుతుందని వివరించారు. బ్యాంకర్లు, ఇన్సూరెన్సు వాళ్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారని, నాలుగైదు రోజుల్లో పూర్తి వివరాలు అందించాలని వారిని కోరారన్నారు.

గుండెపోటుతో సీఎం ఎస్కార్ట్ కానిస్టేబుల్ మృతి

చంద్రనాయక్ మృతదేహానికి హోం మంత్రి నివాళి

వన్‌టౌన్/ విజయవాడ, సెప్టెంబరు 13: సీఎం చంద్రబాబు నాయుడు ఎస్కార్ట్‌లో ఆర్మ్ రిజర్వుడు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అనంతపురం జిల్లాకు చెందిన చంద్ర నాయక్ (పిసి3570, ఏఆర్) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు గన్నవరం వెళ్లేందుకు సిద్ధం చేసిన కాన్వాయ్‌లో అతను విధులు నిర్వహిస్తున్నాడు. చంద్రబాబు నాయుడు కలెక్టరేట్‌లో సమావేశం అనంతరం బయలుదేరతారనగా కానిస్టేబుల్ చంద్రనాయక్ ఆకస్మికంగా గుండెపోటుకు గురయ్యారు. హార్ట్ స్ట్రోక్ వచ్చి పడిపోవటంతో పక్కనున్న తోటి కానిస్టేబుళ్లు, అధికారులు అందరూ స్పందించి వెంటనే చికిత్స నిమిత్తం నక్కల రోడ్డులోని ఆంధ్రా హాస్పటల్‌కు తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లుగా ధృవీకరించారు. విషయం తెలుసుకున్న హోం మినిస్టర్ వంగలపూడి అనిత, సీపీ రాజశేఖర్ బాబులు ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో సొంతూరుకు తరలించారు.



ఆంధ్రా హాస్పటల్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న హోం మంత్రి అనిత

17 మంది పీపీల తొలగింపు

- ఖజానాకు భారంగా మారిన నలుగురు,
- సీఐడీ అక్కరలేదనడంతో 13 మంది...

విజయవాడ లీగల్, సెప్టెంబరు 13 : రాష్ట్రంలోని పలుప్రాంతాల్లోని కోర్టుల్లో పనిలేకుండా ఖజానాకు భారంగా మారిన నలుగురు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లను తొలగిస్తూ హోం శాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే గత ప్రభుత్వంలో సీఐడీ అభ్యర్థనతో నియమించిన వివిధ జిల్లాల్లోని 13 మంది స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సేవలు ప్రస్తుతం అక్కరలేదని, రెగ్యులర్ ప్రాసిక్యూటర్ల సేవలు వాడుకొంటామని సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ ప్రభుత్వాన్ని కోరడంతో 13 మంది స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మొత్తం 17 మందిని తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీరిలో ఖజానాకు భారంగా మారిన నిత్యావసరాల చట్టం కింద స్పెషల్ పీపీలుగా నియమించిన పీవీ రాఘవరావు-ఒంగోలు, కె.నర్సింహారెడ్డి-కర్నూల్, కురిచేటి లక్ష్మీనారాయణ-నెల్లూరు, ఎలక్ట్రిసిటీ చట్టం కింద నియమించిన మచిలీపట్నం స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శరత్‌కుమార్‌లు వున్నారు. సీఐడీ అభ్యర్థనతో తొలగించిన వారిలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నందూరి వెంకట సత్య లింగేశ్వర్ విజయనగరం, అడతక్కుల శేషబాబు విశాఖపట్టణం, పిల్లి శ్రీనివాస్ కాకినాడ, మండ్ర రాజేంద్ర ఏలూరు, కె.మెహ ర్ ప్రసాద్ మచిలీపట్నం, బెల్లపు సత్యనారాయణ విజయవాడ, గొట్టం శివప్రసాదరెడ్డి గుంటూరు, ఒంగోలు పల్లా నాగేశ్వరరావు, నెల్లూరు నానం కంకాదరి చెన్నయ్య, చిత్తూరు పానాటి విజయకృష్ణారెడ్డి, అనంతపురం పి.రాజశేఖర్, కర్నూల్ వి.నాగలక్ష్మి, కడప జి.వెంకటేశ్వర్‌రెడ్డి వున్నారు.

తెలుగు రాష్ట్రాలకు రెండు వందేభారత్ రైళ్లు

- నాగ్‌పూర్-హైదరాబాద్, విశాఖదుర్గ్-దుర్గ్ మధ్య సేవలు
- పధాని మోదీ చేతుల మీదుగా ఎల్లుండి ప్రారంభం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు మరో రెండు కొత్త వందేభారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే సికింద్రాబాద్ నుంచి 4 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, ఇప్పుడు మరో రైలు అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ రైలు సికింద్రాబాద్-నాగ్‌పూర్ మధ్య నడుస్తుందని.. నాగ్‌పూర్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు నాగ్‌పూర్ చేరుకుంటుందని చెప్పారు. కాజీపేట, రామగుండం, బల్హార్షా, చంద్రాపూర్, సేవాగ్రామ్ స్టేషన్లలో ఈ ఎక్స్‌ప్రెస్ ఆగుతుందని వివరించారు. విశాఖపట్నం-దుర్గ్ (ఛత్తీస్‌గఢ్) మధ్య మరో వందే భారత్ రైలు సేవలు అందిస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు. రాయ్‌పూర్, మహాసముంద్, ఖరియార్ రోడ్, కాంతబంజి, తిత్లాగఢ్, కేసింగా, రాయగడ, విజయనగరం మీదుగా విశాఖపట్నం చేరుకుంటుందని తెలిపారు. ఈ రెండు రైళ్లను ఈ నెల 16న అహ్మదాబాద్ నుంచి ప్రధాని మోదీ ప్రారంభిస్తారని చెప్పారు. ఆ రోజు ప్రధాని దేశవ్యాప్తంగా 10 వందే భారత్ రైళ్లను ప్రారంభిస్తారని వివరించారు. వందేభారత్ రైళ్లపై సామాన్యులు మక్కువ చూపుతున్నారని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు వందశాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీ ఉందని పేర్కొన్నారు. నాగ్‌పూర్ నుంచి మొదలయ్యే వందే భారత్ రైలుకు సికింద్రాబాద్‌లో స్వాగతం పలకాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆహ్వానం పంపించారని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలకు వందే భారత్ రైళ్లను కేటాయించిన ప్రధాని మోదీకి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా..

వృద్ధుల ఆరోగ్య సంక్షేమానికి ప్రధాని మోదీ కీలక నిర్ణయం తీసుకున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజనను మరింత విస్తరించి.. 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులందరికీ రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తించేలా కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ పథకం కింద ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రముఖ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యాన్ని పొందవచ్చని చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలను కిషన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా లబ్ధిదారులకు ప్రత్యేకమైన గుర్తింపు కార్డును అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు పరిధిలో ఉన్న కుటుంబాల్లోని 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు అదనంగా ఏడాదికి రూ.5 లక్షల టాప్-అప్ కవర్ అందించనున్నారు. పథకానికి మార్పులు చేయడం ద్వారా 2.72 కోట్ల మంది అదనంగా ప్రయోజనాలు పొందనున్నారు.

గుంటూరు స్టేషన్ హోదా పెరిగింది

- ఎన్ఎస్‌జీ 3 నుంచి రెండులోకి మార్పు
- దక్షిణ మధ్య రైల్వేలో మరో మూడింటి హోదా పెంపు

గుంటూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో నాలుగు రైల్వేస్టేషన్ల హోదాని రైల్వేబోర్డు పెంచింది. ఇప్పటి వరకు నాన్ సబర్బన్ గ్రూపు-3 కేటగిరీలో ఉన్న వీటిని ఎన్ఎస్‌జీ-2లోకి తీసుకొచ్చింది. ఆయా రైల్వేస్టేషన్ల నుంచి రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్ ప్రయాణీకుల సంఖ్య, టికెట్ చార్జీల రూపంలో వచ్చిన ఆదాయం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. రేణిగుంట, లింగంపల్లి, గుంటూరు, ఔరంగబాద్ స్టేషన్లకు ఈ హోదా దక్కింది. దీంతో ఆ మేరకు ప్రయాణీకుల సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి రిజర్వ్‌డ్ బోగీల్లో 16 లక్షల 63 వేల 252 మంది, అన్‌రిజర్వ్‌డ్ పెట్టెల్లో 42,64,787 మంది... మొత్తం 58 లక్షల 28 వేల 039 మంది ప్రయాణిస్తున్నారు. వీరి ద్వారా రైల్వేకు రూ.110 కోట్ల 70 లక్షల 97 వేల 582 ఆదాయం వచ్చింది. ఈ స్టేషన్ నుంచి కూడా ప్రయాణీకుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువమంది చుట్టుపక్కల ఉన్న విజయవాడ, మంగళగిరి, తెనాలి, రేపల్లె, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్లకు ప్రయాణం చేస్తున్నారు. దీని వలన ఆదాయం తక్కువగా వస్తున్నది. రేణిగుంట రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్ బోగీల్లో మొత్తంగా 33 లక్షల 64 వేల 805 మంది ప్రయాణిస్తున్నారు. టికెట్ల ద్వారా రూ.131 కోట్ల 3 లక్షల 55 వేల 167 ఆదాయం సమకూరింది. లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి మొత్తంగా 58 లక్షల 43 వేల 624 మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ స్టేషన్ నుంచి రూ.111 కోట్ల 11 లక్షల 12 వేల 576 వస్తున్నది. లింగంపల్లి స్టేషన్ నుంచి ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. దీని వలన ప్రయాణీకుల సంఖ్య హెచ్చుగా ఉన్నా ఆదాయం ఆ స్థాయిలో లేదు. జోన్ పరిధిలో ఉన్న మహారాష్ట్రకు చెందిన ఔరంగబాద్ రైల్వేస్టేషన్ నుంచి రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్ బోగీల్లో కలిపి మొత్తం 51,23,562 మంది ప్రయాణిస్తున్నారు. వీరి ద్వారా రూ.100 కోట్ల 12 లక్షల 65 వేల 230 ఆదాయం సమకూరింది. ఈ స్టేషన్ నుంచి కూడా లోకల్‌గా ప్రయాణించే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నది. ఈ గణాంకాల ఆధారంగా రైల్వేబోర్డు నాన్ సబర్బన్ గ్రూపు స్టేషన్లను వర్గీకరించింది.

ద.మ. రైల్వేకు 5 ఇంధన పరిరక్షణ అవార్డులు

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ ఇంధన నిర్వహణతో దక్షిణ మధ్య రైల్వే 5 ఇంధన పరిరక్షణ అవార్డులు అందుకుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నిర్వహించిన నేషనల్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో అవార్డులను ఉన్నతాధికారులు అందుకున్నారు. భవనాల విభాగంలో ద.మ. రైల్వే ప్రధాన కార్యాలయమైన రైల్ నిలయానికి 'ఇంధన సామర్థ్యం' అవార్డు దక్కింది. రైల్ నిలయానికి సంబంధించి 100% ఎల్ఈడీ లైట్లు, బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఆధునిక లిఫ్టులు, స్టార్ రేటెడ్ ఏసీల ఏర్పాటు, సోలార్ వాటర్ హీటర్ల వినియోగం, విద్యుత్తు ఆదాకు టైమర్లు, ఆక్యుపెన్సీ సెన్సర్ల వాడకం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డును ప్రకటించారు. ఇటు సికింద్రాబాద్‌లోని లేఖా భవన్, హైదరాబాద్ భవన్, మౌలాలిలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, లాలాగూడలోని క్యారేజ్ వర్క్‌షాప్‌నకు కూడా సీఐఐ అవార్డులు దక్కాయి. దీనిపై ద.మ. రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఇంధన పొదుపులో దక్షిణ మధ్య రైల్వే ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఐదు అవార్డులు రావడానికి కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబ్ సిబ్బందిని ఆదుకోండి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు యూనియన్ నేతల విజ్ఞప్తి

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్‌డబ్ల్యూఎస్ ఔట్‌సోర్సింగ్ ల్యాబ్ సిబ్బందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా పరిగణించేందుకు సంబంధించి పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌ను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఇంటర్నల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ లేబరేటరీ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో 20 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న తమకు నెలనెలా జీతాలు సక్రమంగా అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీంతో పాటు రాజకీయ జోక్యంతో ఇటీవల కొంతమందిని అకారణంగా తొలగించి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని వాపోయారు. రాష్ట్రవ్యాప్తంగా 111 నీటి నాణ్యతా ప్రయోగశాలల్లో అసిస్టెంట్ కెమిస్ట్, మైక్రో బయాలజిస్ట్, ల్యాబ్ అసిస్టెంట్లు, ల్యాబ్ హెల్పర్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితర కేటగిరీల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో సుమారు 510 మంది 10-20 ఏళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కలగజేసుకొని తమ సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ అధ్యక్షుడు డీ మూర్తిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించండి: కేఎస్

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. యూటీఎఫ్ నేతలు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రసాద్‌తో కలిసి శుక్రవారం సచివాలయంలో సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఏపీపీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగ నియామకాలు ప్రారంభించాలన్నారు. 2003 డీఎస్సీ టీచర్లు, ఇతర టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇన్‌చార్జి సీసీఎల్ఏగా శ్రీకేష్ బి.లత్కర్

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి ఈనెల 22 వరకు సెలవుపై వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి సీసీఎల్ఏగా సర్వే, సెటిల్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీకేష్ బి.లత్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇక సెబ్‌లన్నీ ఎక్సైజ్ స్టేషన్లు

- మళ్లీ పూర్వ స్వరూపంలోకి ఎక్సైజ్ శాఖ
- ఉమ్మడి జిల్లాలకు ఒక్కో డీసీ, ఏసీ
- అనకాపల్లి, రాజమండ్రికి అదనంగా ఏసీలు
- ఐపీఎస్ నేతృత్వంలో ఎన్‌ఫోర్స్‌మెంట్
- శాఖ పునర్నిర్మాణ ఉత్తర్వులు జారీ

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ ఎట్టకేలకు పూర్తిగా పాత స్వరూపంలోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను తాజాగా రద్దు చేయడంతో.. శాఖ పునర్నిర్మాణంపై ఎక్సైజ్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. 2020కు ముందున్న తరహాలోకి ఆ శాఖను తీసుకొచ్చారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో 208 సెబ్ స్టేషన్లు ఉండగా అవి ఎక్సైజ్ స్టేషన్లుగా మారిపోతాయి. 28 జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఉంటాయి. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు 19 ఉంటాయి. గత ప్రభుత్వంలో కొత్త జిల్లాలను ఏర్పాటు చేయగా అంతకు ముందున్న ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన కొందరు అధికారులను కేటాయించారు. మొత్తం శాఖకు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి ప్రధానాధికారిగా వ్యవహరిస్తారు. డిస్టిలరీస్ కమిషనర్ బాధ్యతలను కూడా కమిషనరే చూస్తారు. ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్, ముగ్గురు జాయింట్ కమిషనర్లు ఉంటారు. మద్యం నేరాల నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఉంటుంది. దానికి సీనియర్ ఎస్పీ లేదా డీఐజీ స్థాయి ఐపీఎస్ అధికారి నేతృత్వం వహిస్తారు. ఉమ్మడి జిల్లా ప్రకారం జిల్లాకో డిప్యూటీ కమిషనర్ (డీసీ), అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) ఉంటారు. అయితే నాటుసారా, గంజాయి ప్రభావం ఎక్కువగా ఉన్న అనకాపల్లి, రాజమండ్రిలకు అదనంగా ఒక్కో అసిస్టెంట్ కమిషనర్‌ను కేటాయించారు. కొత్త జిల్లాల ప్రకారం జిల్లాకో ఎక్సైజ్ సూపరింటిండెంట్ (ఈఎస్) పనిచేస్తారు.

మద్యంపై నిఘా

గత ప్రభుత్వం సెబ్‌ను ఏర్పాటుచేసి దానికి అనేక రకాల బాధ్యతలు అప్పగించింది. ఎర్రచందనం, ఇసుక, గుట్కా, గ్యాంబ్లింగ్ బాధ్యతలు అప్పగించడంతో సెబ్ దేనిపైనా దృష్టిసారించలేకపోయింది. ఇప్పుడు శాఖను పూర్తిగా పాత విధానంలోకి తేవడంతో మళ్లీ మద్యం నేరాలపై దృష్టి పెట్టనుంది. అలాగే నాటుసారా నియంత్రణ, గంజాయి నిర్మూలనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనిచేస్తుంది.

ఉద్యోగుల హర్షం

దాదాపు ఐదేళ్ల తర్వాత ఎక్సైజ్ శాఖ పాత స్వరూపంలోకి మారడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం ఉద్యోగుల అభిప్రాయాలు తీసుకోకుండానే ఏకపక్షంగా సెబ్‌ను సృష్టించింది. ఎక్సైజ్‌లోని 70 శాతం మంది ఉద్యోగులను అందులోకి బదిలీ చేసింది. దీంతో అప్పటినుంచీ తమకు సెబ్ వద్దని పాత విధానమే కావాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేస్తూ వచ్చారు. కానీ, గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సెబ్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని గుర్తించిన కొత్త ప్రభుత్వం వెంటనే దాన్ని రద్దుచేసింది.

కేబినెట్ తర్వాత మద్యం పాలసీకి నోటిఫికేషన్

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రి మండలి సమావేశం ముగిసిన వెంటనే నూతన మద్యం పాలసీకి నోటిఫికేషన్ జారీ చేయాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫారసులకు కేబినెట్‌లో ఆమోదం లభించాల్సి ఉంది. కాగా, మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం శుక్రవారం మంగళగిరిలోని సెబ్ కార్యాలయంలో జరిగింది. మంత్రులు కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్ భేటీ అయ్యి నూతన పాలసీపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రైవేటు షాపుల విధానమే ఉత్తమం అనే అభిప్రాయాలు ఎక్కువగా వ్యక్తమయ్యాయి. అయితే ప్రైవేటు, ప్రభుత్వ విధానాలను కేబినెట్ ముందుంచాలని, సీఎం దానిపై నిర్ణయం తీసుకుంటారని సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3,396 షాపులు ఉండగా, అదే సంఖ్యను ఉంచాలా? షాపులు పెంచాలా? అనేదానిపైనా చర్చించారు.

100 కుటుంబాలకో డిజిటల్ చాంపియన్

- పట్టణ ప్రజల్లో డిజిటల్ సాధికారతే లక్ష్యం
- నియామకాలు ప్రారంభించిన మెప్మా
- తొలిగా విజయవాడలో 2 వేల మందికి శిక్షణ
- బ్యాంకింగ్, ఇతర యాప్‌ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించే స్వచ్ఛంద విధి
- డిజిటల్ చాంపియన్లుగా అందరూ మహిళలే

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని అన్ని కుటుంబాల్లో డిజిటల్ సాధికారత సాధించే లక్ష్యంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) డిజిటల్ చాంపియన్లను నియమించింది. ప్రతి 100 కుటుంబాలకు ఒక డిజిటల్ చాంపియన్‌ను ఏర్పాటు చేసి, వారికి డీజీ-లక్ష్మీ/ఐశ్వర్య లక్ష్మీగా నామకరణం చేశారు. ఈ డిజిటల్ చాంపియన్లు అందరూ మహిళలే. 'డిజిటల్ చాంపియన్' అనేది పూర్తిగా స్వచ్ఛంద సేవ అని, ఉద్యోగం కాదని, ప్రజలకు సేవ చేయాలనుకునే ఆసక్తి కలిగిన వారిని మాత్రమే డిజిటల్ చాంపియన్‌గా ఎంపిక చేస్తున్నట్లు మెప్మా మిషన్ డైరెక్టర్ కృష్ణతేజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదట విజయవాడలో 4 వేల మందిని గుర్తించామని తెలిపారు. తొలి విడతలో సాంకేతిక నైపుణ్యం కలిగిన 2 వేల మంది మహిళలకు వర్చ్యువల్ శిక్షణ అందించినట్లు తెలిపారు. ప్రతి 100 కుటుంబాలను ఒక క్లస్టరుగా విభజించి ఒక్కో క్లస్టరుకు ఒక్కో డిజిటల్ చాంపియన్‌ను నియమించామని కృష్ణతేజ్ వెల్లడించారు. వాళ్లు తమ క్లస్టరులోని 100 కుటుంబాలకు ప్రతినిధిగా ఉండి, ప్రజల అనుమతితో వాళ్ల మొబైల్ ఫోన్‌లో బ్యాంకింగ్, ఇతర అవసరమైన యాప్‌లను ఎలా ఇన్‌స్టాల్ చేయాలి? ఎలా లాగిన్ అవ్వాలి? ఎలా వినియోగించుకోవాలి? అనే విషయాలను నేర్పిస్తారని వివరించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తారని, వ్యక్తిగత బ్యాంకు లావాదేవీలను డిజిటల్ పద్ధతిలో చేసేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని మెప్మా డైరెక్టర్ కృష్ణతేజ్ తెలిపారు.

వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలి

- పంచాయతీరాజ్ చాంబర్ డిమాండ్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: వలంటీరు వ్యవస్థను రద్దు చేయాలని, సచివాలయ వ్యవస్థను గ్రామ పంచాయతీ రాజ్ శాఖలో విలీనం చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ డిమాండు చేశారు. వలంటీర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని పంచాయతీ కార్యదర్శులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలకు ఇవ్వాలన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచులతో చర్చించకుండా గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ నిధులను దారిమళ్లించడంతో అభివృద్ధి ఆగిందన్నారు. అందుకే కృతనిశ్చయంతో పనిచేసి జగన్‌ను ఓడించామని చెప్పారు. ఏ ప్రయోజనాల కోసమైతే జగన్‌ను ఓడించామో.. వాటిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుంచి ఆశిస్తున్నామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే పంచాయతీలకు రూ.12.48 కోట్లను జమ చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. వరద బాధితుల సహాయార్థం రూ.6 కోట్లు అందజేసినందుకు, వరద ప్రభావిత 400 పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున ప్రకటించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. తాము కూడా వరద బాధితుల సహాయార్థం ఒకరోజు వేతనం రూ.7.7 కోట్ల చెక్‌ను పవన్‌కు అందజేశామన్నారు.

కమలతో మరోసారి సంవాదం ఉండదు: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 13: అమెరికా అధ్యక్ష పదవికి డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కమలా హారీస్‌తో మరోసారి సంవాదం ఉండబోదని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. మంగళవారం ఆయన కమలా హారీస్‌తో జరిగిన డిబేట్‌లో పాల్గొనగా, అంతకుముందు జూన్‌లో అధ్యక్షుడు జో బైడెన్‌తో జరిగిన డిబేట్‌లో పాల్గొన్నారు. కమలా హారీస్‌తో జరిగినదే చివరి డిబేట్ అని ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ నాయకులు మాత్రం మళ్లీ డిబేట్ ఉండాలని భావిస్తున్నారు. దీన్ని తిరస్కరించిన ట్రంప్ "ప్రైజ్ మనీ కోల్పోయినవారే రీమ్యాచ్ జరగాలని కోరుకుంటారు"న్నారు.

ఎన్నికల వేళ... జమ్మూలో రెండు ఎన్‌కౌంటర్లు

- ఇద్దరు జవాన్ల మృతి

శ్రీనగర్, సెప్టెంబరు 13: మరో 4 రోజుల్లో ఎన్నికలు ప్రారంభం కానున్న జమ్మూకశ్మీర్‌లో ఇంకా తుపాకీ మోతలు ఆగడం లేదు. కిష్త్వార్ ప్రాంతంలో శుక్రవారం భద్రతాబలగాలకు ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మరణించగా మరో ఇద్దరు గాయపడ్డారు. జులైలో దోడాలో నలుగురు సైనికులను చంపిన ఘటనలో ఈ ఉగ్రవాదుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. కథువాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో సైన్యం ఇద్దరు ముష్కరుల్ని మట్టుబెట్టింది. ఇదిలావుండగా, ఘటన జరిగిన కిష్త్వార్ సహా దోడా, అనంత్‌నాగ్, పుల్వామా వంటి పలు సెగ్మెంట్లలో ఈ నెల 18న పోలింగ్ జరగనుంది.

17న ప్రత్యేక ప్లాంటేషన్ డ్రైవ్

- ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్ కుమార్

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 17న 'ప్లాంట్ ఫర్ మదర్' పేరుతో ప్రత్యేక ప్లాంటేషన్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరోసారి చేపట్టాలని అన్ని జిల్లాల డ్వామా పీడీలను ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముక్ కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 22న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు 26 జిల్లాల్లో ఒకసారి నిర్వహించారు. 3,22,972 మొక్కలు నాటడంలో 49,091 మంది భాగస్వామ్యమయ్యారు. మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు మరోసారి ఈ కార్యక్రమం చేపట్టాలని ఈనెల 11న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సూచించినట్లు తెలిపారు.

100 రోజుల కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయండి: సీఎస్

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద ఆర్థికేతర, స్వల్ప కాలంలో పరిష్కరించగలిగిన అంశాలను వేగంగా పూర్తి చేసేందుకు వెంటనే ఆయా శాఖలు తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో వైద్యారోగ్యశాఖ, హోం, జీఏడీ, న్యాయ, దేవదాయ, ప్రణాళిక తదితర శాఖలకు సంబంధించిన ప్రధాన్యత అంశాలు, ముఖ్యంగా వంద రోజుల్లో పరిష్కరించగలిగే ఆర్థికేతర అంశాలపై సమీక్షించారు.

మెడికల్ కాలేజీలపై అంతులేని నిర్లక్ష్యం

- ఐదేళ్ల పాలనలో పూర్తిచేసింది 25 శాతం పనులే
- పులివెందుల కాలేజీపైనా జగన్‌కు చిత్తశుద్ధి లేదు
- రూ.2,125 కోట్లకు రూ.1,451 కోట్ల బిల్లులు చెల్లింపు
- నాబార్డు, కేంద్ర నిధులతో బిల్లులు చెల్లించి డబ్బాలు
- వైద్య కళాశాలలకు రూపాయి ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- ఇంకా రూ.674 కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే..
- అడ్మిషన్లు నిలిచిపోవడానికి జగన్‌దే బాధ్యత
- మాజీ సీఎంపై మంత్రి సత్యకుమార్ ధ్వజం
- ఆయుష్ విభాగాన్ని బలోపేతం చేస్తామని వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారిందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీల దుస్థితికి మాజీ సీఎం జగనే కారణమని మండిపడ్డారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు నిర్మిస్తామని నానా ఆర్భాటం చేసిన జగన్, వాటిపై పూర్తి నిర్లక్ష్యం వహించారని ధ్వజమెత్తారు. ఈ కాలేజీలను రూ.8,480 కోట్లతో నిర్మించాలని గత ప్రభుత్వం భారీ ప్రణాళిక వేసి చతికిలపడిందని ఎద్దేవా చేశారు. ఇందులో రూ.4,948 కోట్లు నాబార్డు, కేంద్రం, సీఎస్ఎస్ కింద తెవాలని నిర్ణయించిందని చెప్పారు. ఐదేళ్ల పాలనలో రూ.2,125 కోట్ల పనులు (25%) మాత్రమే గత ప్రభుత్వం చేయగలిగిందని తెలిపారు. అందులో రూ.1,415 కోట్ల బిల్లులే చెల్లించారని, ఇంకా రూ.674 కోట్ల బిల్లులు వివిధ నిర్మాణ సంస్థలకు జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని మంత్రి వివరించారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే తప్ప కాలేజీల నిర్మాణం చేపట్టలేమని ఆ సంస్థలు తేల్చిచెప్పేశాయని తెలిపారు. గతంలో చెల్లించిన రూ.1,415 కోట్లలో ఒక్క రూపాయి కూడా వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదని, కేంద్రం సీఎస్ఎస్ కింద, నాబార్డు విడుదల చేసిన నిధులతో చెల్లింపులు చేసేసి, తాము ఏదో చేసినట్లు జగన్ చెప్పుకున్నారని ఆరోపించారు. తన సొంత నియోజకవర్గం పులివెందుల కాలేజీపై కూడా ఆయనకు చిత్తశుద్ధి లేదని, ఇప్పటికీ ఆ కాలేజీ పనులు పూర్తి చేయలేదని 47.5 శాతం వైద్య సిబ్బంది, 36.92 శాతం ట్యూటర్ల కొరత ఉందని ఎన్ఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసిందని చెప్పారు. ఈ లోటులను మూడు నెలల వ్యవధిలో కూటమి ప్రభుత్వం ఎలా పూర్తి చేయగలదో జగనే చెప్పాలన్నారు. రెండో దశలో నిర్మించాల్సిన మరో 4 కాలేజీలు, మూడోదశలో నిర్మించాల్సిన 6 కాలేజీల పరిస్థితి ఇంకా దారుణంగా ఉందని తెలిపారు. పాత మెడికల్ కాలేజీల్లో ఉన్న సిబ్బందిని కొత్త కాలేజీకి బదిలీ చేసి పాతవాటిలో వైద్య విద్య, వైద్య సేవల నాణ్యతను కూడా జగన్ ప్రభుత్వం చెడగొట్టిందని ఆరోపించారు. ఈ విద్యా సంవత్సరంలో మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు చేపట్టకపోవడానికి కేవలం జగనే బాధ్యుడని మంత్రి స్పష్టం చేశారు. కచ్చితంగా 17 మెడికల్ కాలేజీల్లోనూ అడ్మిషన్లు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆయుష్ సేవల అభివృద్ధికి కేంద్రం ఎప్పుడూ లేనివిధంగా రూ.90.84 కోట్లు నిధులు అందించేందుకు సమ్మతించిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో ఆయుష్ విభాగానికి కేవలం రూ.38 కోట్లు మాత్రమే వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో 90 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ఎన్ఏబీహెచ్ గుర్తింపు కోసం పంపగా, 89 కేంద్రాలకు మంజూరు లభించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఉన్నందున మరో కళాశాల నిర్మాణానికి సాయం కోరగా కేంద్రం సానుకూల స్పందించిందని చెప్పారు. ధర్మవరంలో నూతన ఆయుర్వేద కాలేజీ, దానికి అనుబంధంగా 100 పడకల ఆస్పత్రిని నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఆయుర్వేద కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరానికి అదనంగా యూజీ, పీజీ సీట్ల కేటాయింపుపైనా కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. విశాఖలో 50 పడకల ఆయుష్ ఆస్పత్రికి రూ.8.50 కోట్లు, కాకినాడ ఆస్పత్రికి రూ.8 కోట్లు, ఆరోగ్య మందిరాలకు రూ.5.75 కోట్లు, ఆయుష్ కళాశాలలకు రూ.20 కోట్లు కేంద్ర నిధులు లభించనున్నట్లు మంత్రి వివరించారు.

కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులు

- బాధితుల్లో విజయనగరం డీటీ, కంటైనర్‌లో తలదాచుకుంటున్న వైనం
- బాధితులతో మాట్లాడిన కేంద్ర మంత్రి రామ్మోహన్, ఎంపీ కలిశెట్టి
- మంత్రి లోకేశ్ ఆదేశాలతో బాధితులను రప్పించేందుకు చర్యలు

విజయనగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేదార్‌నాథ్ యాత్రలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 16 మంది తెలుగు యాత్రికులు చిక్కుకుపోయారు. వీరంతా సదరన్ ట్రావెల్ ద్వారా ఢిల్లీ నుంచి కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లారు. వీరిలో విజయనగరానికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ కొట్నాన శ్రీనివాసరావు దంపతులతో పాటు, వారి సమీప బంధువులు త్రినాథ్‌రావు దంపతులు ఉన్నారు. వీరు కేదార్‌నాథ్ ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత త్రినాథ్‌రావు దంపతులు కిందికి వెళ్లిపోయారు. కొట్నాన శ్రీనివాసరావు దంపతులు, మిగిలిన వారు ఆలయం వద్దే నిలిచిపోయారు. అనంతరం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. కుండపోత వర్షం కురవటంతో వారు అక్కడ చిక్కుకు పోయారు. గురువారం రాత్రంతా భారీ వర్షం, తీవ్రమైన చలిలోనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు హెలిక్టాపర్ వస్తుందని అధికారులు ప్రకటించినా, వాతావరణం అనుకూలంగా లేక వెళ్లలేకపోయింది. మరో మూడు రోజుల వరకూ విమాన సర్వీసులు నడపడానికి వీలుకాదని అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం తాము కంటైనర్‌లోనే తలదాచుకుంటున్నామని డీటీ శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. కేదార్‌నాథ్ యాత్రలో తెలుగు యాత్రికులు చిక్కుకున్నారన్న సమాచారాన్ని తెలుసుకుని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఉదయం డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోన్ చేసి యోగక్షేమాలను తెలుసుకున్నారు. యాత్రికులకు భరోసానిస్తూనే, వారిని క్షేమంగా రప్పించేందుకు మంత్రి లోకేశ్ అధికారులతో మాట్లాడుతున్నారన్నారు.

ఏపీ భవన్ ఆర్సీని కలిసిన ఎంపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేదార్‌నాథ్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికుల్ని త్వరగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు కృషిచేయాలని ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్(ఆర్‌సీ)కు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. యాత్రికులు కేదార్‌నాథ్‌లో చిక్కుకోవడంతో మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు ఎంపీ కలిశెట్టి శుక్రవారం ఇక్కడ ఆర్‌సీతో భేటీ అయ్యారు. యాత్రికుల్లో పలువురు ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని త్వరగా గమ్యస్థానాలకు చేర్చేదిశగా వెంటనే ప్రయత్నాలు ప్రారంభించాలని కలిశెట్టి కోరారు.

విశాఖ ఉక్కుకు రూ.3 వేల కోట్లు?

- ఢిల్లీలో ఉన్నత స్థాయిలో సంప్రదింపులు
- అందులో రూ.1,250 కోట్లు వీఆర్ఎస్‌కే!
- నిధులు సరిపోవని ఉద్యోగ సంఘాల ఆవేదన

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)




ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారానికి ఏ విధంగా సాయం చేయాలనే దానిపై ఢిల్లీలో గత రెండు రోజులుగా ఉన్నత స్థాయి చర్చలు జరుగుతున్నాయి. కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడపాలని, అందుకు రూ.11 వేల కోట్లు సాయం చేయాలని కేంద్రానికి ఉక్కు యాజమాన్యం లేఖ సమర్పించింది. దీనిపై ఉక్కు మంత్రిత్వ శాఖ, దీపం, ఆర్థిక శాఖలకు చెందిన సెక్రటరీలు, సెయిల్, ఎన్ఎండీసీ, ఎంఓఐఎల్‌కు చెందిన సీఎండీలు, విశాఖ ఉక్కు ఇన్‌చార్జి సీఎండీ కూలంకుషంగా చర్చించారు. అంత పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చే అవకాశం లేదని, ప్రస్తుతం రూ.3 వేల కోట్లు మాత్రమే ఇస్తామని, దానికి తగిన ప్రతిపాదనలు పంపాలని విశాఖ ఉక్కు యాజమాన్యానికి స్పష్టం చేసింది. దాంతో ఆ మేరకు మళ్లీ అంచనాలు తయారు చేస్తున్నారు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఎంత సాయం చేయాలనే దానిపై మళ్లీ మంగళవారమే కమిటీ భేటీ అవుతుంది. అంతవరకు విశాఖ కర్మాగారంలో అరకొరగానే ఉత్పత్తి జరుగుతుంది.

రూ.1,250 కోట్లు వీఆర్ఎస్‌కే?

విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి కేంద్రం నిర్ణయించింది. దీనికి స్వచ్ఛంద పదవీ విరమణ పథకం పెట్టాలని ఆదేశించింది. ఇందుకోసం రూ.1,250 కోట్లు ఇస్తామని గతంలోనే తెలిపింది. ఇప్పుడు సాయంగా ఇచ్చే రూ.3 వేల కోట్లలో ఈ రూ.1,250 కోట్లు కూడా ఉంటాయని, అవి పోతే ఇక మిగిలేది రూ.1,750 కోట్లేనని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. బొగ్గు కొరత తీవ్రంగా ఉండడంతో ఇటీవల మూడు నౌకలతో రెండు లక్షల టన్నులు తెప్పించడానికి రూ.450 కోట్ల విలువైన ఆర్డర్ పెట్టారని, కేంద్రం నిధులు ఇస్తే ఆ మొత్తం కూడా అందులో నుంచే చెల్లించాల్సి ఉంటుందని అంటున్నారు. ఇవన్నీ ప్రస్తుతం ఉన్న ఏకైక బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడపడానికి సరిపోతాయని, మూసేసిన మిగిలిన రెండు బ్లాస్ట్ ఫర్నేసులకు కూడా నడపాలంటే ఇంకా ఎక్కువ నిధులు అవసరమని, ఆ మేరకు సాయం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎంత మొత్తం ఇస్తారనేది ముఖ్యం కాదని, ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులని, అందుకు తగిన వనరులు ఉన్నందున పూర్తిస్థాయిలో నడిపేందుకు అవసరమైన సాయం చేయాలని, అప్పుడు నష్టాల నుంచి బయటపడతామని అంటున్నారు. చిన్నపాటి సాయం పనికి రాదని, దీనిపై ఢిల్లీ పెద్దలు పునాలోచన చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో కల్పించుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

వరద బాధిత టీడీపీ కార్యకర్తలకు బుద్దా వెంకన్న సాయం



వరద బాధిత టీడీపీ కార్యకర్తలకు ఫ్రిజ్‌లు, టీవీలు అందిస్తున్న బుద్దా భూలక్ష్మి, కాండ్రేగుల రవీంద్ర

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 13: బుడమేరు వరద ముంపునకు గురైన బాధిత టీడీపీ కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సహాయాన్ని అందచేశారు. శుక్రవారం బందరు రోడ్డులోని విజయ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లో బాధిత టీడీపీ కార్యకర్తలు 15 మందికి ఫ్రిజ్‌లు, టీవీలు అందచేశారు. కార్యక్రమంలో వెంకన్న సతీమణి భూలక్ష్మి, ఆయన అల్లుడు కాండ్రేగుల రవీంద్ర పాల్గొని బాధితులకు వస్తువులను పంపిణీ చేశారు. వైరల్ ఫీవర్‌తో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న ఫోన్‌లో బాధితులతో మాట్లాడారు. అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఇప్పటికే నా వంతు బాధ్యతగా సీఎం సహాయ నిధికి రూ.5 లక్షలు అందచేశాను. టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా అండగా నిలిచి పోరాటాలు చేసిన కార్యకర్తలు ఈ వరదల్లో తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకోవడం బాధ్యతగా తలచి గృహోపకరణాలను అందిస్తున్నా. నాతో కలసి పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలెవరైనా వరద ముంపులో నష్టపోయినట్లయితే వివరాలను నాకు తెలియజేయండి. వారందరికీ తప్పకుండా నావంతు సాయం చేస్తా' అని వెంకటన్న తెలిపారు.